**మూడేళ్ల కనిష్టానికి రష్యా ముడి చమురు దిగుమతులు**

రష్యాకు చెందిన సంస్థలపై అమెరికా తాజా ఆంక్షల నేపథ్యంలో ఈ ఏడాది డిసెంబర్ నెలలో ఆ దేశం నుంచి చమురు దిగుమతులు తగ్గే అవకాశాలు కనిపిస్తున్నాయి. రియల్ టైమ్ డేటా అనలిటిక్స్ కంపెనీ కెప్లర్ ప్రకారం, భారత్‌లోకి రష్యా ముడి చమురు దిగుమతులు డిసెంబర్‌లో రోజుకు దాదాపు 1.2 మిలియన్(12 లక్షల) బ్యారెళ్లకు (బీపీడీ) తగ్గుతాయని అంచనా.

# ధర్మఘంటి

జాతీయ తెలుగు దినపత్రిక

TELTEL/2012/47103

**తగ్గిన ఎటిఎంలు**

బ్యాంక్‌లు ఎటిఎం కేంద్రాల సంఖ్యను కుదిస్తోన్నాయి. రిజర్వు బ్యాంక్ సమాచారం మేరకు.. ఆర్థిక సంవత్సరం 2024-25లో బ్యాంక్‌లు శాఖలను పెంచుకోగా.. మరోవైపు ఎటిఎం కేంద్రాలను మాత్రంగా తగ్గించుకున్నాయి. 2025 మార్చి 31 నాటికి దేశవ్యా ప్తంగా ప్రభుత్వ, ప్రయివేటు బ్యాంకుల ఎటిఎంలు 2,51,057కి తగ్గాయి. అంతక్రితం ఏడాది 2,53,417గా ఉన్నాయి. పలు ప్రభుత్వరంగ బ్యాంకులు విలీనం కావడంతో వీటి సంఖ్య తగ్గిపోయాయని ఆ వర్గాలు పేర్కొంటున్నాయి.

నల్లగొండ | సంపుటి : 12 | సంచిక : 278 | ఎడిటర్ : మేడే శాంతికుమార్ | ఆదివారం 4 జనవరి 2026 | పేజీలు : 12 | వెల : 3

**Circulated by:** Nalgonda, Hyderabad, Warangal, Ranga Reddy, Medak, Khammam, Adilabad, Nizamabad, Mahabub Nagar, Karimnagar




## తెలంగాణ నుంచే ఇవన్నీ నేర్చుకున్నాను

- ప్రజా సమస్యల పరిష్కారం కోసం జనసైనికులు ముందు ఉండాలి
- ఆ పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ పిలుపు
- వంద మైళ్ళ ప్రయాణం కూడా ఒక్క అడుగుతో ప్రారంభం అవుతుంది
- రాజకీయాల్లో గెలుపు ఓటములు సహజం
- తెలంగాణ నేల తనకు పోరాడే ధైర్యాన్ని ఇచ్చింది
- ఈ ప్రాంత ప్రజల స్ఫూర్తే తనను ముందుకు నడిపించింది

**జగిత్యాల**

జిల్లాలో నిర్వహించిన జనసేన నాయకులు, కార్యకర్తల సమావేశంలో పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ కీలక వ్యాఖ్యలు చేశారు. రాజకీయాల్లో గెలుపుఓటములు సహజమని, అయితే పోటీ చేయడం అలవాటు చేసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. రాజకీయ జీవితంలో తనకు పోరాట పటిమ, చైతన్యం, తెగింపు అన్నీ తెలంగాణ నుంచే వచ్చాయని పవన్ కళ్యాణ్ వెల్లడించారు. తెలంగాణ నేల - మిగతా3లో

# అసెంబ్లీలో రండి.. తేల్చుకుందాం

- బీఆర్ఎస్ నేతలకు సీఎం సవాల్
- అసెంబ్లీలో కృష్ణా నది జలాలపై చర్చ పెట్టమని తాము అడగలేదు
- బీఆర్ఎస్ఎల్పీ సమావేశంలో ఆ పార్టీ అధినేత కేసీఆర్ అడిగారని చెప్పుకొచ్చారు
- అందుకే అసెంబ్లీ సమావేశాలు నిర్వహించి కృష్ణా నదీ జలాలపై చర్చిస్తున్నాం
- కేసీఆర్ సభకు ఎందుకు రాలేదో కారణమే లేదు
- హరీశ్‌రావుకు మాట్లాడే అవకాశాన్ని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఇచ్చారు
- కేసీఆర్ సూచనలు ఇస్తే తీసుకుందామని తాము అనుకున్నాం



**హైదరాబాద్**

బీఆర్ఎస్ నేతలపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శాసనసభకు రాకుండా గులాబీ పార్టీ నేతలు తప్పించుకుతిరుగుతున్నారని ఎద్దేవా చేశారు. బహిరంగ సభల్లో మాట్లాడటం కాదని.. సభకు రండి నిజాలు ఏంటో తేలుద్దామని సవాల్ విసిరారు. అసెంబ్లీలో కృష్ణా నది జలాలపై చర్చ పెట్టమని తాము అడగలేదని ప్రస్తావించారు. బీఆర్ఎస్ఎల్పీ సమావేశంలో ఆ పార్టీ అధినేత కేసీఆర్ అడిగారని చెప్పుకొచ్చారు. అందుకే అసెంబ్లీ సమావేశాలు నిర్వహించి కృష్ణా నదీ జలాలపై చర్చిస్తున్నామని స్పష్టం చేశారు. శనివారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో మాట్లాడారు సీఎం రేవంత్‌రెడ్డి. కేసీఆర్ సభకు ఎందుకు రాలేదో కారణమే లేదని అన్నారు. హరీశ్‌రావుకు మాట్లాడే అవకాశాన్ని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఇచ్చారని.. అయినా తాము సభకు రామని వెళ్లిపోయారని విమర్శించారు. బీఆర్ఎస్ నేతలే అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేయాలని తమను కోరారని.. అయితే మీ బట్టలు ఊడదీస్తామని ఒకరు, తోలు తీస్తామని మరొకరు మాట్లాడారని.. ఇప్పుడేమో కుంటిసాకులు - మిగతా3లో



## వంద కోట్ల స్కామ్.. మమత ప్రభుత్వంపై బీజేపీ ఆరోపణ

- టీఎంసీ ప్రభుత్వం రూ.100 కోట్ల అవినీతికి పాల్పడినట్లు సోషల్ మీడియా వేదికగా బీజేపీ ఆరోపణ
- ఈ మేరకు ఎక్స్ లో స్కాంకు సంబంధించి పలు వివరాలు బీజేపీ వెల్లడి
- వరద బాధితులు ఇబ్బందులు పడుతుంటే, అధికార పార్టీ నాయకులు వారికి అందించాల్సిన సాయాన్ని దోచుకున్నారని విమర్శ



## దేశాధ్యక్షుడు మదురో, ఆయన భార్య ఎక్కడున్నారో తెలియడంలేదు

- వెనెజులా ఉపాధ్యక్షురాలు
- అమెరికా దాడుల తర్వాత అధ్యక్షుడు మదురో ఆచూకీ లేకుండా పోయిన వైనం
- మదురో బతికే ఉన్నారో లేదో చెప్పాలని అమెరికాను డిమాండ్ చేసిన ఉపాధ్యక్షురాలు
- మదురో దంపతులను బంధించి దేశం దాటించామని ట్రంప్ ప్రకటన
- కారకాస్‌లో భారీ పేలుళ్లతో అమెరికా సైనిక ఆపరేషన్
- దేశాన్ని కాపాడుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చిన వెనెజులా ప్రభుత్వం




## అది మినహాయింపు మాత్రమే

- దర్యాప్తు సంస్థలకు గడువు విధించడంపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు
- దర్యాప్తు ప్రారంభం నుంచే గడువులు విధించడం సరికాదు
- న్యాయానికి విఘాతం కలిగే పరిస్థితులు తలెత్తినప్పుడు మాత్రమే కోర్టుల జోక్యం సమంజసం
- సుప్రీంకోర్టు వ్యాఖ్యలు
- దర్యాప్తు సంస్థలకు గడువు విధించడం అనేది కోర్టులు విచారణ ముందుగానే చేసే పని కాదు

- రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికలకు 20వ తేదీలోగా నోటిఫికేషన్!
- రిజర్వేషన్లకు అనుగుణంగా బలమైన అభ్యర్థులను బరిలోకి దింపే పనిలో పార్టీ ముఖ్య నేతలు
- పార్టీల పేరుతో పోటీ చేస్తున్న అభ్యర్థులు
- పంచాయతీ ఎన్నికలు పార్టీల గుర్తులు లేకుండా జరిగాయి
- పురపాలక సంఘాల ఎన్నికలు పార్టీల గుర్తుల మీద నిర్వహించనున్నారు.

# బల్దియా పీఠం మనదే!

## పుర పోరుకు పార్టీల సమాయత్తం




**హైదరాబాద్**

పురపాలక సంఘాల పాలకవర్గాలకు ఎన్నికలు నిర్వహించేందుకు అధికార యంత్రాంగం కసరత్తు ముమ్మరం చేసింది. ఎన్నికల సంఘం నిర్దేశించిన ప్రకారం ముసాయిదా ఓటరు జాబితాను వార్డుల వారీగా అధికారులు ప్రకటించి అభ్యంతరాలు స్వీకరిస్తున్నారు. మరోవైపు ప్రధాన రాజకీయ పార్టీలు బల్దియాల్లో తమ పార్టీ అభ్యర్థులను గెలిపించుకునేందుకు అవసరమైన వ్యూహాలు సిద్ధం చేస్తున్నారు. రిజర్వేషన్లకు అనుగుణంగా బలమైన అభ్యర్థులను బరిలో నిలిపేందుకు క్షేత్ర స్థాయిలో బలమున్న అభ్యర్థులను గుర్తించే పనిలో పార్టీల ముఖ్యనేతలు సర్వేలు చేపడుతున్నారు. పంచాయతీ ఎన్నికలు పార్టీల గుర్తులు లేకుండా జరిగాయి. పురపాలక సంఘాల ఎన్నికలు పార్టీల గుర్తుల మీద నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో ప్రధాన రాజకీయ పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలు ఈ పోరును ప్రతిష్ఠాత్మకంగా - మిగతా3లో



## బీజేపీకి చెక్.. కాంగ్రెస్ పార్టీతో విజయ్ పొత్తు?

- తాజా సమాచారం ప్రకారం టీవీకే.. కాంగ్రెస్ పార్టీతో పొత్తు కోసం ప్రయత్నం
- టీవీకే, కాంగ్రెస్ సహజ భాగస్వాములు
- రెండు పార్టీలు లౌకిక వాదానికి కట్టుబడి ఉన్నాయని, మత తత్వానికి వ్యతిరేకం
- టీవీకే జాతీయ ప్రతినిధి గెరాల్డ్ కీలక వ్యాఖ్యలు

# తప్పుడు చరిత్ర రాసే ప్రయత్నంలో కేంద్రం

- తప్పుడు చరిత్రను రాసే ప్రయత్నం చేస్తోంది
- ఉపాధి హామీ పథకానికి గాంధీ పేరు తొలగించడం హేయమైన చర్య అంటూ తీవ్ర విమర్శలు
- 'మహాత్మాగాంధీ మన దేశంలోనే కాదు..
- ప్రపంచం గర్వించదగిన త్యాగశీలి
- ఉపాధి హామీ చట్టంలో మార్పులు తేవడాన్ని కాంగ్రెస్ తీవ్రంగా ఖండిస్తుంది




**హైదరాబాద్**


కేంద్ర ప్రభుత్వం తప్పుడు చరిత్రను రాసే ప్రయత్నం చేస్తోందన్నారు టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్. ఉపాధి హామీ చట్టంలో మార్పులు తేవడాన్ని కాంగ్రెస్ తీవ్రంగా ఖండిస్తుంది. ఉపాధి హామీ పథకానికి గాంధీ పేరు తొలగించడం హేయమైన చర్య అంటూ తీవ్ర విమర్శలు గుప్పించారు. టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తాజాగా మీడియాతో మాట్లాడుతూ.. 'మహాత్మాగాంధీ మన దేశంలోనే కాదు.. - మిగతా3లో

## సంపాదకీయం

# హిప్నాటిజం శాస్త్రీయ ప్రయాణం


ప్రపంచ వ్యాప్తంగా మానవ మనస్సు శక్తిపై శాస్త్రీయ అవగాహన పెంపొందించాలనే లక్ష్యంతో ప్రతి సంవత్సరం జనవరి 4న ప్రపంచ హిప్నాటిజం దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. మనిషి ఆలోచనలు, భావాలు, ప్రవర్తనల వెనుక పనిచేసే అవచేతన శక్తిని గుర్తించి, దాన్ని సానుకూల మార్పులకు వినియోగించు కోవచ్చనే భావనను సమాజానికి చేర వేయడమే ఈ దినోత్సవ ప్రధాన ఉద్దేశం. సాధారణంగా హిప్నాటిజం అంటే మాయాజాలం, వశీకరణ, లేదా వేదికలపై చేసే వినోద కార్యక్రమాలుగా ప్రజల్లో అపోహలు ఉన్నాయి. అయితే ఆధునిక మానసిక శాస్త్రం స్పష్టంగా నిర్ధారించిన వాస్తవం ఏమిటంటే?హిప్నాటిజం అనేది పూర్తిగా శాస్త్రీయమైన మానసిక స్థితి, ఇందులో వ్యక్తి అప్రమత్తంగానే ఉండి, అత్యంత ఏకాగ్రతతో తన అవచేతన మనస్సుపై దృష్టి కేంద్రీకరిస్తాడు. హిప్నాటిజం చరిత్రను వెనక్కి తిరిగి చూస్తే, ఇది ఆధునిక కాలానికి చెందిన ప్రక్రియ మాత్రమే కాదని తెలుస్తుంది. భారతీయ యోగ, ధ్యాన సంప్రదాయాల్లో కనిపించే ధారణ, ధ్యానం, సమాధి వంటి భావనలు హిప్నాటిక్ స్థితికి సమీపంగా ఉంటాయి. ఉపనిషత్తులు, యోగసూత్రాలు మనస్సు నియంత్రణ ద్వారా శరీర?మనో సమతుల్యత సాధించవచ్చని పేర్కొన్నాయి. ప్రాచీన ఈజిప్టు నాగరికతలో దేవాలయాల్లో 'స్లీప్ టెంపుల్స్' అనే విధానం ద్వారా మానసిక, శారీరక సమస్యలకు చికిత్స చేసినట్లు చారిత్రక ఆధారాలు ఉన్నాయి. గ్రీకు వైద్యుడు హిపోక్రటీస్ కూడా మనస్సు ఆరోగ్యం శరీర ఆరోగ్యానికి కీలకమని వివరించాడు. ఆధునిక హిప్నాటిజానికి పునాది వేసినవారిగా 18వ శతాబ్దానికి చెందిన ఫ్రాంజ్ ఆంటన్ మెస్మర్ పేరు ప్రాధాన్యంగా చెప్పుకోవాలి. ఆయన ప్రతిపాదించిన 'మెస్మరిజం' సిద్ధాంతం తొలుత వివాదాస్పదమైనప్పటికీ, తదుపరి కాలంలో శాస్త్రీయ పరిశోధనలకు దారి చూపింది. 19వ శతాబ్దం చివరి నాటికి హిప్నాటిజం వైద్య, మానసిక శాస్త్ర రంగాల్లో అధ్యయన అంశంగా మారింది. సిగ్మండ్ ఫ్రాయిడ్ తన ప్రారంభ దశలో హిప్నాసిస్‌ను ఉపయోగించి మానవ అవచేతనాన్ని అర్థం చేసుకునే ప్రయత్నం చేశాడు. తరువాత కాలంలో క్లినికల్ సైకాలజీ, న్యూరోసైన్స్ రంగాల్లో జరిగిన పరిశోధనలు హిప్నాటిక్ స్థితిలో మెదడులో జరిగే మార్పులను స్పష్టంగా నిరూపించాయి. మెదడు తరంగాల్లో ఆల్ఫా, థీటా తరంగాలు పెరగడం, ఒత్తిడి హార్మోన్లు తగ్గడం వంటి అంశాలు ప్రయోగాల ద్వారా వెల్లడయ్యాయి. అమెరికన్ సైకాలజికల్ అసోసియేషన్ ప్రకారం, సాధారణ జనాభాలో సుమారు 10 నుంచి 15 శాతం మంది హిప్నాటిజానికి అత్యంత స్పందన చూపిస్తే, 60 నుంచి 70 శాతం మంది మోస్తరు స్థాయిలో స్పందిస్తారు. ఆధునిక వైద్యరంగంలో హిప్నాటిజం ఒక సహాయక చికిత్సా పద్ధతిగా గుర్తింపు పొందింది. ప్రపంచ వ్యాప్తంగా జరిగిన అనేక అధ్యయనాలు దీర్ఘకాలిక నొప్పి నియంత్రణలో హిప్నోథెరపీ 30 నుంచి 50 శాతం వరకు ఉపశమనాన్ని ఇస్తుందని సూచిస్తున్నాయి. పొగత్రాగడం మానేయడంలో, బరువు నియంత్రణలో, ఆందోళన రుగ్మతలు, భయాలు, నిద్రలేమి వంటి సమస్యల్లో హిప్నాటిజం ప్రభావవంతంగా పనిచేస్తున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. కొన్ని యూరోపియన్ దేశాల్లో దంత చికిత్సల సమయంలో నొప్పి నివారణకు హిప్నాటిక్ పద్ధతులు వినియోగిస్తున్నారు. అమెరికాలో ప్రతి సంవత్సరం వేలాది మంది లైసెన్స్ పొందిన హిప్నోథెరపిస్టుల ద్వారా చికిత్స పొందుతున్నారు. ప్రపంచ హిప్నాటిజం దినోత్సవం సందర్భంగా ప్రధానంగా చెప్పాల్సిన అంశం?హిప్నాటిజం ద్వారా వ్యక్తి తన నియంత్రణ కోల్పోతాడన్న భ్రమ పూర్తిగా తప్పు. హిప్నాటిక్ స్థితిలో ఉన్న వ్యక్తి తన విలువలకు, నైతికతకు విరుద్ధమైన పనులు చేయడు. ఇది బలవంతపు ప్రక్రియ కాదు; పరస్పర సహకారంపై ఆధారపడిన మానసిక విధానం. హిప్నోటిస్ట్ సూచనలు ఇస్తాడు కానీ వాటిని అంగీకరించాలా వద్దా అన్న నిర్ణయం వ్యక్తిదే. అందుకే శాస్త్రీయ హిప్నాటిజాన్ని వినోద ప్రదర్శనలతో సమానంగా చూడటం తగదు. ఈ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రపంచవ్యాప్తంగా సెమినార్లు, అవగాహన కార్యక్రమాలు, శిక్షణ శిబిరాలు నిర్వహిస్తారు. మానసిక ఆరోగ్య నిపుణులు హిప్నాటిజం ఉపయోగాలు, పరిమితులు, నైతిక ప్రమాణాలపై ప్రజలకు వివరిస్తారు. ముఖ్యంగా ఆధునిక జీవనశైలిలో పెరుగుతున్న ఒత్తిడి, ఆందోళన, డిప్రెషన్ వంటి సమస్యల నేపథ్యంలో అవచేతన శక్తిని సానుకూలంగా వినియోగించుకోవడం ఎంత అవసరమో ఈ దినోత్సవం గుర్తు చేస్తుంది. భారతదేశంలో హిప్నాటిజంపై ఆసక్తి క్రమంగా పెరుగుతున్నా, సరైన నియంత్రణ, శాస్త్రీయ అవగాహన లోపిస్తున్నాయి. అర్హత లేని వ్యక్తులు చేసే ప్రదర్శనలు హిప్నాటిజంపై అపోహలను మరింత బలపరుస్తున్నాయి. అందుకే హిప్నాటిజాన్ని వైద్య, మానసిక చికిత్సల కోసం వినియోగించేటప్పుడు శిక్షణ పొందిన, లైసెన్స్ ఉన్న నిపుణుల సేవలు తీసుకోవడం అత్యవసరం. ప్రభుత్వం, వైద్య మండళ్లు ఈ రంగంపై స్పష్టమైన మార్గదర్శకాలు రూపొందించాల్సిన అవసరం ఉంది. మొత్తంగా ప్రపంచ హిప్నాటిజం దినోత్సవం మనిషి అంతర్గత శక్తిని గుర్తు చేసే ఒక ఆలోచనాత్మక సందర్భం. మనస్సు అనేది కేవలం ఆలోచనల సమాహారం కాదు, అపార సామర్థ్యాల నిలయం. ఆ సామర్థ్యాన్ని భయం లేకుండా, అపోహలు తొలగించి, శాస్త్రీయ దృష్టితో వినియోగించుకుంటే వ్యక్తిగత ఆరోగ్యం మెరుగు పడుతుంది, సమాజం మానసికంగా మరింత బలపడుతుంది. అవచేతనాన్ని అర్థం చేసుకోవడం ద్వారా స్వీయ అవగాహనకు దారి తీసే ఈ ప్రయాణానికి ప్రపంచ హిప్నాటిజం దినోత్సవం ఒక ప్రేరణగా

# ఉక్కుకు ఊపిరిపోసిన బ్రహ్మప్రకాష్



భారత శాస్త్రసాంకేతిక చరిత్రలో మెటలర్జీ అనే విభాగానికి స్పష్టమైన దిశ, స్వరూపం ఇచ్చిన అరుదైన మహనీయుడు డాక్టర్ బ్రహ్మ ప్రకాష్. ఆధునిక భారత లోహ విజ్ఞానానికి పునాది వేసిన శాస్త్రవేత్తగా, పరిశోధనను పరిశ్రమలతో అనుసంధానించిన దార్శనికుడిగా ఆయన పేరు చిరస్థాయిగా నిలిచింది. 1984 జనవరి 3న ఆయన పరమపదించి నప్పటికీ, భారత ఉక్కు పరిశ్రమ, లోహ పరిశోధన సంస్థలు, శాస్త్రీయ సంప్రదాయాల రూపంలో ఆయన వారసత్వం నేటికీ జీవిస్తోంది. డాక్టర్ బ్రహ్మ ప్రకాష్ 1907 ఆగస్టు 26న అప్పటి పంజాబ్ రాష్ట్రంలోని ముల్తాన్‌లో జన్మించారు. చిన్నతనం నుంచే గణితం, భౌతికశాస్త్రాల పట్ల అపూర్వమైన ఆసక్తి కనబరిచిన ఆయన, ప్రతిభావంతుడైన విద్యార్థిగా గుర్తింపు పొందారు. ఉన్నత విద్య కోసం ఇంగ్లాండ్ వెళ్లిన బ్రహ్మ ప్రకాష్, ప్రపంచ ప్రఖ్యాత కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయంలో మెటలర్జీలో డాక్టరేట్ సాధించారు. ఆ కాలంలోనే లోహాల సూక్ష్మ నిర్మాణం, భౌతిక రసాయన లక్షణాలు, పారిశ్రామిక వినియోగాలపై లోతైన పరిశోధనలు చేసి అంతర్జాతీయ శాస్త్రీయ వర్గాల్లో పేరు సంపాదించారు. విదేశాల్లో ఉన్నత హోదాలు, ఆకర్షణీయ అవకాశాలు ఉన్నప్పటికీ, స్వదేశ సేవే జీవిత లక్ష్యంగా బ్రహ్మ ప్రకాష్ భారత్‌కు తిరిగొచ్చారు. అప్పటి భారతదేశం పారిశ్రామికంగా వెనుకబడి ఉన్న పరిస్థితుల్లో, దేశ అభివృద్ధికి శాస్త్ర సాంకేతికతే ఆధారమని ఆయన గట్టిగా విశ్వసించారు. ముఖ్యంగా ఉక్కు, లోహ పరిశ్రమలు లేకుండా మౌలిక వసతుల నిర్మాణం, రక్షణ రంగం, యంత్ర పరిశ్రమలు అభివృద్ధి సాధ్యం కాదని ఆయన స్పష్టంగా గ్రహించారు. ఈ దృక్పథమే ఆయన జీవిత కార్యాచరణకు మార్గదర్శకంగా నిలిచింది. 1950లలో భారత ప్రభుత్వం స్థాపించిన నేషనల్ మెటలర్జికల్ లాబొరేటరీ (ఎన్‌ఎంఎల్)కు తొలి డైరెక్టర్‌గా డాక్టర్ బ్రహ్మ ప్రకాష్ నియమితులయ్యారు. జంషెడ్‌పూర్ కేంద్రంగా పనిచేసిన ఈ సంస్థ ఆయన నాయకత్వంలో దేశంలోని అత్యంత ప్రతిష్ఠాత్మక పరిశోధనా కేంద్రంగా ఎదిగింది. ఉక్కు, అల్యూమినియం, తామ్రం, మిశ్రమ లోహాలపై విస్తృత పరిశోధనలు చేపట్టి, దేశీయ పరిశ్రమలకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎన్‌ఎంఎల్ అందించింది. అప్పటివరకు విదేశాలపై ఆధారపడిన ఉక్కు తయారీ సాంకేతికతలో స్వావలంబన దిశగా భారత్ ముందడుగు వేయడంలో బ్రహ్మ ప్రకాష్ కీలక పాత్ర పోషించారు. ఉక్కు పరిశ్రమ అభివృద్ధిలో ఆయన కృషి గణనీయమైనది. భిలాయ్, దుర్గాపూర్, రూర్కెలా వంటి ప్రభుత్వ రంగ ఉక్కు కర్మాగారాలకు అవసరమైన లోహ సాంకేతిక సూచనలు, పరిశోధన ఫలితాలు ఎన్‌ఎంఎల్ ద్వారా అందాయి. లోహాల నాణ్యత పెంపు, వ్యయ తగ్గింపు, దేశీయ ముడి పదార్థాల వినియోగంపై ఆయన చేసిన అధ్యయనాలు పారిశ్రామిక ఉత్పత్తిని గణనీయంగా పెంచాయి. ఈ కారణంగా బ్రహ్మ ప్రకాష్‌ను "ఉక్కుకు ఊపిరిపోసిన శాస్త్రవేత్త"గా అభివర్ణిస్తారు. డాక్టర్ బ్రహ్మ ప్రకాష్ శాస్త్రవేత్తగా మాత్రమే కాకుండా, విజనరీ నిర్వాహకుడిగా కూడా ప్రత్యేక గుర్తింపు పొందారు. పరిశోధన ప్రయోగశాలలకే పరిమితం కాకుండా, పరిశ్రమలు, ప్రభుత్వ విధానాలతో అనుసంధానమవ్వాలన్నది ఆయన నమ్మకం. "శాస్త్రం ప్రజల జీవితాలను మార్చగలగాలి" అనే సిద్ధాంతాన్ని ఆయన తన జీవితమంతా అమలు చేశారు. రక్షణ రంగం, అణుశక్తి కార్యక్రమాలు, భారీ యంత్ర పరిశ్రమలకు అవసరమైన ప్రత్యేక లోహాల అభివృద్ధిలో ఆయన మార్గదర్శకత్వం కీలకంగా నిలిచింది. అంతర్జాతీయ స్థాయిలో కూడా డాక్టర్ బ్రహ్మ ప్రకాష్‌కు విశేష గుర్తింపు లభించింది. యునెస్కో, ఐక్యరాజ్యసమితి వంటి సంస్థల శాస్త్రీయ కమిటీల్లో సభ్యుడిగా పనిచేశారు. ఆసియా, ఆఫ్రికా దేశాల్లో మెటలర్జీ అభివృద్ధిపై సలహాదారుడిగా వ్యవహరించారు. అనేక అంతర్జాతీయ జర్నల్స్‌లో ఆయన ప్రచురించిన పరిశోధనా పత్రాలు భారత శాస్త్రీయ ప్రతిభను ప్రపంచానికి పరిచయం చేశాయి. భారత ప్రభుత్వం ఆయన సేవలను గౌరవిస్తూ 1958లో "పద్మభూషణ్" పురస్కారాన్ని ప్రదానం చేసింది. ఇది ఒక వ్యక్తికి ఇచ్చిన గౌరవమే కాకుండా, భారత మెటలర్జీ రంగానికి లభించిన గుర్తింపుగా భావించాలి. అంతేకాకుండా, దేశవిదేశాల అనేక విశ్వవిద్యాలయాలు ఆయనకు గౌరవ డాక్టరేట్లు ప్రదానం చేశాయి. వినయం, క్రమశిక్షణ, దేశభక్తి డాక్టర్ బ్రహ్మ ప్రకాష్ జీవితంలోని ప్రధాన లక్షణాలు. యువ శాస్త్రవేత్తలను ప్రోత్సహించడం, పరిశోధనలో నాణ్యతకు రాజీ పడకపోవడం ఆయన నిత్యకర్తవ్యంగా భావించారు. ఆయన శిక్షణ పొందిన అనేక మంది శాస్త్రవేత్తలు తరువాత కాలంలో సీఎస్ఐఆర్, రక్షణ పరిశోధనా సంస్థలు, విశ్వవిద్యాలయాల్లో కీలక బాధ్యతలు చేపట్టి దేశానికి సేవలందించారు. 1984 జనవరి 3న డాక్టర్ బ్రహ్మ ప్రకాష్ కన్నుమూయడంతో ఒక మహనీయుడి శారీరక జీవితం ముగిసినా, ఆయన ఆలోచనలు, నిర్మించిన సంస్థలు, శాస్త్రీయ సంప్రదాయం ఇంకా జీవించి ఉన్నాయి. నేషనల్ మెటలర్జికల్ లాబొరేటరీ, భారత ఉక్కు పరిశ్రమలో సాధించిన సాంకేతిక స్వావలంబన, పరిశోధన పరిశ్రమల అనుసంధానం? ఇవి అన్నీ ఆయన అందించిన చిరస్థాయి కానుకలు. ఈ వర్ధంతి సందర్భంగా డాక్టర్ బ్రహ్మ ప్రకాష్‌ను స్మరించుకోవడం అంటే కేవలం ఒక శాస్త్రవేత్తను తలుచుకోవడం కాదు; శాస్త్రాన్ని దేశాభివృద్ధికి అంకితం చేయాలన్న ఉన్నత ఆదర్శాన్ని గుర్తు చేసుకోవడమే. ఆయన జీవితం నేటి తరానికి స్పష్టమైన సందేశం ఇస్తుంది. శాస్త్రం జ్ఞానానికే కాదు, జాతి భవిష్యత్తుకు బలమైన పునాది కావాలి.

# విశ్వరహస్యాలను ఛేదించిన న్యూటన్




అధునిక సైన్సును కొత్త పుంతలు తొక్కించిన మహనీయుడు న్యూటన్. గణిత శాస్త్రంలోనూ అంతటి ప్రతిభాశాలి, ప్రభావశీలి మరొకరు లేరు. ఆయన కాలంలో ఆయనను ప్రకృతి తాత్వికులుగా పిలిచేవారు.మానవ ప్రపంచానికి విశ్వ రహస్యాలను విడమర్చి చెప్పిన "సర్ ఐజాక్ న్యూటన్" ఒక ఆంగ్ల భౌతిక, గణిత, ఖగోళ శాస్త్రవేత్త. ఆయన ఓ సిద్ధాంత కర్త, తత్వవేత్త కూడా. ప్రకృతి సిద్ధమైన తత్వశాస్త్రం సైన్సుగా ఎలా పరిణామం చెందిందన్న అంశంపై చేసిన ఎనలేని కృషికిగానూ ఆధునిక ప్రపంచం ఆయనను "సైన్సు పితామహుడు"గా కీర్తించింది. ప్రపంచం లోనే మేటి శాస్త్రవేత్తల్లో ఒకరిగా పేరు తెచ్చుకున్నారు. ఈ రోజు అంతరిక్షంలోకి రాకెట్లలో రివ్వున దూసుకెళ్తున్నామంటే, అందుకే న్యూటన్ ప్రతిపాదించిన సిద్ధాంతాలే కారణం.విశ్వ రహస్యాలను మానవాళికి విశ్లేషించి చెప్పిన న్యూటన్ జనవరి 4, 1643వ సంవత్సరంలో ఇంగ్లండ్‌కు దగ్గర్లోగల ఉల్‌తోప్ అనే గ్రామంలో ఒక సామాన్య రైతు కుటుంబంలో జన్మించారు. న్యూటన్ చిన్నప్పుడు స్కూల్లో చదువుకంటే ఇతర సైన్సు పుస్తకాలు చదవటం, పెద్ద వస్తువుల్ని చూసి వాటినే చిన్న సైజులో తయారు చేయటం లాంటి పనులు చేస్తుండేవారు. అలా చిన్న చిన్న మిషన్లు, నీటి గడియారం, ఎండలో పనిచేసే గడియారం లాంటివి కూడా ఆయన తయారు చేశారు. ఆయన చేతిలో రూపుదిద్దుకున్న ఈ వస్తువులన్నీ ఇప్పటికీ లండన్ రాయల్ సొసైటీ మ్యూజియంలో భద్రంగా ఉన్నాయి.

గణితంలో న్యూటన్ పట్ల ఎంతో ఆసక్తి చూసిన ఒక ఉపాధ్యాయుడు, న్యూటన్ ను ఉన్నత విద్యను అభ్యసించడానికి విశ్వవిద్యాలయానికి పంపండని న్యూటన్ తల్లికి గట్టిగా చెప్పారు. ఆ ఉపాధ్యాయుడు న్యూటన్ విద్యకు అయ్యే ఖర్చును భరించటానికి అంగీకరించారు. న్యూటన్ జూన్ 1661 లో ఉన్నత విద్య కోసం కేంబ్రిడ్జ్ విశ్వ విద్యాలయంలో చేరిన న్యూటన్.. గణిత, భౌతిక, ఖగోళ శాస్త్ర పరిశోధనలపై మక్కువ పెంచుకున్నారు. చిన్నతనంలో చెట్టు నుంచి రాలిన యాపిల్‌ను గమనించిన న్యూటన్ అందుకు కారణాన్ని అన్వేషించే క్రమంలో గురుత్వాకర్షణ సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. లైబ్రరీ లో చాలా సమయం అతను పుస్తక పఠనంలో గడిపేవారు. పూర్తి సమయం లెక్కలు మరియు భౌతిక శాస్త్రం అభ్యాసానికే వినియోగించారు. ఒక్కొక్కసారి తిండి నిద్ర కూడా మరిచేవారు. న్యూటన్ యూనివర్సిటీలో గ్రీకు, లాటిన్, హిబ్రు భాషలను, లాజిక్, జ్యామితి మరియు త్రికోణమితి లను ఎంచుకున్నారు. లైబ్రరీ లో న్యూటన్ తరచుగా మేధావులైన కెప్లర్ మరియు ఇతరులు రాసిన / తయారుచేసిన గొప్ప ప్రయోగాలపై అధ్యయనం చేసేవారు. ఆ తరువాత అక్కడే ప్రొఫెసర్‌గా నియమితుడైన న్యూటన్, 1667లో పరావర్తన దూరదర్శినిని నిర్మించి సంచలనం సృష్టించారు. ప్రొఫెసర్ న్యూటన్ విశ్లేషణాత్మక జ్యామితి, బీజగణితం, మరియు క్యాల్కులస్ రంగాలమీద తన దృష్టి సారించారు. బైనామినల్ సిద్ధాంతం, అనంతం సిరీస్ విస్తరణ కోసం కొత్త పద్ధతులు, టశ్రీబీలీతినీనిబ యొక్క ప్రత్యక్ష మరియు విలోమ పద్ధతులు ? ఇవీ ఆ కాలంలో ఆయన చేసిన ప్రధాన ఆవిష్కరణలు. న్యూటన్ 1665 నుండి 1666 వరకు కాంతి అధ్యయనం మీద దృష్టి కేంద్రీకరించారు. భూమి, చంద్రుడు, గ్రహాలు, సూర్యుడు సహా విశ్వంలోని వస్తువులపై గురుత్వ శక్తి ఎలా పని చేస్తుందో వివరిస్తూ విశ్వ గురుత్వ నియమాన్ని ప్రతిపాదిస్తూ, గమన సూత్రాలను నిర్వచించారు. గురుత్వాకర్షణ శక్తి గురించి, న్యూటన్ ప్రతిపాదించిన మూడు గమన నియమాల గురించి ప్రస్తావించారు. తరువాతి మూడు శతాబ్దాల పాటు భౌతిక ప్రపంచానికి సైన్సు దృక్కోణంగా వెలుగొందిన యాంత్రిక శాస్త్రానికి తరువాత ఆధునిక ఇంజనీరింగ్ కూ ఆయన పరిశోధన ఫలితాలే పునాదిగా ఉన్నాయి. ఏదైనా ఒక వస్తువు యొక్క గమనం, భూమి మీదైనా లేక ఇతర గ్రహాలమీదైనా ఒకే రకమైన నియమాల మీద ఆధారపడి ఉంటుందని నిరూపించారు. దీనికి ఆధారంగా కెప్లర్ నియమాలకూ మరియు గురుత్వాకర్షణ సిద్ధాంతాలకూ గల సామ్యాన్ని దృష్టాంతంగా చూపారు. దీంతో సూర్య కేంద్రక సిద్ధాంతంపై పూర్తిగా అనుమానం తొలిగి పోవడమే కాకుండా ఆధునిక సైన్సు అభివృద్ధి కొత్త పుంతలు తొక్కింది. విజ్ఞాన శాస్త్ర రంగం మీదకు ఐన్ స్టయిన్ వచ్చేదాకా మూడు దశాబ్దాల పాటు శాస్త్ర సామ్రాజ్యాన్ని ఏకఛత్రాధి పత్యంగా ఏలిన మేధావి ఐసాక్ న్యూటన్. ఇప్పటికీ ఆయన చలన సూత్రాలు కొన్ని పరిమితులకు లోబడి సజావుగా పనిచేస్తోనే ఉన్నాయి.

**(1).మొదటి సూత్రము...**

"బాహ్యబల ప్రయోగము లేనంత వరకు చలన స్థితిలో ఉన్న వస్తువు చలన స్థితిలోను, నిశ్చల స్థితిలో ఉన్న వస్తువు నిశ్చల స్థితిలోనూ ఉంటుంది". ఈ వస్తు ధర్మాన్ని జడత్వము అంటారు. (2).రెండవ సూత్రము... "ఒక వస్తువు ద్రవ్య వేగంలోని మార్పు ఆ వస్తువు పై ప్రయోగించిన బలానికి అనుపాతముగా ఉంటుంది. మరియు ఆ బలం ప్రయోగించిన దిశలో ఉంటుంది". (3).న్యూటన్ మూడవ నియమం..."చర్యకు ప్రతి చర్య సమనంగా ఉండి వ్యతిరేక దిశలో పనిచేయును". భౌతిక శాస్త్ర భావనలను వివరిస్తూ "ప్రిన్సిపియా మేథమేటికా" అనే గ్రంథాన్ని రచించారు. కాంతిపై న్యూటన్ చేసిన పరిశోధనల ఫలితంగా "దృశాశాస్త్రం" పుట్టింది. మూడు శతాబ్దాల పాటు భౌతిక ప్రపంచానికి సైన్సు దృక్కోణంగా వెలుగొందిన యాంత్రిక శాస్త్రానికి తరువాత ఆధునిక ఇంజనీరింగ్ కూ ఈ గ్రంథమే పునాది. ఏదైనా ఒక వస్తువు యొక్క గమనం, భూమి మీదైనా లేక ఇతర గ్రహాలమీదైనా ఒకే రకమైన నియమాల మీద ఆధారపడి ఉంటుందని నిరూపించారు. దీనికి ఆధారంగా కెప్లర్ నియమాలకూ, గురుత్వాకర్షణ సిద్ధాంతాలకూ గల సామ్యాన్ని దృష్టాంతంగా చూపారు.

ఆయనకు 1672లో రాయల్ సొసైటీ ఫెలోషిప్ లభించింది. అప్పటి వరకూ ప్రకృతి శాస్త్రంలో ఒక భాగంగా ఉన్న భౌతిక శాస్త్రాన్ని న్యూటన్ ఆవిష్కరణలు, సిద్ధాంతాల వల్ల ప్రత్యేక శాస్త్రంగా గుర్తించారు. అందుకే న్యూటన్‌ను భౌతిక శాస్త్ర పితామహుడు అంటారు. 1705లో బ్రిటిష్ ప్రభుత్వం "సర్" అని బిరుదునిచ్చి సత్కరించింది. ఇక అప్పటినుంచి ఐజాక్ న్యూటన్ "సర్ ఐజాక్ న్యూటన్"గా పేరెన్నిక గన్నారు. తరువాత కూడా ఎన్నో మైలురాళ్లను అధిగమించిన న్యూటన్ తన 85 సంవత్సరాల వయస్సులో మార్చి 20, 1727న మరణించారు.

## బ్రెయిలీ లిపి రూపశిల్పికి శతకోటి వందనాలు

ప్రపంచవ్యాప్తంగా దాదాపు ఒక బిలియన్ అంగవైకల్యం ఉన్న అభాగ్యుల ఉన్నారు. వీరిలో దృష్టి లోపం లేదా దోషం ఉన్న వారు జీవితాంతం చీకటిలో బతుకుతూ, పౌర సమాజానికి దూరంగా, పరిమిత కదలికలతో దుర్భర జీవితాలను గడుపుతున్నారు. అంధులు ఆరోగ్య సంరక్షణ, ఉద్యోగ ఉపాధులు, విద్యాభ్యాసం లాంటి కనీస అవసరాలకు దూరంగా బతుకులను ఈడుస్తున్నారు. అంధుల్లో అధిక శాతం పేదరికం, హింస, నిర్లక్ష్యం, దుర్వినియోగం, స్వేచ్ఛ, ఒంటరితనం, పరిమిత సమాచారం, మానవ హక్కుల ఉల్లంఘనలను నిత్యం అనుభవిస్తున్న వారే అధికంగా ఉండడం విచారకరం. దృష్టి దోషంతో బాధపడుతున్న వర్గాల సమస్యలను అర్థం చేసుకోవడం, వారి అభ్యున్నతికి కృషి చేయడం, విద్యావకాశాలు కల్పించడం, ఉద్యోగ ఉపాధుల్లో వారికి పెద్ద పీట వేయడం లాంటి లక్ష్యాలను అధిగమించడంతో ఆ వర్గాలకు బ్రెయిలీ లిపి ఒక అద్భుత వరంగా మారడంతో ప్రతి ఏట 04 జనవరిన ప్రపంచ మానవాళి "ప్రపంచ బ్రెయిలీ దినం" ఘనంగా నిర్వహిస్తున్నది. బ్రెయిలీ లిపిని కనుగొన్న అంధ మేధావి "లూయిస్ బ్రెయిలీ" పుట్టిన రోజు సందర్భంగా ఈ వేడుకలు నిర్వహించుకోవడం ఆనవాయితీగా మారింది. అక్షరాలు, అంకెలు, లెక్కలు, సంగీత సంకేతాలు, శాస్త్రీయ సంకేతాలను సూచించడానికి పేపరుపై ఆరు చుక్కలతో రాసిన విలక్షణ లిపిని ఇతర అంధులు తమ చేతి స్పర్శతో చదువుకోగల ప్రత్యేక లిపిని "బ్రెయిలీ భాష" అని పిలుస్తున్నాం. 19వ శతాబ్దంలో లూయిస్ బ్రెయిలీ తన 11వ ఏటనే ప్రారంభించిన బ్రెయిలీ లిపిని తొమ్మిదేళ్లు శ్రమించి ఒక నిర్దిష్ట రూపం ఇవ్వడం జరిగినా తను చనిపోయిన తర్వాత మాత్రమే ఈ లిపికి బహుళ ఆదరణ లభించడం ప్రారంభమైనది. పూర్తి, పాక్షిక అంధులకు అపురూప వరంగా నిలుస్తున్న బ్రెయిలీ లిపిని ఉపయోగించుకున్న అంధులు తమ విద్య, విజ్ఞానం, భావ ప్రకటన స్వేచ్ఛ, అభిప్రాయాల వితరణ, ఉద్యోగ ఉపాధులు, సామాజిక సమ్మిళిత అంశాల్లో ముందుకు సాగడం హర్షదాయకం. 04 జనవరి 1809న జన్మించిన లూయిస్ బ్రెయిలీ తన 3వ ఏట జరిగిన ప్రమాదంలో దురదృష్టవశాత్తు దృష్టిని కోల్పోయినప్పటికీ పాఠశాల విద్యను చురుకుగా కొనసాగిస్తూనే అంధులకు ఉపయుక్తం అయ్యే విధంగా ప్రత్యేక లిపిని రూపొందించడం ప్రారంభించారు.

ధర్మఘంట

# అది మినహాయింపు మాత్రమే



నేరాల దర్యాప్తును పూర్తి చేయడానికి న్యాయస్థానాలు కాల పరిమితులను విధించడం అనేది అన్ని సందర్భాల్లో జరగదని, అది అసాధారణ పరిస్థితుల్లో ఇచ్చే మినహాయింపు మాత్రమేనని సుప్రీంకోర్టు పేర్కొంది. అయితే గడువు అనేది ప్రతి కేసులో అనుసరించాల్సిన నియమం కాదని అత్యున్నత ధర్మాసనం స్పష్టం చేసింది. అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన ఒక ఉత్తర్వుపై విచారణ సందర్భంగా జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ ఎన్.కె. సింగ్‌లతో కూడిన ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. నకిలీ పత్రాలతో ఆయుధ లైసెన్సు పొందినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఒక కేసులో యూపీ పోలీసులు 90 రోజుల్లో దర్యాప్తు పూర్తి చేయాలని, అంతవరకు నిందితులపై ఎటువంటి కఠిన చర్యలు తీసుకోవద్దని అలహాబాద్ హైకోర్టు ఆదేశించింది. ఈ ఆదేశాలను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. దర్యాప్తు సంస్థలకు గడువు విధించడం అనేది కోర్టులు విచారణ ముందుగానే చేసే పని కాదని, దర్యాప్తులో విపరీతమైన ఆలస్యం జరిగి బాధితులకు లేదా నిందితులకు అన్యాయం జరుగుతున్నప్పుడు మాత్రమే స్పందించి ఇలాంటి ఆదేశాలు ఇస్తాయని కోర్టు పేర్కొంది. కోర్టుల జోక్యంపై కూడా ధర్మాసనం స్పష్టమైన మార్గదర్శకాలను ఇచ్చింది. దర్యాప్తులో జరిగే ఆలస్యం వల్ల ప్రాథమిక హక్కులకు భంగం కలుగుతుందని భావించినప్పుడు మాత్రమే కోర్టులు జోక్యం చేసుకోవాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. పాత తీర్పులను ఉటంకిస్తూ, దర్యాప్తు గడువుపై ఆంక్షలు విధించడం ఎప్పుడూ అరుదుగానే ఉండాలని కోర్టు అభిప్రాయపడింది. అంతేకాకుండా, దర్యాప్తు ప్రారంభంలోనే కాలపరిమితులు విధించడం కార్యనిర్వాహక వ్యవస్థ అధికారాల్లో జోక్యం చేసుకోవడమే అవుతుందని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ఇదిలా ఉండగా, దర్యాప్తు సంస్థలకు విచారణ ప్రారంభంలోనే గడువు విధించడంపై సుప్రీంకోర్టు కీలక సూచనలు చేసింది. దర్యాప్తు అనేది సంక్లిష్టమైన ప్రక్రియ అని, దానికి ముందే గడువు విధించడం వల్ల విచారణ నిష్పక్షపాతంగా జరగకపోవచ్చని కూడా ధర్మానసం పేర్కొంది. దర్యాప్తులో అనవసర ఆలస్యం, నిలకడలేని పరిస్థితి, న్యాయానికి విఘాతం కలిగే పరిస్థితులు తలెత్తినప్పుడు మాత్రమే కోర్టుల జోక్యం సమంజసమని తెలిపింది. అందుకే కాలపరిమితులు విధించడం అనేది మినహాయింపు మాత్రమే తప్పితే అది నియమం కాదని వ్యాఖ్యానించింది. దర్యాప్తు ప్రారంభంలోనే కోర్టులు గడువు వల్ల వల్ల ఆయా సంస్థల సంస్థల స్వతంత్రత దెబ్బతింటుందని అభిప్రాయపడింది. దర్యాప్తును నిరంతరం కొనసాగించడానికి రాజ్యాంగం అనుమతించదని ధర్మాసనం స్పష్టం చేసింది. ఆర్టికల్ 21 ప్రకారం, వేగవంతమైన విచారణతో పాటు 'సకాలంలో దర్యాప్తు' కూడా ఒక ప్రాథమిక హక్కుగా పేర్కొంది. ఎఫ్ఐఆర్ నమోదైనప్పటి నుంచి ఛార్జిషీట్ దాఖలు చేసే వరకు జరిగే వివరణలేని జాప్యం అనేది వ్యక్తిగత స్వేచ్ఛకు విఘాతమే అని కోర్టు అభిప్రాయపడింది. దర్యాప్తులోని ఆచరణాత్మక ఇబ్బందు లను గౌరవిస్తూనే జాప్యం వల్ల న్యాయ ప్రక్రియకు ముప్పు వాటిల్లుతున్నప్పుడు న్యాయస్థానాలు కచ్చితంగా జోక్యం చేసుకోవాలని చెప్పింది. అలాగే, అలహాబాద్ హైకోర్టు నిందితులకు కఠిన చర్యల నుంచి రక్షణ కల్పిస్తూ ఇచ్చిన ఉత్తర్వులను కూడా సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. నిందితులకు కేవలం మరో రెండు వారాల పాటు మాత్రమే రక్షణ ఉంటుందని, ఆ తర్వాత చట్టప్రకారం దర్యాప్తు సంస్థలు చర్యలు తీసుకోవచ్చని సూచించింది. దర్యాప్తు అనేది అనేక అంశాలపై ఆధారపడి ఉంటుందని చెప్పింది. అందుకే దర్యాప్తు సంస్థలకు కొంత వెసులుబాటు అవసరమని కోర్టు అభిప్రాయపడింది. అయితే ఈ వెసులుబాటు అనేది జాప్యానికి సాకుగా మారకూడదని కూడా సూచించింది.

# శబరిమల అప్‌డేట్.. 2,92,555 మంది అయ్యప్ప భక్తులు



**మకరవిలక్కు:** కేరళలోని శబరిమలలో అయ్యప్ప భక్తుల రద్దీ కొనసాగుతోంది. నిన్న సాయంత్రం(శుక్రవారం) వరకు 2,92,555 మంది అయ్యప్ప భక్తులు శబరిమల దర్శనం చేసుకున్నారు. జనవరి 14వ తేదీన మకరజ్యోతి దర్శనం ఉన్న నేపథ్యంలో భారీ సంఖ్యలో అయ్యప్ప భక్తులు శబరికి చేరుకునే అవకాశం ఉంది. శబరిమలలో అయ్యప్ప స్వామి దర్శనానికి భక్తులు భారీగా తరలివస్తున్నారు. ఎటుచూసినా భక్తజనులతో ఆలయ పరిసరాలు కిక్కిరిసిపోయాయి. స్వామి అయ్యప్ప నామస్మరణతో శబరిమల ఆలయం భక్తి వాతావరణంతో నిండిపోయింది. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. తెలుగు రాష్ట్రాల నుంచి కూడా భారీ సంఖ్యలో భక్తులు శబరిమలకు తరలి వెళ్తున్నారు. ఇక, డిసెంబర్ 30న మకరవిలక్కు తెరిచినప్పుడు 57,256 మంది భక్తులు అయ్యప్పను దర్శనం చేసుకున్నారు. అలాగే, జనవరి ఒకటో తేదీ సాయంత్రం ఆరు గంటల నుండి జనవరి రెండో తేదీ సాయంత్రం ఏడు గంటల వరకు 75,267 మంది భక్తులు ఆలయ దర్శనం చేసుకున్నారు. మొత్తంగా మకరవిలక్కు మహోత్సవ సందర్భంగా డిసెంబర్ 30న నుంచి నిన్న సాయంత్రం వరకు 2,92,555 మంది అయ్యప్ప భక్తులు ఆలయానికి విచ్చేశారు.

**మకరజ్యోతి దర్శనం..**

ఇదిలా ఉండగా.. శబరిమలలో మకర జ్యోతి దర్శనం జనవరి 14, 2026 సాయంత్రం సుమారు 6:30గ్రావీ నుండి 6:55 గ్రావీ (xూ) మధ్య జరుగుతుందని అంచనా. ఈ సమయంలో భక్తులు పొన్నంబలమేడు వద్ద ఆకాశంలో కనిపించే దివ్యమైన జ్యోతిని దర్శిస్తారు. ఈ జ్యోతి అయ్యప్ప స్వామి ఆశీస్సులను సూచిస్తుందని భక్తులు విశ్వసిస్తారు.

**ఆధ్యాత్మిక ప్రాముఖ్యత**

మకర జ్యోతి శబరిమల యాత్రలో అత్యంత ముఖ్యమైన ఆధ్యాత్మిక ఘట్టం. ఈ జ్యోతి అయ్యప్ప స్వామి దివ్య సాన్నిధ్యాం తోపాటు ఆధ్యాత్మిక శక్తిని, శాంతిని ప్రసాదిస్తుందని భక్తుల నమ్మకం. మకర సంక్రాంతి రోజున సూర్యుడు మకర రాశిలోకి ప్రవేశించడం వల్ల ఈ సమయం ప్రత్యేక ప్రాముఖ్యతను సంతరించుకుంటుంది. ఈ సందర్భంగా భక్తులు కఠినమైన వ్రత దీక్షను పాటిస్తూ, 41 రోజుల పాటు నియమ నిష్టలతో అయ్యప్ప స్వామిని ఆరాధిస్తారు.

**ప్రధాన ఆకర్షణగా స్వామి తిరువాభరణ ఊరేగింపు..**

మకర జ్యోతి రోజున పందళం మహారాజుల మహల్ నుంచి మూడు పెట్టెల్లో పవిత్ర తిరువాభరణాలు శబరిమలకి తీసుకువస్తారు. ఆ రోజు సాయంత్రం అయ్యప్ప స్వామికి తిరువాభరణ అలంకారం చేస్తారు. అనతరం దీపారాధన నిర్వహిస్తారు. ఇక ఈ రోజు పొన్నంబలమేడులో మకర జ్యోతి మూడు సార్లు దర్శనం ఇస్తుంది.

మకర జ్యోతి దర్శనం కనబడే ప్రదేశాలు

సన్నిధానం పాండితావళం మాలికాపురం ప్రాంతం అట్టతోడు నీలిమల పుల్మేడు శరణ్ గుత్తి మరకూట్టం

**భక్తులకు సూచనలు..**

మకర జ్యోతి దర్శనం కోసం వెళ్లే భక్తులు ముందుగానే ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఆలయ అధికారులు భక్తుల సౌకర్యం కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తారు. అలాగే భక్తులు రద్దీని దృష్టిలో ఉంచుకుని, అధికారుల సూచనలను పాటించాలి. చివరగా ఈ మకర జ్యోతి దర్శనం భక్తులకు ఆధ్యాత్మిక ఆనందం తోపాటు అయ్యప్ప స్వామి దివ్య ఆశీస్సులను పొందే గొప్ప అవకాశాన్ని కల్పిస్తుంది. కొత్త ఏడాదిలో ఈ పవిత్ర క్షణాన్ని దర్శించేందుకు భక్తులంతా సిద్ధంగా ఉండాలి. కాగా, భక్తులకు జనవరి 19, 2026 రాత్రి 9 గంటల వరకు దర్శనానికి అవకాశం ఉంటుంది. జనవరి 20, 2026 శబరిమల ఆలయాన్ని తిరిగి మూసివేస్తామని దేవస్వం బోర్డు పేర్కొంది.

# 'మరి మహాయుతి కూటమిలో ఎందుకు?' అజిత్‌పవార్‌కు సంజయ్ రౌత్ ప్రశ్న



పుణె, పింప్రి చించ్వాడ్ లోకల్ బాడీ ఎన్నికల నేపథ్యంలో మహారాష్ట్రలో పార్టీల మధ్య విమర్శలు, ప్రతి విమర్శలు మొదలయ్యాయి. మహారాష్ట్రలో బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న అజిత్‌పవార్.. పింప్రి చించ్వాడ్ మున్సిపల్ కార్పోరేషన్‌లో అవినీతి జరిగిందని శుక్రవారం ఆరోపించారు. అయితే ఆ మున్సిపల్ కార్పోరేషన్‌లో బీజేపీ పాలకవర్గమే ఉంది. బీజేపీ నేతృత్వంలోని మహాయుతి కూటమిలో అజిత్ పవార్ పార్టీ కూడా భాగస్వామిగా ఉంది. ఈ నేపథ్యంలో దీనిపై ఉద్ధవ్ థాకరే వర్గం శివసేన పార్టీ నాయకుడు సంజయ్ రౌత్ స్పందించారు. బీజేపీ అవినీతి చేసిందని ఆరోపిస్తూ.. ఆ పార్టీతో కలిసి ప్రభుత్వంలో భాగస్వామిగా ఉండటం ఎందుకని రౌత్ ప్రశ్నించారు. అజిత్ పవార్ వర్గం ఎన్సీపీని శరద్‌పవార్ వర్గం ఎన్సీపీలో విలీనం చేయాలని అన్నారు. రెండు వర్గాలు కలిసిపోయి పుణె, పింప్రిచించ్వాడ్ లోకల్ బాడీ ఎన్నికల్లో పోటీ చేయాలని సూచించారు. కాగా అజిత్ పవార్ 2023లో తన చిన్నాన్న నేతృత్వంలోని ఎన్సీపీని చీల్చారు. ఎనిమిది మంది ఎమ్మెల్యేలతో పార్టీని చీల్చి బీజేపీ నేతృత్వంలోని అధికార కూటమిలో కలిశారు. ఈ క్రమంలో అజిత్ పవార్ బీజేపీని విమర్శించడంపై సంజయ్ రౌత్ పైవిధంగా స్పందించారు.

## వంద కోట్ల స్కామ్.. మమత ప్రభుత్వంపై బీజేపీ ఆరోపణ



పశ్చిమ బెంగాల్ లో అధికార టీఎంసీపై బీజేపీ తీవ్ర విమర్శలు చేసింది. మమతా బెనర్జీ ప్రభుత్వం రూ.100 కోట్ల స్కాంకు పాల్పడిందని ఆరోపించింది. పశ్చిమ బెంగాల్ లోని మాల్దా జిల్లాలో వరద బాధితులకు అందించాల్సిన సాయంలో మమత ఆధ్వర్యంలోని టీఎంసీ ప్రభుత్వం రూ.100 కోట్ల అవినీతికి పాల్పడినట్లు సోషల్ మీడియా వేదికగా బీజేపీ ఆరోపించింది. ఈ మేరకు ఎక్స్ లో స్కాంకు సంబంధించి పలు వివరాల్ని బీజేపీ వెల్లడించింది. కోల్ కతా హైకోర్టుకు కాగ్ సమర్పించిన 700 పేజీల నివేదిక ఆధారంగా బీజేపీ ఈ ఆరోపణలు చేసింది. వరద బాధితులు ఇబ్బందులు పడుతుంటే, అధికార పార్టీ నాయకులు వారికి అందించాల్సిన సాయాన్ని దోచుకున్నారని విమర్శించింది. బీజేపీ చెబుతున్న కాగ్ నివేదిక ప్రకారం.. 6,965 మంది బాధితులు అనేకసార్లు వరద సాయం పేరిట నగదు పొందారు. కొందరి బ్యాంకు అకౌంట్లలోకి రెండు నుంచి 42 సార్లు వరద సాయం డబ్బులు క్రెడిట్ అయ్యాయి. అసలు నష్టమే జరగని కొన్ని నిర్మాణాల మరమ్మతులకు రూ.7.5 కోట్లు చెల్లించారు. ప్రభుత్వ వేతనాలు పొందుతున్న వారికి కూడా సాయం అందింది. వరద సాయం కోసం దరఖాస్తే చేయని మరికొందరికి కూడా డబ్బులు చెల్లించినట్లు ఆధారాలున్నాయి. టీఎంసీతో సంబంధం ఉన్న పలువురు ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు దీని ద్వారా లబ్ధి పొందారని బీజేపీ ఆరోపిస్తోంది. ఈ అంశంపై విచారణ జరిగితే నిజాలు బయటకు వస్తాయనే ఉద్దేశంతో దీనికి సంబంధించి పత్రాలు మాయం చేస్తున్నారని బీజేపీ అంటోంది. మమతా బెనర్జీ ప్రభుత్వం ప్రజా ధనాన్ని లూటీ చేస్తోందని బీజేపీ విమర్శించింది. టీఎంసీ దీనికి సమాధానం చెప్పాలని, ఈ ఏడాది మమతను బెంగాల్ ప్రజలు ఇంటికి పంపిస్తారని కూడా బీజేపీ విమర్శించింది.

## దేశాధ్యక్షుడు మదురో, ఆయన భార్య ఎక్కడున్నారో తెలియడంలేదు



వెనెజులాలో తీవ్ర ఉద్రిక్తత, అనిశ్చితి నెలకొన్నాయి. దేశంలోని పలు ప్రాంతాలపై అమెరికా సైన్యం శనివారం తెల్లవారుజామున దాడులు జరిపిన అనంతరం, అధ్యక్షుడు నికోలస్ మదురో, ఆయన భార్య సిలియా ఫ్లోర్స్ ఆచూకీ తెలియడం లేదని ఉపాధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్ సంచలన ప్రకటన చేశారు. మదురో దంపతులు బతికే ఉన్నారో లేదో చెప్పాలని, వారిని తమకు చూపించాలని ఆమె అమెరికా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వెనెజులానా డి టెలివిజన్‌కు ఇచ్చిన టెలిఫోన్ ఇంటర్వ్యూలో ఆమె ఈ వ్యాఖ్యలు చేసినట్లు స్థానిక పత్రిక 'ఎల్ నేషనల్' వెల్లడించింది. దేశాన్ని రక్షించుకోవడానికి ప్రజలు, సైన్యం కలిసికట్టుగా ముందుకు రావాలని రోడ్రిగ్జ్ పిలుపునిచ్చారు. మరోవైపు, ఈ దాడిపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన చేశారు. వెనెజులా అధ్యక్షుడు నికోలస్ మదురో, ఆయన భార్యను అమెరికా బలగాలు విజయవంతంగా పట్టుకున్నాయని, వారిని దేశం నుంచి తరలించామని తెలిపారు. తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ట్రూత్ సోషల్' వేదికగా ట్రంప్ ఈ విషయాన్ని ప్రకటించారు. అమెరికా చట్ట అమలు సంస్థల సహకారంతో ఈ ఆపరేషన్ నిర్వహించామని, మరిన్ని వివరాలను మార్-ఎ-లాగోలో స్థానిక కాలమానం ప్రకారం ఉదయం 11 గంటలకు జరిగే మీడియా సమావేశంలో వెల్లడిస్తానని చెప్పారు. శనివారం తెల్లవారుజామున వెనెజులా రాజధాని కారకాస్‌తో పాటు మిరాండా, అరాగ్వా, లా గైరా ప్రాంతాల్లో భారీ పేలుళ్ల శబ్దాలు వినిపించాయి. చినూక్ హెలికాప్టర్లు, ఇతర ప్రత్యేక దళాలతో అమెరికా సైన్యం ఈ ఆపరేషన్ చేపట్టినట్లు ఫాక్స్ న్యూస్ వర్గాలను ఉటంకిస్తూ 'ఎల్ నేషనల్' పేర్కొంది. అమెరికా సైన్యానికి చెందిన అత్యంత కీలకమైన 'డెల్టా ఫోర్స్' యూనిట్ ఈ దాడిలో పాల్గొని మదురోను బంధించినట్లు అమెరికన్ మీడియా కథనాలు ప్రసారం చేసింది. గత కొన్ని నెలలుగా వెనెజులా తీరంలో అమెరికా తన సైనిక కార్యకలాపాలను పెంచిందని, మదురో పదవి నుంచి తప్పుకోవాలని వైట్‌హౌస్ తీవ్రంగా ఒత్తిడి చేస్తోందని స్థానిక మీడియా గుర్తుచేసింది. ఈ సైనిక దాడికి ట్రంప్ కొద్ది రోజుల క్రితమే గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని ప్రభుత్వ వర్గాలు వెల్లడించినట్లు కథనాలు వస్తున్నాయి.



## బీజేపీకి చెక్.. కాంగ్రెస్ పార్టీతో విజయ్ పొత్తు?

తమిళ స్టార్ హీరో విజయ్ స్థాపించిన టీవీకే (తమిళగ వెట్రి కళగం) పార్టీ ఈ ఏడాది జరగబోయే తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేయబోతుంది. ఈ నేపథ్యంలో టీవీకే ఒంటరిగా పోటీచేస్తుందా లేక మరో పార్టీతో పొత్తు పెట్టుకుంటుందా అనే సందేహాలు తలెత్తుతున్నాయి. తాజా సమాచారం ప్రకారం టీవీకే.. కాంగ్రెస్ పార్టీతో పొత్తు కోసం ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. దీనిపై టీవీకే జాతీయ ప్రతినిధి గెరాల్డ్ కీలక వ్యాఖ్యలు చేశారు. టీవీకే, కాంగ్రెస్ సహజ భాగస్వాములు అని చెప్పారు. రెండు పార్టీలు లౌకిక వాదానికి కట్టుబడి ఉన్నాయని, మత తత్వానికి వ్యతిరేకమని తెలిపారు. అందుకే రెండు పార్టీలు సహజ భాగస్వాములని, తమ అధినేత విజయ్, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మంచి మిత్రులని కూడా గెరాల్డ్ అన్నారు. అయితే, రెండు పార్టీలు కలిసి పనిచేసే విషయంలో కొన్ని సమస్యలున్నాయని, ముఖ్యంగా తమిళనాడు కాంగ్రెస్ విభాగంతో ఉన్న సమస్యల్ని పరిష్కరించుకోవాల్సి ఉందన్నారు. “భవిష్యత్ లో టీవీకే, కాంగ్రెస్ కలిసి పనిచేయొచ్చు. అయితే, రాష్ట్ర కాంగ్రెస్ నేతలు ఈ అంశంపై టీవీకేతో చర్చించేందుకు అడ్డు పడుతుండొచ్చు” అని గెరాల్డ్ అభిప్రాయపడ్డారు. కాగా, రెండు పార్టీల పొత్తు గురించి ఇటీవల ప్రచారం జరుగుతోంది. గత నెలలో జరిగిన టీవీకే సమావేశానికి కొందరు కాంగ్రెస్ నేతలు కూడా హాజరవ్వడం ఈ ప్రచారానికి మరింత బలం చేకూర్చినట్లైంది. ఒకవేళ టీవీకే, కాంగ్రెస్ కలిసి పోటీ చేస్తే బీజేపీ వ్యతిరేక ఓటు

# కేటీఆర్‌ను కాదని..

**హైదరాబాద్ :** తెలంగాణలో శీతాకాల అసెంబ్లీ సమావేశాలు మొదలయ్యాయి.. తొలి రోజు సమావేశానికి మాజీ ముఖ్య మంత్రి కేసీఆర్ హాజరయ్యారు.. సంతకం పెట్టి వెళ్లిపోయారు. ఈ నేపథ్యంలో కేసీఆర్ కీలక నిర్ణయం తీసుకున్నారు. శాసనసభలో డిప్యూటీ ఫ్లోర్ లీడర్ గా హరీష్ రావును నియమించారు. తలసాని శ్రీనివాస్ యాదవ్, సబితా ఇంద్రారెడ్డి కూడా డిప్యూటీ ఫ్లోర్ లీడర్లుగా కేసీఆర్ అవకాశం కల్పించారు. శాసనమండలిలో భారత రాష్ట్ర సమితి తరపున డిప్యూటీ ఫ్లోర్ లీడర్లుగా ఎల్ రమణ, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డిని నియమించారు.. విప్ గా దేశపతి శ్రీనివాస్ ను నియమించారు. భారత రాష్ట్ర సమితి తరపున ఫ్లోర్ లీడర్ గా మండలిలో సిరికొండ మధుసూదనాచారి కొనసాగుతారు. తాజా నియామకాలలో కెసిఆర్ తన కుమారుడు కేటీఆర్ ను ప్రస్తావించలేదు. పార్టీ వ్యవహారాలను కేటీఆర్ నిర్వహిస్తున్నప్పటికీ.. కెసిఆర్ ఆయన పనితీరు పట్ల అంత సుముఖంగా లేరని కొంతకాలంగా విమర్శలు వినిపిస్తున్నాయి. రాజకీయ విశ్లేషకులు కూడా ఇదే మాట అంటున్నారు. గులాబీ పార్టీ పెద్దతో సన్నిహితంగా ఉండే కొంతమంది వ్యక్తులు కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. కేటీఆర్ కంటే కూడా పార్టీని హరీష్ రావు సమర్థవంతంగా నడిపించగలుగుతారని.. ఈ విషయం కెసిఆర్ కు గతంలో తెలుసని.. పుత్ర ప్రేమ వల్ల ఆయన కొంతకాలంగా పార్టీ పెత్తనం మొత్తం కేటీఆర్ కు అప్పగించారని.. అయితే తన అంచనాలకు మించిన స్థాయిలో కేటీఆర్ పనిచేయలేకపోతున్నారని.. అందువల్లే శాసనసభలో డిప్యూటీ ఫ్లోర్ లీడర్ గా హరీష్ రావుకు అవకాశం కల్పించారని ప్రచారం జరుగుతోంది.హరీష్ రావు



ను డిప్యూటీ ఫ్లోర్ లీడర్ గా నియమించిన తర్వాత అసెంబ్లీలో పార్టీ వైఖరిని మరింత బలోపేతం చేస్తుందని గులాబీ నాయకులు అభిప్రాయపడుతున్నారు. శాసనసభలో వ్యూహాలను అమలు చేయడంలో కేటీఆర్ కంటే కూడా హరీష్ రావు మెరుగ్గా పనిచేస్తారని ప్రచారం జరుగుతోంది. హరీష్ రావు కు బాధ్యతలు అప్పగించడం ద్వారా శాసనసభలో పార్టీ పనితీరు మెరుగుపడుతుందని.. బలమైన ప్రతిపక్షంగా భారత రాష్ట్ర సమితి తన పాత్రను పోషిస్తుందని.. గులాబీ పార్టీ నాయకులు అభిప్రాయపడుతున్నారు.. ఇటీవల కాలంలో కవిత కూడా పార్టీని హైజాక్ చేసే కుట్ర హరీష్ రావు అమలు చేస్తున్నారని ఆరోపించారు. ఆమె ఆరోపణలకు తగ్గట్టుగానే కేసీఆర్ శాసనసభలో డిప్యూటీ ఫ్లోర్ లీడర్ బాధ్యతను హరీష్ రావుకు అప్పగించారు. ఈ ప్రకారం కేటీఆర్ ను కెసిఆర్ పక్కన పెట్టినట్టేనా? త్వరలోనే పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ బాధ్యత కూడా హరీష్ రావుకు అప్పగిస్తారా? అనే ప్రశ్నలను రాజకీయ విశ్లేషకులు వ్యక్తం చేస్తున్నారు. మరి దీనిపై గులాబీ నాయకులు ఇంతవరకు పెదవి విప్పలేదు.

# మున్సిపల్స్‌లో కాంగ్రెస్ పాచికలు

**హైదరాబాద్ :** ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ దుమ్మురేపింది. కనివిని ఎరుగని స్థాయిలో స్థానాలను సంపాదించి సరికొత్త రికార్డు సృష్టించింది. వాస్తవానికి గులాబీ పార్టీ గట్టి పోటీ ఇస్తుంది అనుకున్నప్పటికీ.. క్షేత్రస్థాయిలో అలాంటి పరిస్థితి కనిపించలేదు. సొంత మీడియాలో డబ్బాలు కొట్టుకున్నప్పటికీ.. గులాబీ పార్టీ చెప్పుకునే స్థాయిలో మాత్రమే స్థానాలను సంపాదించుకుంది. పార్లమెంటు ఎన్నికల్లో 0 స్థానాలకు పరిమితమైన ఆ పార్టీ.. పంచాయతీ ఎన్నికల్లో కాస్త బెటర్ పెర్ఫార్మన్స్ కనపరిచింది.పంచాయతీ ఎన్నికల్లో సాధించిన ఉత్సాహం నేపథ్యంలో.. ఇప్పుడు ప్రభుత్వం పురపాలక ఎన్నికలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రాష్ట్రంలో మొత్తం 117 మున్సిపాలిటీలు.. ఆరు కార్పొరేషన్లలో ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్ర వ్యాప్తంగా జనవరి ఐదున మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో అన్ని పార్టీల నాయకులతో సమావేశాలు నిర్వహించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. పదవ తేదీన వార్డుల వారీగా ఓటర్ల జాబితా ప్రదర్శించనుంది. రాష్ట్ర ఎన్నికల సంఘం ఇప్పటికే నోటిఫికేషన్ విడుదల చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 2,996 వార్డుల ఓటర్ల జాబితా ఎన్నికల సంఘానికి చేరుకుంది. అంతేకాదు మంగళవారం మున్సిపాలిటీల వారిగా పోలీస్ స్టేషన్ల పేర్లను కూడా ప్రకటించింది. జనవరి 1న వార్డుల వారీగా ఓటర్ల జాబితాను ప్రకటించి.. ఆ తర్వాత అభ్యంతరాలు స్వీకరిస్తుంది.2019 మున్సిపల్ ఆక్ట్ ప్రకారం ఎన్నికల నిర్వహించబోతున్నారు. 2025 అక్టోబర్ 1 నాటికి అసెంబ్లీ నియోజకవర్గం వారిగా నమోదు చేసిన ఓటర్ల జాబితాను అనుసరించి.. పురపాలకాలు, నగర పాలకాలలో వార్డుల వారీగా ఓటర్ల జాబితాను సిద్ధం చేస్తున్నట్టు రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. ఇక గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ చుట్టూ ఔటర్ రింగ్ రోడ్ లోపల ఉన్న 27 మున్సిపాలిటీలు.. ఇతర కార్పొరేషన్లు హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ లో విలీనమయ్యాయి. దీంతో ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా పురపాలక శాఖ పరిధిలో ఉన్న 124 మున్సిపాలిటీలు, 9 కార్పొరేషన్లు ఉన్నాయి. గ్రేటర్



హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పాలకవర్గానికి ఫిబ్రవరి వరకు గడువు ఉంది. ఖమ్మం, వరంగల్ నగర పాలకాలు, నకిరేకల్, జడ్చర్ల, అచ్చంపేట, సిద్దిపేట, కొత్తూరు వంటి మున్సిపాలిటీలకు ఫిబ్రవరి వరకు పాలకవర్గాలకు గడువు ఉంది.పంచాయతీ ఎన్నికల మాదిరిగానే మున్సిపాలిటీ ఎన్నికల్లో కూడా సత్తా చూపించాలని కాంగ్రెస్ పార్టీ భావిస్తుంది. పంచాయతీ ఎన్నికల్లో సానుకూల ఫలితాలు వచ్చిన నేపథ్యంలో.. మున్సిపల్ ఎన్నికల్లో కూడా అదే స్థాయిలో ఫలితాలు వస్తాయని కాంగ్రెస్ పార్టీ భావిస్తోంది. అందువల్లే ఆయా పురపాలకాల పరిధిలో అభివృద్ధి పనులను వేగవంతం చేసింది. కీలకమైన నాయకులను పార్టీలోకి చేర్చుకునే ప్రయత్నాలను మొదలుపెట్టింది. మరోవైపు గులాబీ పార్టీ కూడా గట్టి పోటీ ఇవ్వాలని భావిస్తోంది.. ఇక పంచాయతీ ఎన్నికల్లో కమలం పార్టీ తన స్థాయికి తగ్గట్టుగా ఫలితాలు అందుకోలేకపోయినప్పటికీ.. పురపాలకాలలో సత్తా చూపించాలని భావిస్తోంది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో బిజెపి సత్తా చూపించింది. అయితే ఈసారి హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మరింత విస్తరించిన నేపథ్యంలో. మెరుగైన ఫలితాలు సాధించాలని బిజెపి నాయకులు భావిస్తున్నారు.

# 60 మార్కులకే ఇంటర్ మ్యాథ్స్

**హైదరాబాద్ :** మన సమాజంలో చాలా మంది విద్యార్థులుకు లెక్కల సబ్జెక్ట్ అంటేనే భయం. చదవకుండానే... అర్థం చేసుకోకుండానే ఫెయిల్ అవుతామని భయపడతారు. ప్రతి ఏటా పది, ఇంటర్ తరగతుల్లో ఎక్కువ మంది విద్యార్థులు ఫెయిల్ అవుతోంది కూడా మ్యాథ్స్ సబ్జెక్ట్‌లోనే. మ్యాథ్స్ పరీక్ష అంటేనే మరీ ముఖ్యంగా ఇంటర్ విద్యార్థులు భయంతో వణికిపోతుంటారు. ఈ పరిస్థితిలో మార్పు తెచ్చేందుకు తెలంగాణ ఇంటర్మీడియట్ బోర్డు కీలక నిర్ణయం తీసుకుంది. దీని ప్రకారం వచ్చే సంవత్సరం నుంచి ఇంటర్ విద్యార్థులకు కేవలం 60 మార్కులకే మ్యాథ్స్ పరీక్ష నిర్వహించబోతున్నారు. 2026-2027 విద్యా సంవత్సరం నుంచి ఇది అమలు కాబోతుంది.తెలంగాణ ఇంటర్మీడియట్ బోర్డు... విద్యార్థులపై పరీక్షల ఒత్తిడి, భారాన్ని తగ్గించే దిశగా కీలక నిర్ణయం తీసుకుంది. మ్యాథమెటిక్స్ పరీక్షా సిలబస్, విధానంలోనూ విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టింది. ఇప్పటి వరకు మ్యాథ్స్ పేపర్ అంటే 75 మార్కులకు రాత పరీక్ష ఉంది. వచ్చే ఏడాది నుంచి ఈ విధానం మారనుంది. మ్యాథ్స్ పరీక్ష కోసం... సీబీఎస్ఈ (అబాఇ) మాదిరి మన దగ్గర కూడా ఇంటర్నల్ మార్కుల విధానాన్ని తీసుకురావాలని బోర్డు నిర్ణయించింది.ప్రస్తుతం ఇంటర్‌లో మ్యాథ్స్?ఏ, మ్యాథ్స్?బీ రెండు పేపర్లకు చెరో 75 మార్కుల చొప్పున మొత్తం 150 మార్కులకు పరీక్ష నిర్వహిస్తున్నారు. అయితే వచ్చే విద్యా సంవత్సరం నుంచి మాత్రం తెలంగాణలో ఇంటర్ మ్యాథ్స్ పరీక్ష కేవలం 60 మార్కులకే జరగనుంది. ఇది కూడా థియరీ పార్ట్. మిగిలిన 15 మార్కులను 'ఇంటర్నల్స్'కు కేటాయించనున్నారు. విద్యార్థి సామర్థ్యం, ప్రాజెక్టులు, అటెండెన్స్ వంటి అంశాల ఆధారంగా ఇంటర్నల్స్‌లో ఈ 15 మార్కులు వేస్తారు.దీంతో విద్యార్థులపై పరీక్షల ఒత్తిడి కొంత తగ్గే అవకాశం ఉంది. ఇప్పటివరకూ ఎంపీసీ , ఎంఈసీ



విద్యార్థులకు మ్యాథ్స్ పేపర్ ఒకేలా ఉంది. రెండు పేపర్లకు వచ్చే 150 మార్కులను శాతంగా తీసుకొని వంద మార్కులకు కుదించారు. ఇకపై ఈ విధానానికి చెక్ పడనున్నది. ఎంఈసీ విద్యార్థులకు మ్యాథ్స్ పేపర్‌ను వంద మార్కులకు నిర్వహించనున్నారు. ఎంపీసీ, ఎంఈసీ విద్యార్థులకు వేర్వేరుగా ప్రశ్నపత్రాలు రూపొందించనున్నారు.అలానే ఇంటర్ పరీక్షల విధానంతో పాటు సిలబస్‌లో కూడా భారీ మార్పులు చేయబోతున్నారు. ప్రస్తుతం ఎక్కువ మంది విద్యార్థులు... మ్యాథ్స్ బీలోనే ఫెయిల్ అవుతున్నారు. దీన్ని గమనించిన ఇంటర్ బోర్డు... మ్యాథ్స్ బీ పాఠ్య పుస్తకంలోని కొన్ని కఠినమైన చాప్టర్లను మ్యాథ్స్ ఏలోకి మార్చాలని డిసైడ్ అయింది. ఈ మార్పులన్నీ వచ్చే విద్యా సంవత్సరం (2026?27) నుంచే పక్కాగా అమలు కానున్నాయి.

## అసెంబ్లీలో రండి.. తేల్చుకుందాం

**-మొదటిపేజీ తరువాయి**

చెబుతున్నారని ఎద్దేవా చేశారు. సభకు వచ్చి చర్చలో పాల్గొంటే ఎవరి బట్టలు ఎవరు ఊడదీయాలో ప్రజలే తేల్చేవారని అన్నారు. ప్రాజెక్టులపై నిలదీస్తామన్న కేసీఆర్ సభకు ఎందుకు రాలేదని ప్రశ్నల వర్షం కురిపించారు సీఎం రేవంత్‌రెడ్డి.

## బల్దియా పీఠం మనదే!

**-మొదటిపేజీ తరువాయి**

తీసుకున్నాయి.

అధికార కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి మెదక్ జిల్లాలోని మెజార్టీ బల్దియాల్లో జెండా ఎగురవేసేందుకు ప్రత్యేక వ్యూహాలను సిద్ధం చేస్తోంది. ముఖ్యంగా డీసీసీ అధ్యక్షులపైనే ఈ బాధ్యతలు మోపాలని నిర్ణయించినట్లు సమాచారం. ఎమ్మెల్యేలు, నియోజకవర్గ పార్టీ బాధ్యులను సమన్వయం చేసుకొని పార్టీ అభ్యర్థులు గెలుపొందేందుకు అవసరమైన కసరత్తు చేపట్టాలని రెండు రోజుల కిందట పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ డీసీసీలకు ఆదేశాలు జారీచేశారు. ఈ ఎన్నికల ఫలితాలను డీసీసీల పనితీరుకు ప్రామాణికంగా తీసుకుంటామని వెల్లడించినట్లు తెలుస్తోంది. బీఆర్ఎస్ ముఖ్య నేత హరీశ్‌రావు బల్దియా ఎన్నికలకు ఇప్పటి నుంచే పావులు కదుపుతున్నారు. పటాన్‌చెరు నియోజకవర్గంలో అత్యధికంగా ఐదు పురపాలికలున్నాయి. వీటిలో గెలుపొంది సత్తా చాటేందుకు అవసరమైన ఏర్పాట్లు మొదలుపెట్టారు. బలమైన నేతలకు క్షేత్రస్థాయిలో పని చేసుకోవాలని సంకేతాలు ఇచ్చినట్లు సమాచారం. ఇందుకు అనుసరించాల్సిన వ్యూహాలపై పార్టీ ఎమ్మెల్యేలతో పాటు మాజీ ఎమ్మెల్యేలకు దిశానిర్దేశం చేసినట్లు తెలుస్తోంది.

బీజేపీ సైతం అన్ని పురపాలికల్లో పోటీ చేసి మెజార్టీ కౌన్సిలర్లు గెలిపించేందుకు అవసరమైన కసరత్తు చేస్తోంది.

**మూడు జిల్లాలో ఓటర్ల సంఖ్య :**

సంగారెడ్డి జిల్లాలో 11 పురపాలికలు, 256 వార్డులు, 3,54,167 ఓటర్లు ఉన్నారు.

సిద్దిపేట జిల్లాలో 4 పురపాలికలు, 72 వార్డులు, 1,01,090 ఓటర్లు ఉన్నారు.

మెదక్ జిల్లాలో 4 పురపాలికలు, 75 వార్డులు, 87,615 ఓటర్లు ఉన్నారు.

జనవరి మూడో వారం నాటికి సిద్దంగా : రాష్ట్రంలో కొన్ని రోజుల క్రితం గ్రామ పంచాయతీ ఎన్నికలు ముగిశాయి. ఆ పంచాయతీ ఎన్నికల ఫలితాలతో అధికార పార్టీ కాంగ్రెస్ ఉత్సాహంగా ఉంది. ఇదే దూకుడుతో రాష్ట్రంలో పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సిద్ధమవుతోంది. విద్యార్థులకు పరీక్షల సీజన్ మొదలయ్యేలోపు అంటే ఫిబ్రవరి రెండో వారం నాటికి ఎన్నికలు పూర్తి చేయాలని చూస్తోంది. జనవరి మూడో వారం నాటికి అన్ని రకాలుగా సిద్ధంగా ఉండాలని ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు సూచించినట్లు సమాచారం. సర్కారు సూచనల మేరకు అధికారులు ఇప్పటికే ఏర్పాట్లు సైతం మొదలుపెట్టారు.

**20వ తేదీలోగా నోటిఫికేషన్**

రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికలకు షెడ్యూల్ సిద్ధమైంది. ఈ నెల 11 లేదా 20వ తేదీలోగా నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉంది. అందుకు తగ్గట్లుగా ప్రభుత్వం, రాష్ట్ర ఎన్నికల కమిషన్ కసరత్తు మొదలుపెట్టాయి. గడువు ముగిసిన 117 మున్సిపాలిటీ పాలకవర్గాలకు ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించింది. ఎన్నికల సంఘం జనవరి 1న ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకటించింది. ఈ నెల 10న తుది జాబితా వెలువరిస్తుంది. దీంతో ఈ నెల 11న ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉంది. ఒకవేళ సంక్రాంతి పండగ, సెలవుల కారణంగా కుదరకపోతే 20న విడుదల చేస్తారు. ఇందుకు అనుగుణంగా, మిగతా ప్రక్రియ సజావుగా సాగేలా పురపాలక పట్టణాభివృద్ధి శాఖ సిద్ధమవుతోంది.

## తెలంగాణ నుంచే ఇవన్నీ నేర్చుకున్నాను..

**-మొదటిపేజీ తరువాయి**

తనకు పోరాడే ధైర్యాన్ని ఇచ్చిందని, ఈ ప్రాంత ప్రజల స్ఫూర్తే తనను ముందుకు నడిపించిందని చెప్పారు.

**పాలసీ ప్రకారమే పోరాటం**

అంజన్న సన్నిధి తనను కాపాడిందని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. కష్టకాలాల్లో ఆధ్యాత్మిక బలం తనకు అండగా నిలిచిందని అన్నారు. ఓటమికి భయపడకుండా పోటీ చేసే మనస్తత్వం జనసేనలో పెరగాలని సూచించారు. పోటీ పడినప్పుడే అనుభవం వస్తుందని, ప్రజల మధ్య ఉండగలమని తెలిపారు. వ్యక్తిగతంగా ఎవ్వరూ తనకు శత్రువులు కాదని స్పష్టం చేసిన పవన్ కళ్యాణ్, తమ పోరాటం వ్యక్తులపై కాదని, పాలసీ ప్రకారమే జరుగుతుందని అన్నారు. ప్రజా ప్రయోజనాల కోసం, సరైన విధానాల కోసం మాత్రమే తాము రాజకీయాల్లో పోరాటం చేస్తున్నామని తెలిపారు.

**జనసైనికులు ముందుండాలి**

ప్రజా సమస్యల పరిష్కారం కోసం జనసైనికులు ముందుండాలని పిలుపునిచ్చారు. ప్రజల మధ్య ఉండి వారి సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి కృషి చేయాల్సిన బాధ్యత ప్రతి జనసైనికుడిపై ఉందని అన్నారు. చివరగా వంద మైళ్ల ప్రయాణం కూడా ఒక్క అడుగుతోనే ప్రారంభమవుతుందని పేర్కొన్న పవన్ కళ్యాణ్, జనసేన ప్రయాణం ఇప్పుడు బలంగా మొదలైందని, ముందున్న లక్ష్యాన్ని సాధించేందుకు అందరూ కలిసి పనిచేయాలని కార్యకర్తలకు సూచించారు.

## తప్పుడు చరిత్ర రాసే ప్రయత్నంలో కేంద్రం

**-మొదటిపేజీ తరువాయి**

ప్రపంచం గర్వించదగిన త్యాగశీలి. ఉపాధి హామీ చట్టంలో మార్పులు తేవడాన్ని కాంగ్రెస్ తీవ్రంగా ఖండిస్తుంది. కేంద్రం.. దేశం కోసం ప్రాణాలు అర్పించిన గాంధీ, దేశ స్వాతంత్రం కోసం 12 ఏళ్ళు జైలు జీవితం గడిపిన నెహ్రూలను మరిపించే ప్రయత్నం చేస్తుంది. దేశంలో వలసల నివారణ కోసం సోనియా గాంధీ తీసుకువచ్చిన గొప్ప చట్టం ఇది. పేదలకు ఉపాధి హక్కును కల్పించి జీవనోపాధిని కల్పించింది. 20 ఏళ్లుగా కోట్ల మంది ఆకలి తీర్చిన చట్టం ఇది. ఉపాధి హామీ పనుల్లో 90 శాతం మంది లబ్ధిదారుల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీలే ఉన్నారు. 62 శాతం మంది మహిళలు లబ్ది పొందారు. పేదలకు ఆపన్న హస్తంలా నిలిచిన ఉపాధి హామీని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తూ వస్తుంది. ఒక తెలంగాణలోనే గత ఏడాది 6 కోట్ల విలువైన పని దినాలు తగ్గించారు. పేదల పొట్ట కొట్టి కార్పోరేట్ శక్తులను పెంచి పోషించడమే బీజేపీ విధానం. పెట్రోల్, డీజిల్ రేటు మూడింతలు పెరిగింది. అంతర్జాతీయ మార్కెట్ క్రూడాయిల్ ధరలు తగ్గినా.. దేశంలో రేటు పెరుగుతుంది. కేంద్ర ఆర్థిక విధానాల వల్ల రాష్ట్రాల ఆదాయ వనరులు తగ్గాయి. ఇది చాలదు అన్నట్లు ఉపాధి హామీ నిధుల్లో 40 శాతం భారం వేయడం అన్యాయం. కేంద్రం చర్యల వల్ల ఒక్క తెలంగాణ మీదే 1800 కోట్ల అదనపు భారం పడుతుంది' అని కామెంట్స్ చేశారు.


## ఖమ్మం జిల్లాలో కాలువలోకి దూసుకెళ్లిన స్కూల్ బస్సు,

### 40 మందికి పైగా విద్యార్థులకు గాయాలు

**ఖమ్మం :** పెనుబల్లి మండలం గణేష్‌పాడు గ్రామ సమీపంలో శుక్రవారం సాయంత్రం ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. దాదాపు 100 మంది విద్యార్థులతో వెళ్తున్న స్కూల్ బస్సు అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న కాలువలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో సుమారు 40 మందికి పైగా విద్యార్థులు గాయపడగా, పలువురికి తీవ్ర గాయాలు అయినట్లు సమాచారం.వేంసూరు మండలం మద్దులగూడెంలో ఉన్న వివేకానంద విద్యాలయం నుంచి విద్యార్థులతో బయల్దేరిన ఈ స్కూల్ బస్సు.. గణేష్‌పాడు, ఎల్ఎస్ బంజర్, కెఎం బంజర్, మర్లకుంట, ముత్తుగూడెం గ్రామాలకు చెందిన విద్యార్థులను వారి ఇళ్లకు దింపుతూ వెళ్తున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. స్థానిక ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం, గణేష్‌పాడు గ్రామ శివారులోకి రాగానే డ్రైవర్ బస్సును అతి వేగంగా నడపడంతో వాహనం నియంత్రణ కోల్పోయి కాలువలోకి పల్టీ కొట్టింది.ప్రమాదం జరిగిన వెంటనే బస్సులో అరుపులు, కేకలు వినిపించడంతో చుట్టుపక్కల గ్రామస్తులు సంఘటనా స్థలానికి పరుగులు తీశారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో ఎఓ బంజార్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. అదే సమయంలో విద్యార్థుల తల్లిదండ్రులు కూడా అక్కడికి చేరుకుని తీవ్ర ఆందోళనకు గురయ్యారు. బస్సులో చిక్కుకున్న విద్యార్థులను స్థానికుల సహకారంతో బయటకు తీసి అంబులెన్సులు, ప్రైవేట్ వాహనాల ద్వారా పెనుబల్లి, అలాగే ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్టీఆర్ జిల్లా తిరువూరులోని ప్రైవేట్ ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు.

ధర్మఘంట

# గుండెపోటు లక్షణాలు..



ఇటీవల కాలంలో గుండెపోటు, కార్డియాక్ అరెస్ట్ అనేవి ఆకస్మిక మరణాలకు కారణమవుతున్నాయి. అయితే, గుండెపోటు రావడానికి ముందు కొన్ని లక్షణాలు కనిపిస్తాయి. వాటిని గుర్తించి ముందుగా జాగ్రత్త పడితే ప్రాణాలను కాపాడుకోవచ్చని వైద్యులు సూచిస్తున్నారు. తీవ్రమైన గుండెపోటుకు 10 నుంచి 15 నిమిషాల ముందు కొన్ని లక్షణాలు కనిపిస్తాయని, వాటిని గుర్తించి వెంటనే వైద్యులను సంప్రదిస్తే ప్రాణాలు కాపాడుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు. గుండెపోటు ఇటీవల కాలంలో వయస్సుతో సంబంధం లేకుండా ప్రభావితం చేస్తున్న తీవ్రమైన వ్యాధి. చాలా సందర్భాల్లో ఆస్పత్రికి తీసుకెళ్లేలోపే ప్రాణాలు పోతున్నాయి. మరికొందరైతే ఉన్నస్థలంలోనే కుప్పకూలిపోయి ప్రాణాలు కోల్పోతున్నారు. గుండెపోటు లేదా కార్డియాక్ అరెస్ట్ అనేవి ఇప్పుడు మనిషికి ప్రాణాంతకంగా మారాయి. అయితే, గుండెపోటుకు ముందు కొన్ని లక్షణాలు కనిపిస్తాయి. వాటిని గుర్తించి జాగ్రత్త పడితే ప్రాణాలను కాపాడుకోవచ్చు. ఇటీవల ఉత్తరప్రదేశ్ రాష్ట్రం బరేలీకి చెందిన బీజేపీ ఎమ్మెల్యే శ్యామ్ బిహారీ లాల్ గుండెపోటుతో మరణించారు. ఆస్పత్రికి తరలించి చికిత్స అందించేలోపే ఆయన తుదిశ్వాస విడిచారు. అయితే, గుండెపోటుకు ముందు కనిపించిన లక్షణాలను నిర్లక్ష్యం చేయడం వల్లే ఆయన కొంత ముందుగా ఆస్పత్రికి రాలేకపోయారని, దీంతో తాము ఆయన ప్రాణాలు కాపాడలేకపోయామని వైద్యులు వెల్లడించారు. బిహారీ లాల్‌కు అకస్మాత్తుగా ఛాతిలో తీవ్రమైన నొప్పి వచ్చింది. అయితే, ఆయన దాన్ని తేలికగా తీసుకున్నారు. అందుకే ఆయన త్వరగా ఆస్పత్రికి రాలేదు. పరిస్థితి విషమించిన తర్వాత ఆస్పత్రిలో చేరారని, కొంత సమయానికే ఆయన మరణించారని వైద్య నివేదికలు పేర్కొన్నాయి. వైద్యుల ప్రకారం.. ప్రతి వ్యక్తికి గుండెపోటుకు ముందు కొన్ని లక్షణాలు కనిపిస్తాయి. కొందరిలో ఆ లక్షణాలు 10 నుంచి 15 నిమిషాల ముందుగానే కనిపిస్తాయి. మరికొందరిలో 4-5 గంటల్లో కనిపిస్తాయి. గుండెలోని అడ్డంకులు రక్తం సరిగ్గా పంపింగ్ కాకుండా నిరోధిస్తున్నాయనడానికి ఇదొక హెచ్చరిక సంకేతం. ఈ పంపింగ్ సమస్య వచ్చిన వెంటనే ఈ లక్షణాలు కనిపిస్తాయి. ఛాతినొప్పి గుండెపోటుకు ప్రధాన సంకేతం. దీన్ని నిర్లక్ష్యం చేస్తే ప్రాణాంతకం కావచ్చు. తీవ్రమైన ఛాతీ నొప్పిని విస్మరించకూడదని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

# చికెన్, మటన్ లివర్ ఏది డేంజర్!



చికెన్, మటన్ లివర్ రెండూ పోషకాలు సమృద్ధిగా ఉండే ఆహారాలు. అయితే, వీటిలో ఇనుము, విటమిన్లు, ప్రొటీన్లు పుష్కలంగా ఉన్నప్పటికీ, కొందరికి ఆరోగ్యపరమైన సమస్యలను తెచ్చిపెడతాయి. కిడ్నీలో రాళ్లు, అధిక కొలెస్ట్రాల్, గుండె జబ్బులు ఉన్నవారు, గర్భిణీ స్త్రీలు వీటిని తినకూడదని నిపుణులు సూచిస్తున్నారు. నాన్ వెజ్ ప్రియులకు వారానికి ఒక రోజు మాంసం తినే అలవాటు సర్వసాధారణం. ఈ క్రమంలోనే చికెన్ లివర్, మటన్ లివర్‌లను ఎక్కువగా తింటుంటారు. ఈ రెండు ఆహార పదార్థాలలో అనేక పోషకాలు దాగున్నాయి. అందుకే మాంసాహారం ఇష్టపడే చాలామంది చికెన్, మటన్ లివర్‌ను ఇష్టంగా తింటారు. అయితే, వీటిలో ఆరోగ్యానికి ఏది మంచిది, ఎవరు వీటిని తినకూడదు అనే విషయాలను ఇప్పుడు తెలుసుకుందామా.. చికెన్ లివర్ తినడం వల్ల శరీరానికి అనేక ప్రయోజనాలు ఉన్నాయి. చికెన్ లివర్‌లో ఐరన్, సెలీనియం, విటమిన్ ఏ, బీ12, ఫోలేట్, ప్రొటీన్లు పుష్కలంగా ఉన్నాయి. ఇందులో ఉండే సెలీనియం క్యాన్సర్ ప్రమాదాన్ని నివారించడంలో సహాయపడుతుంది. అదనంగా, విటమిన్ ఏ, బీ12 కంటి ఆరోగ్యాన్ని, మెదడు పనితీరును మెరుగుపరుస్తాయి. డయాబెటిస్ ఉన్నవారికి చక్కెర స్థాయిలను నియంత్రించడంలో తోడ్పడుతుంది. ఉడికించిన చికెన్ లివర్‌ను మితంగా తినడం వల్ల శరీర కొవ్వు తగ్గుతుందని చెబుతుంటారు. మటన్ లివర్ విషయానికి వస్తే.. చాలామంది చికెన్ లివర్ కంటే మటన్ లివర్ తినడానికి ఎక్కువ ఇష్టపడతారు. మటన్ లివర్‌లో విటమిన్లు ఏ, డీ, బీ12, జింక్, పొటాషియం, కాపర్ వంటి ముఖ్యమైన పోషకాలు ఉన్నాయి. వీటిని తినడం వల్ల శరీరంలో ఆక్సిజన్ సరఫరా మెరుగుపడుతుంది. రక్తహీనతతో బాధపడేవారికి మటన్ లివర్ ఒక మంచి ఆహారం అని చెప్పొచ్చు. ఇది రక్త స్థాయిలను పెంచడానికి సహాయపడుతుంది. విటమిన్ బీ12 శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచి, ఇన్ఫెక్షన్ల నుంచి మనల్ని రక్షిస్తుంది. అయితే ఇన్ని పోషకాలు ఉన్న చికెన్, మటన్ లివర్‌ను కొందరు తినకూడదు. అలా తింటే లేనిపోని అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. కిడ్నీలో రాళ్లు ఉన్నవారు, అధిక కొలెస్ట్రాల్ సమస్య ఉన్నవారు, గుండె జబ్బులతో బాధపడుతున్నవారు, గర్భిణీ స్త్రీలు చికెన్ లేదా మటన్ లివర్‌ను తినకూడదు. ఈ వ్యక్తులు తినడం వల్ల లేనిపోని అనారోగ్య సమస్యలు వస్తాయి.

# ఖాళీ కడుపుతో కరివేపాకు నీరు తాగితే?



కరివేపాకు నీటిని ప్రతిరోజూ ఉదయం ఖాళీ కడుపుతో తాగడం వల్ల అద్భుత ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి. ఇది జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది., మధుమేహం, కొలెస్ట్రాల్‌ను నియంత్రిస్తుంది. బరువు తగ్గాలనుకునే వారికి జుట్టు, చర్మ సౌందర్యాన్ని పెంచుకోవాలనుకునే వారికి కరివేపాకు నీరు ఒక దివ్యౌషధం. మన వంటగదిలో పోపు పెట్టాలన్నా, వంటకానికి మంచి సువాసన రావాలన్నా కరివేపాకు ఉండాల్సిందే. అయితే కరివేపాకు కేవలం రుచి కోసం మాత్రమే కాదు.. దానిలో దాగి ఉన్న పోషకాలు ఆరోగ్యానికి ఒక రక్షణ కవచంలా పనిచేస్తాయి. ముఖ్యంగా ప్రతిరోజూ ఉదయం ఖాళీ కడుపుతో కరివేపాకు మరిగించిన నీటిని తాగడం వల్ల అనేక వ్యాధులను దూరం పెట్టవచ్చని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. కరివేపాకు నీరు శరీరంలోని జీర్ణ ఎంజైమ్‌లను ప్రేరేపిస్తుంది. ఇది మలబద్ధకం, గ్యాస్, కడుపులో మంట వంటి సమస్యలను సమర్థవంతంగా తగ్గిస్తుంది. జీర్ణక్రియను మెరుగుపరుచుకోవాలనుకునే వారికి ఇది ఒక సహజ సిద్ధమైన పరిష్కారం. మధుమేహ వ్యాధిగ్రస్తులకు కరివేపాకు నీరు ఒక వరం లాంటిది. ఇది రక్తంలో గ్లూకోజ్ స్థాయిలను సాధారణ స్థితిలో ఉంచడానికి సహాయపడుతుంది. అలాగే ఇందులో ఉండే కార్బజోల్ ఆల్కలాయిడ్స్, యాంటీఆక్సిడెంట్లు శరీరంలోని చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి, గుండె పనితీరును మెరుగుపరుస్తాయి. శరీరంలోని మెటబాలిజంను పెంచడంలో కరివేపాకు కీలక పాత్ర పోషిస్తుంది. ఇది కొవ్వు పేరుకుపోకుండా నిరోధించడమే కాకుండా శరీర బరువును ఆరోగ్యకరంగా తగ్గించడంలో సహాయపడుతుంది. బరువు తగ్గాలనుకునే వారు తమ మార్నింగ్ డ్రింక్‌గా దీనిని ఎంచుకోవచ్చు. కరివేపాకులో విటమిన్ ఎ, బి, సి, ఇ తో పాటు ఇనుము, కాల్షియం వంటి ఖనిజాలు పుష్కలంగా ఉన్నాయి. తలలో రక్త ప్రసరణను మెరుగుపరిచి జుట్టు రాలడం, చుండ్రు వంటి సమస్యలను తగ్గిస్తుంది. జుట్టు మందంగా, బలంగా పెరిగేలా చేస్తుంది. ముఖంపై నల్లటి మచ్చలు, పిగ్మెంటేషన్, పొడి చర్మం సమస్యలకు కరివేపాకు నీరు చక్కటి పరిష్కారం. ఇది చర్మ రంగును మెరుగుపరిచి మెరిసేలా చేస్తుంది.

# నల్లబెల్లం, తెల్లబెల్లం ఆరోగ్యానికి ఏది బెస్ట్?



బెల్లం అనగానే మనందరికీ గుర్తొచ్చేది తీపి. పంచదార కంటే బెల్లం ఆరోగ్యం అని అందరికీ తెలుసు. కానీ మార్కెట్లో దొరికే రకరకాల బెల్లాల్లో ఏది అసలైనదో, ఏది ఆరోగ్యానికి మరింత మేలు చేస్తుందో చాలామందికి తెలియదు. ఏదైనా ఒకటే కదా అని అనుకుంటాం.  మన వంటకాల్లో, ముఖ్యంగా పండుగ ప్రసాదాల్లో బెల్లానికి ప్రత్యేక స్థానం ఉంది. పూర్వం నుంచి మన పెద్దలు పంచదార కంటే బెల్లాన్నే ఎక్కువగా వాడేవారు. అయితే, నేటి కాలంలో మార్కెట్లో రంగురంగుల బెల్లాలు కనిపిస్తున్నాయి. అన్ని రకాల బెల్లాల్లో తాటి బెల్లం మంచిదని చెబుతారు. ఇది తాటి చెట్టు నుంచి తీసిన నీరా ద్వారా తయారవుతుంది. ఇందులో ఐరన్, మెగ్నీషియం, పొటాషియం వంటి ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి. రక్తహీనతతో బాధపడేవారికి ఇది ఒక అద్భుతమైన ఔషధంలా పనిచేస్తుంది. దీనివల్ల జీర్ణక్రియ మెరుగుపడటమే కాకుండా బాడీ డిటాక్స్ అవుతుంది. మనం నిత్యం వాడేది చెరకు బెల్లం. ఇది శక్తిని అందించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. అయితే ఇందులో మనం గమనించాల్సింది రంగు. మార్కెట్లో తెల్లగా లేదా పసుపు రంగులో మెరిసిపోయే బెల్లం కనిపిస్తే అది కెమికల్స్ కలిసిన బెల్లం అని గుర్తుంచుకోవాలి. సహజమైన పద్ధతిలో తయారైన బెల్లం ముదురు గోధుమ రంగులో లేదా నలుపు రంగులో ఉంటుంది. రంగు తక్కువగా ఉన్న బెల్లమే ఆరోగ్యానికి మేలు చేస్తుంది. కొబ్బరి పువ్వుల నుంచి తీసిన రసంతో ఈ బెల్లం తయారు చేస్తారు. ఇది దక్షిణ భారతదేశంలో కొన్ని చోట్ల కనిపిస్తుంది. ఇందులో యాంటీ ఆక్సిడెంట్స్ ఎక్కువగా ఉండటం వల్ల రోగనిరోధక శక్తిని పెంచడానికి తోడ్పడుతుంది. ఆరోగ్య పరంగా చూస్తే తాటి బెల్లం మొదటి స్థానంలో ఉంటుంది. దీనివల్ల రక్తంలో చక్కెర స్థాయిలు త్వరగా పెరగవు. ఇక సాధారణ చెరకు బెల్లం కొనేటప్పుడు అది ముదురు రంగులో, గట్టిగా ఉండేలా చూసుకోవాలి. తెల్లటి బెల్లం తయారీలో సోడియం కార్బోనేట్ వంటి రసాయనాలు వాడతారు. ఇవి ఆరోగ్యానికి హానికరం. కాబట్టి, మీరు ఇకపై బెల్లం కొనేటప్పుడు కేవలం రుచిని మాత్రమే కాకుండా, అది ఏ రకమో మరియు దాని రంగును బట్టి సరైనది ఎంచుకోండి. తీపి తింటూనే ఆరోగ్యాన్ని కాపాడుకోండి.

ధర్మఘంట

# సమిష్టిగా పని చేస్తేనే మంచి ఫలితాలు సాధ్యం

**కాంగ్రెస్ పార్టీ అంటేనే మోసం...దగా అని అర్థం- మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్**



**జయశంకర్ భూపాలపల్లి :** సమిష్టిగా సమన్వయంతో ముందు చూపుతో పనిచేస్తే మంచి ఫలితాలు సాధించుకోవచ్చని మంథని మాజీఎమ్మెల్యే పుట్ట మధూకర్ అన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మహాముత్తారం మండల కేంద్రంలో శనివారం ముఖ్య కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహాముత్తారం మండలంలో బీఆర్ఎస్ నాయకత్వం పటిష్టంగా ఉందని, గొప్పగా పనిచేస్తున్నారని కొనియాడారు. ఇటీవల జరిగిన స్తానిక సంస్థల ఎన్నికల్లో డబ్బు, అధికారం ఏ మాత్రం పని చేయలేదని అర్థం అవుతుం దన్నారు. డబ్బు అధికారం అక్కడక్కడ మాత్రమే పని చేసిం దని, అనేక గ్రామాల్లో ప్రజలే విజయంసాధించారన్నారు. మన లో కొంత సమన్వయ లోపం ఉందని అంటున్నారని, కానీ కాంగ్రెసోళ్లు తెలివిగా పోతున్నారని, మనం అమాయకత్వం తో నమ్ముతున్నామని, జాగ్రత్త పడకపోవడమే మనకు శాపం అవుతుందన్నారు. రాబోయే ఎంపీటీసీ జెడ్పీటీసీఎన్నికల నేపథ్యంలో ప్రతి ఒక్కరు టీం వర్క్ చేసి మన అభ్యర్థులను గెలిపించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. అయితే ప్రస్తుతం గెలిచిన సర్పంచ్‌లకు ప్రలోభాలకు గురి చేసి పార్టీలోకి తీసుకునే ప్రయత్నాలు చేస్తారని, వారి ప్రలోభాలకు, బెదిరింపులకు లొంగవద్దన్నారు. రాష్ట్ర ప్రభుత్వంతో సర్పంచ్‌లకు ఏ పని కాదని, ప్రభుత్వం వద్ద నిధులు లేవని, కేంద్రంనుంచే నేరుగా వస్తాయన్నారు. ఇప్పటికే రెండేళ్లు గడిచిపోయిందని, మరో ఏడాది అటూ ఇటూ వెళ్లినా మరో రెండేళ్లు కష్టపడితే అటు తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ అంటేనే దగా మోసమని, ఏదోపనిచేస్తామంటూ మభ్యపెట్టడం వారి నైజమన్నారు. గతంలో దుద్దిళ్ల శ్రీధర్ మంత్రిగా ఉన్న సమయంలో మంథని మండలం ఎగ్లాస్‌పూర్ గ్రామ పరిధిలోని బైరన్‌గడ్డకు రోడ్డు వేయిస్తానని అక్కడి రాజయ్యతో ఫోన్ మాట్లాడాడని,కానీ ఇప్పటి వరకు రోడ్డు వేయించలేదన్నారు. ఓట్లు వస్తేనే ఏదో చెప్పి బయటపడాలని చూస్తారని, కానీ మహాముత్తారం మండల ప్రజలు మాత్రం చైతన్యంతో ఉన్నారని ఆయన అభినందించారు.

# మహిళా లోకానికే ఆదర్శం సావిత్రీబాయి ఫూలే

**తాజా మాజీ మున్సిపల్ ఛైర్పెర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్**




**జగిత్యాల :** మహిళా లోకానికే సావిత్రీబాయి ఫూలే ఆదర్శమని తాజా మాజీ మున్సిపల్ ఛైర్పెర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ అన్నారు.జగిత్యాల జిల్లా కేంద్రంలో సావిత్రీబాయి ఫూలే జయంతిని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి ఫూలే జయంతిని అధికారికంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించగా ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సావిత్రిబాయి ఫూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఉపాధ్యాయులకు సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఉపాధ్యాయ వృత్తికే వన్నె తేవడమే కాకుండా గొప్ప రచయిత, సంఘ సంస్కర్త, అట్టడుగు వర్గాల అభ్యున్నతికి నిరంతరం కృషి చేసిన మాతృమూర్తి సావిత్రీబాయి ఫూలే అని మాజీ మున్సిపల్ ఛైర్పెర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ కొనియాడారు. స్త్రీ అభ్యుదయవాది, అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషిచేసిన వీరవనిత సావిత్రీబాయి ఫూలే పోరాట స్ఫూర్తిని ప్రతీ ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మాజీ కౌన్సిలర్ మేక పద్మావతీ పవన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# విద్య ద్వారానే స్త్రీ విముక్తి సాధ్యమన్న తొలి ఉపాధ్యాయిని సావిత్రిబాయి పూలే


**ప్రజాసంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పేట భాస్కర్**



**కోరుట్ల :** దేశ తొలి ఉపాధ్యాయిని సంఘసంస్కర్త రచయిత్రి సావిత్రిభాయి పూలే అని ఆమె నిమ్న వర్గాల అభ్యున్నతి కోసం ఎనలేని కృషిచేసిన జ్యోతిరావు పూలే భార్యగా సుపరిచితురాలు అని తెలంగాణ ప్రజాసంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పేట భాస్కర్ అన్నారు.కోరుట్ల సి ప్రభాకర్ స్మారక గ్రంధాలయం లో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను గ్రంథాలయ గౌరవ అధ్యక్షులు చెన్న విశ్వనాథం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమాం లో ముఖ్య అతిథిగా పాల్గొన్న పేట భాస్కర్ మాట్లాడుతూ కులమత బేధాలకు అతీతంగా సమాజాన్ని ప్రేమించిన ప్రేమ స్వరూపిణి సావిత్రిబాయి పూలే అని ఆధునిక విద్య ద్వారానే స్త్రీ విముక్తి సాధ్యపడుతుందని నమ్మిన ఆమె తన భర్తతో కలిసి 1848 జనవరి 1న పూణేలో మొట్టమొదటిగా బాలికల పాఠశాలను ప్రారంభించిందన్నారు. కుల వ్యవస్థకు పితృస్వామ్యానికి వ్యతిరేకంగా శూద్రుల అస్పృశ్యుల మహిళల సకల హక్కుల కోసం పోరాటం చేయటం తమ సామాజిక బాధ్యతగా ఆ దంపతులు విశ్వసించి ఉద్యమించారని భాస్కర్ కొనియాడారు. నూతన వ్యవస్థ కోసం ప్రాణాలను సైతం ఫణంగా పెట్టి సమష్టిగా పోరాటం చేసిన మహనీయులు వారని సమాజంలోని కులతత్వం ధోరణి కలిగిన చాలామంది పండిత మేధావులు అందరికీ కూడా ఆమె కేవలం జ్యోతిరావు పూలే భార్యగా మాత్రమే తెలుసు కానీ ఆమె ఆధునిక భారతదేశంలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు అన్నారు. పీడిత ప్రజల కోసం ముఖ్యంగా స్త్రీల విద్యాభివృద్ధి కోసం ఎనలేని కృషిచేసిన తొలి తరం ఉద్యమకారుని, ఉపాధ్యాయురాలు, స్ఫూర్తి ప్రదాత సావిత్రిబాయి పూలే అని పేర్కొన్నారు. 18 31 జనవరి 3న మహారాష్ట్రలోని నైగాన్ ప్రస్తుత సతారా జిల్లా ఆమె జన్మస్థలం కాగా 1897 మార్చి 10న ఆమె ఈ లోకాన్ని విడిచారు అన్నారు. ఈకార్యక్రమంలో ఐఎఫ్టియూ రాష్ట్ర నాయకులు చింత భూమేశ్వర్, సిపిఐ నేతలు మౌలానా, చెన్న శ్రీనివాస్, లక్ష్మీ నారాయణ, న్యాయవాది ప్రేమ్ సాగర్ గ్రంథాలయ పాఠకులు పాల్గొన్నారు.

# సమిష్టి కృషితో సమస్యల పరిష్కారం

**అధ్యక్ష, ప్రధాన కార్యదర్శు లు కొలిపాక సాగర్, ఆకుల సతీష్**



**పెద్దపల్లి :** పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ గుమస్తా సంఘం నూతన కార్యవర్గాన్ని మార్కెట్ యార్డు ఆవరణలో జరిగిన ప్రత్యేక సమావేశంలో సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స భ్యులందరి ఏకాభిప్రాయం మేరకు కొత్త కార్యవర్గాన్ని ప్రకటించుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా మాజీ ఏఎంసీ చైర్మన్ జడల సురేందర్, గంట శ్రీనివాస్, కాసనగొట్టు రత్నాకర్, అధ్యక్షులుగా కొలిపాక సాగర్, ఉపాధ్యక్షులు గా నర్ల గోపాల్ యాదవ్, నలువాల శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శిగా ఆకుల సతీష్, కోశాధికారిగా రేచవేణి ఓదెలు తో పాటు, కార్యవర్గ సభ్యులుగా మొహమ్మద్ అలీ, రావుల గోపీ, పెరుక రాజేందర్, జక్కుల రాజేశం, తౌట తిరుపతి, గణబోయిన మల్లి కార్జున్ ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన నాయకులు మాట్లాడుతూ గుమస్తా సంఘం లక్ష్యాలు, భవిష్యత్తు కార్యాచరణ వివరించారు. గుమస్తాలందరి సమస్యల పరిష్కారం కోసం, అలాగే సంఘం అభివృద్ధి కోసం నూతన కార్యవర్గం సమిష్టిగా కృషి చేస్తుందని హామీ ఇచ్చారు. గుమస్తాల హక్కుల పరిరక్షణ, వారి సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా పనిచేస్తామ ని వారు పేర్కొన్నారు. ఈ సమావేశంలో పాల్గొన్న పలువురు గుమస్తా సంఘ సభ్యులు, నూతనంగా ఎన్నికైన కార్యవర్గాన్ని ఘనంగా సన్మానించారు. కొత్త నాయకులకు పూలమాలలు వేసి,శాలువాలతో సత్కరించి, వారికి శుభాకాంక్షలు తెలియజేశారు.

## అసెంబ్లీని రేవంత్ ప్యాలెస్‌లా నడిపిస్తున్నారు.. స్పీకర్‌పై గంగుల కమలాకర్ ఫైర్

**మాజీ మంత్రి గంగుల కమలాకర్**

**హైదరాబాద్ :** ఉమ్మడి రాష్ట్రంలో కూడా ఇన్ని అవమానాలు ఎదుర్కోలేదని మాజీ మంత్రి గంగుల కమలాకర్ తెలిపారు. కిరణ్‌కుమార్ రెడ్డి అప్పట్లో స్పీకర్‌గా ఉండే అని.. ఆ తర్వాత మనోహర్ అయ్యారని.. అయినా ఉద్యమ సమయంలో ఇలాంటి అవమానాలు జరగలేదని పేర్కొన్నారు. ఇక్కడ ఉన్న సభ్యులు అందరికీ సమాన హక్కులు ఉంటాయని అప్పటి స్పీకర్ మనోహర్ తమకు సమయం ఇచ్చేదని గుర్తుచేశారు. కానీ నిన్న అసెంబ్లీలో స్పీకర్ తీరు బాధాకరమని అన్నారు.ఉమ్మడి రాష్ట్రంలో కూడా ఇలా నిర్బంధం చేయలేదని.. మా గొంతు నొక్కలేదని గంగుల కమలాకర్ అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో కాలిపోయిన మోటార్లు, ఎండిపోయిన పంటలను అసెంబ్లీకి తీసుకొనిపోయామని గుర్తుచేశారు. పక్షపాత వైఖరితో ఉండకండి అని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు హితవు పలికారు. మీ వ్యవహార శైలిని మార్చుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రికి ఎలాంటి హక్కు ఉంటుందో అందే అందరు సభ్యులకు ఉంటుందని తెలిపారు. మా హక్కుల కోసమే మాట్లాడామని చెప్పారు.నిన్న అసెంబ్లీలో గిల్లికజ్జాలు పెట్టుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి చూశాడని గంగుల కమలాకర్ అన్నారు. మమ్మల్ని తిట్టేందుకే సభకు వచ్చాడని, కడుపునిండా తిట్టి వెళ్లాడని విమర్శిం చారు. ప్రశ్నోత్తరాల సమయంలో ముఖ్యమంత్రి రెండు గంటలు మాట్లాడతాడా అని ప్రశ్నించారు. అసెంబ్లీలో ఎజెండా కూడా పొద్దున రెండుగంటలకు ఇస్తారా అని మండి పడ్డారు. ఉపాధి హామీ పథకంపై మాట్లాడటానికి నేను, జగదీశ్ రెడ్డి సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు.ముఖ్యమంత్రిని విమర్శిస్తే మైక్ ఇవ్వమని చెప్పడమేంటని స్పీకర్‌పై గంగుల కమలాకర్ మండిపడ్డారు. ముఖ్యమంత్రికి మేం భజన చేయాలా అని ప్రశ్నించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అసెంబ్లీ హుందాగా నడిచిందని తెలిపారు. గత స్పీకర్ ప్రతిపక్షాలకు తగినంత సమయం ఇచ్చేవారని గుర్తుచేశారు. ప్రస్తుత స్పీకర్ బీఆర్ఎస్ సభ్యుల గొంత నొక్కేందుకు పనిచేస్తున్నారని విమర్శించారు. అసెంబ్లీని గాంధీ భవన్‌లా, రేవంత్ ప్యా లెస్‌లా నడిపిస్తున్నారని మండిపడ్డారు. రేవంత్ రెడ్డికి భజన చేసేందుకు అసెంబ్లీకి వెళ్లాలా అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## ఫ్యూచర్ సిటీ తర్వాత... ముందు మాకు రోడ్డు వేయండి

**ఏండ్లు గడుస్తున్న రోడ్డు పనులు పూర్తి చేయలేదంటూ కుటుంబాలతో కలిసి ర్యాలీ చేపట్టిన అపర్ణ వాసులు**

**కోట్లలో పన్నులు కడుతున్నాం... కనీస వసతులు కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు**

**రంగరెడ్డి :** శేరిలింగంపల్లి నియోజకవర్గం చందానగర్ పోలి?స్ స్టేషన్ పరిధిలో అపర్ణ హిల్ పార్క్, అపర్ణ సిలికాన్, అపర్ణ గార్డెనియాల నివాసితులు శనివారం రోడ్డెక్కారు. తమ ఇండ్లకు వెళ్ళేందుకు సరైన రోడ్డు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని, అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదంటూ అవేదన వ్యక్తం చేస్తున్నారు. కుటుంబాలతో కలిసి ర్యాలీగా రోడ్డుపైకి వస్తేన్నన మా బాధలు అర్థం చేసుకుంటారని వేలాది మందితో అపర్ణ హిల్ పార్క్ నుంచి చందానగర్ జీహెచ్ఎంసి కార్యాలయం వరకు ర్యాలీని నిర్వహించామన్నారు. మియాపూర్ సర్కిల్ ముట్టడించారు. 2023లో ఎమ్మెల్యే గాంధీ మా సమస్యను అసెంబ్లీలో చర్చించడంతో సమస్య తీరుతుంది అనుకున్నాం. కానీ ఆయన మరోసారి ఎమ్మెల్యేగా గెలిచాడే తప్ప మా రోడ్డు పురోగతి సాధించలేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో రోడ్డు నిర్మాణ పనులకు నిధులు మంజూరు చేసిన, నేటి వరకు పనులు పూర్తి చేయలేదని, ఇప్పుడు మరోసారి శంకుస్థాపన చేసి రోడ్డు పై ఏర్పడిన గుంతలను మూస్తూ ప్యాచ్ వర్క్ చేస్తు న్నారంటూ మండి పడ్డారు. ప్రజా ప్రభుత్వంలో ప్రజలే ఇబ్బందులకు గురవుతున్నారని, అధికారులు, ప్రజాప్రతినిధులు మాత్రం మంచిగా ఉన్నారంటున్నారు. కోట్లలో పన్నులు చెల్లిస్తున్నాం.. సరైన వస్తతులు కల్పించే బాధ్యత ప్రభుత్వం పై లేదా అంటూ ప్రశ్నించారు. గతుకుల రోడ్డుపై ప్రయాణించాలంటే భయంగా ఉందని, గర్భిణీలు ఈ రోడ్డు పై ప్రయాణం చేయలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇకనైనా అధికారులు, ప్రజాప్రతినిధులు రోడ్డు పనులు పూర్తి చేసి మా ఇబ్బందులు తొలగించాలని కోరుతున్నట్లు తెలిపారు.

## ఇదే కాంగ్రెస్‌కు, బీఆర్ఎస్‌కు ఉన్న తేడా.. ఉత్తమ్‌పై హరీశ్‌రావు ధ్వజం

**హైదరాబాద్ :** మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు నిప్పులు చెరిగారు. అసెంబ్లీలో ఆడియో, వీడియో ప్రజెంటేషన్ నిర్వహిస్తే సభకు హాజరుకాబోమని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రాసిన లేఖ గుర్తుందా అని ప్రశ్నించారు. టీపీసీసీ అధ్యక్షుడిగా 30-03-2016 న మీరు స్పీకర్‌కు రాసి సంతకం పెట్టిన ఉత్తరం గుర్తుందా? అని నిలదీశారు. "అసెంబ్లీలో ఆడియో?విజువల్ ప్రెజెంటేషన్ నిర్వహిస్తే, అది భారత దేశ పార్లమెంట్ సంప్రదాయాలకు విరుద్ధం. అందుకే మేము సభకు హాజరుకాబోము." అని నాడు టీపీసీసీ అధ్యక్షుడిగా లేఖ రాసి.. నేడు మంత్రి హోదాలో అసెంబ్లీ హాలులో ప్రజెంటేషన్‌కు సిద్ధపడటం.. మీ రాజకీయ ద్వంద్వ వైఖరికి నిదర్శనమని విమర్శించారు.ఆ ఉత్తరంపై నేటి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పద్మావతి సంతకాలు చేశారని హరీశ్‌రావు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అనైతికత, ద్వంద్వ ప్రమాణాలను ఈ ఒక్క ఉత్తరం బట్టబయలు చేస్తుందని విమర్శించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు విలువలు, రాజ్యాంగం, పార్లమెంట్ స్ఫూర్తి వంటి మాటలు వల్లెవేస్తారని.. అధికారంలోకి రాగానే అదే విలువలకు తిలోదకాలు ఇస్తారని మండిపడ్డారు. ఇదే కాంగ్రెస్ పార్టీ అసలు నైజమని వ్యాఖ్యానించారు.అధికార పక్షానికి ప్రజెంటేషన్‌కు అనుమతినిస్తే.. బీఆర్ఎస్‌కూ అదేవిధంగా అనుమతి ఇవ్వాలని బీఏసీ సమావేశంలో, ఉత్తరం ద్వారా స్పీకర్‌ను కోరామని హరీశ్‌రావు తెలిపారు. అయినప్పటికీ ఆ అభ్యర్థనను స్పీకర్ తిరస్కరించారని పేర్కొన్నారు. ఇదే కాంగ్రెస్ పార్టీకి, బీఆర్ఎస్ పార్టీకి మధ్య ఉన్న అసలు తేడా అని స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక.. కాంగ్రెస్ అన్ని సంప్రదాయాలు, పద్ధతులు, మర్యాదలకు భంగం కలిగిస్తూ.. రాజ్యాంగానికే తూట్లు పొడవడాన్ని తన మార్పుగా చూపిస్తోందని ఎద్దేవా చేశారు. ఆ మార్పు అసలు అర్థం ఏమిటో ప్రజలు ఇప్పుడు స్పష్టంగా అర్థం చేసుకుంటున్నారని వ్యాఖ్యానించారు.

## జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్ అమలు

**ముందస్తు అనుమతి లేని ర్యాలీలు, సభలకు పూర్తి నిషేధం**

**వనపర్తి :** జిల్లాలో శాంతి భద్రతలను మరింత బలోపేతం చేయడం, ప్రజా వాతావరణం ప్రశాంతంగా కొనసాగడం, అనవసర గుమికూడింపులు నివారించడం లక్ష్యంగా జనవరి 01 నుంచి ఫిబ్రవరి 28 వరకు 30 పోలీస్ యాక్ట్?1861 నిబంధనలు అమల్లో ఉం టాయని జిల్లా ఎస్పీ సునిత రెడ్డి, .ఒక ప్రకటనలో తెలిపారు.ఎస్పీ మాట్లాడుతూ.. వనపర్తి జిల్లా పరిధిలో ఎవరైనా పోలీసు ఉన్నతాధికారుల ముందస్తు అనుమతి లేకుండా ధర్నాలు, ర్యాలీలు, బహిరంగ సభలు, భారీ స్థాయి సమావేశాలు నిర్వహించడం కఠినంగా నిషేధం. ప్రజా జీవనాన్ని అంతరాయం కలిగించే, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ఏ చర్యకైనా చోటిలేదు" అని స్పష్టం చేశారు. అలాగే "30 పోలీస్ యాక్ట్" ఉల్లంఘనలకు చట్టంలో స్పష్టమైన శిక్షలు ఉన్నాయి. అనుమతి లేకుండా కార్యక్రమాలు చేపట్టిన వారిపై ఎటువంటి మినహాయింపు లేకుండా చర్యలు తీసుకుంటాం. నిబంధనలు ప్రజల భద్రత కోసం పెట్టబడ్డాయి? అందరూ తప్పనిసరిగా పాటించాలని హెచ్చరించారు. ఎస్పీ ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ ఏ కార్యక్రమం కావాలన్నా ముందుగానే దరఖాస్తు చేసి అనుమతి పొందండి. ప్రజల సహకారం వల్లనే శాంతిభద్రతలు నిలుస్తాయి.

## సి.పి. ఐ సీనియర్ నాయకులు "బోలెమోని"కిమాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి నివాళి.

**వనపర్తి :** కమ్యూనిస్టు ఉద్యమ నేత ప్రస్తుత సి.పి. ఐ నాయకులు బోలెమోని.నాగన్న అనారోగ్యంతో మరణించిన విషయం తెలుసుకున్న మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి వారి ఇంటికి వెళ్లి పార్థీవ దేహానికి పూలమాలలు సమర్పించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ నాగన్న కమ్యూనిస్టు నేతగా, నిస్వార్థ సేవకులుగా ప్రజలకు అందుబాటులో ఉన్నారని ఆదర్శవంతమైన జీవితాన్ని గడిపారని కొనియాడారు వారి ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటూ వారి కుమారుడు సీనియర్ జర్నలిస్ట్ రమేష్ మరియు కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.నిరంజన్ రెడ్డి వెంట బి.ఆర్.ఎస్ నాయకులు ఉన్నారు.

## బిజినెస్

### ఫిబ్రవరి 1 నుంచి కొత్త ఫాస్టాగ్ నిబంధనలు




నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఎన్‌హెచ్‌ఏఐ) కీలక నిర్ణయం తీసుకుంది. ఈ ఏడాది ఫిబ్రవరి 1 నుంచి కార్లు, జీపులు, వ్యాన్లు సహా అన్ని వాహనాలకు నో యువర్ వెహికల్ (కేవైవీ) ప్రక్రియను నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. ఫాస్టాగ్ కస్టమర్ల సౌకర్యాన్ని మెరుగు పరచడం, హైవేలో వారు ఎదుర్కొంటున్న యాక్టివేషన్ ఇబ్బందులను తొలగించే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకుంది. ఈ నిబంధన ఫిబ్రవరి 1 నుంచి అమల్లోకి వస్తుందని వెల్లడించింది. అన్ని పత్రాలు ఉన్నప్పటికీ కేవైవీ ప్రక్రియ వల్ల ఫాస్టాగ్ యాక్టివేషన్ కోసం ఎక్కువ సమయం వృధా అవుతోందని, అందుకే ఈ నిబంధనను తెచ్చినట్టు ఎన్‌హెచ్‌ఏఐ స్పష్టం చేసింది. ఇప్పటికే జారీ చేసిన ఫాస్టాగ్‌లకు సైతం కేవైవీ అవసరంలేదని పేర్కొంది. కొత్త నిబంధనల ప్రకారం, ఫాస్టాగ్ కనిపించే విధంగా లేకపోవడం, పొరపాట్లు ఉండటం, దుర్వినియోగం కావడం వంటి సందర్భాల్లో మాత్రమే కేవైవీ తప్పనిసరి. సాధారణ కస్టమర్లకు ఇక దీని అవసరం ఉండదు. అలగే, వాహన్ డేటాబేస్ నుంచి వాహన వివరాలను ధృవీకరించి ఫాస్టాగ్ ఇచ్చే సమయంలో బ్యాంకులు యాక్టివేషన్ ప్రక్రియ పూర్తి చేస్తాయి. ఒకవేళ డేటాబేస్‌లో వివరాలు లభించకపోతే, ఆర్‌సీని ఆధారంగా వెరిఫికేషన్ చేస్తాయి. ఆన్‌లైన్ ద్వారా కొనుగోలు చేసిన ఫాస్టాగ్‌లకూ ఇదే విధానం వర్తిస్తుంది. ఇప్పటివరకు వాహనానికి సంబంధించి ముందు, సైడ్‌వ్యూ ఫోటోలతో పాటు ఆర్‌సీ, విండ్‌షీల్డ్‌పై ఫాస్టాగ్ స్టిక్కర్ ఫోటోలో అప్‌లోడ్ చేయాల్సి వచ్చేది. ఇప్పుడు ఈ ఇబ్బందులు తొలగనున్నాయి.

### పాలసీల పునరుద్ధరణకు ఎల్ఐసీ ఆఫర్

भारतीय जीवन बीमा निगम
LIFE INSURANCE CORPORATION OF INDIA

ప్రభుత్వ రంగ జీవిత బీమా దిగ్గజం, లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసీ) తమ పాలసీదారులకు శుక్రవారం ఓ స్పెషల్ ఆఫర్ ఇచ్చింది. ఆగిపోయిన వ్యక్తిగత పాలసీల పునరుద్ధరణకు అవకాశం కల్పించింది. 2 నెలలపాటు ఈ ప్రత్యేక కార్యక్రమం కొనసాగనున్నది. మార్చి 2దాకా అన్ని నాన్-లింక్డ్ లాప్స్‌డ్ పాలసీలకు ఆలస్య రుసుములో ఆకర్షణీయ రాయితీతో ఈ సదుపాయం అందుబాటులో ఉంటుంది. సదరు బీమా ప్లాన్లకు అర్హత ఉంటే లేట్ ఫీజులో గరిష్ఠంగా రూ.5వేలు లేదా 30 శాతం వరకు తగ్గింపును పొందవచ్చని ఓ ప్రకటనలో ఎల్ఐసీ తెలిపింది. కాగా, మైక్రో ఇన్సూరెన్స్ పాలసీల కోసం ఆలస్య రుసుమును సంస్థ పూర్తిగా ఎత్తేసింది. అయితే మెడికల్/ఆరోగ్య అవసరాలపై మాత్రం ఎలాంటి రాయితీలు ఉండవని ఎల్ఐసీ స్పష్టం చేసింది. పాలసీదారుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని తెచ్చిన ఈ సదవకాశాన్ని అర్హులందరూ వినియోగించుకోవాలన్నది. ప్రతికూల పరిస్థితుల కారణంగా ప్రీమియంలు సకాలంలో చెల్లించలేక ఆగిపోయిన పాలసీలకు చక్కని అవకాశంగా ఎల్ఐసీ ఈ సందర్భంగా పేర్కొన్నది.

# 2026లో బంగారం ధరలపై ఆర్థిక నిపుణుల అప్‌డేట్..



ఈ ఏడాది తొలి రోజునే అంతర్జాతీయ మార్కెట్లలో బంగారం ధరలు భారీగా పెరిగాయి. డిసెంబర్ 26న స్పాట్ గోల్డ్ ఔన్సుకు ఆల్‌టైమ్ రికార్డు స్థాయి 4,549.71 డాలర్లకి చేరిన తర్వాత.. కొద్దిరోజుల లాభాల స్వీకరణ కారణంగా ధరలు తగ్గాయి. అయితే 2026 ప్రారంభంతో మళ్లీ బులియన్‌లో కొనుగోళ్ల జోరు పెరిగింది. గురువారం నాటికి స్పాట్ గోల్డ్ ధర దాదాపు 2 శాతం పెరిగి ఔన్సుకు 4,397.66 డాలర్ల వద్ద ట్రేడైంది. అంతకుముందు బుధవారం ఇది రెండు వారాల కనిష్ట స్థాయికి పడిపోయింది. ఇక ఫిబ్రవరి డెలివరీకి సంబంధించిన అమెరికా గోల్డ్ ఫ్యూచర్స్ కూడా 1.6 శాతం పెరిగి ఔన్సుకు 4,409.90 డాలర్లకి చేరాయి. ఇది పెట్టుబడిదారుల్లో ఉనీశ్రీట పట్ల ఉన్న విశ్వాసాన్ని స్పష్టంగా చూపిస్తోంది. ఈచీంఓ సీనియర్ రీసెర్చ్ అనలిస్ట్ లుక్మాన్ ఒటునుగా అభిప్రాయం ప్రకారం.. విలువైన లోహాలు 2026ను సానుకూలంగా ప్రారంభించాయి. 2025 చివర్లో జరిగిన లాభాల స్వీకరణ తర్వాత.. ఇప్పుడు భౌగోళిక రాజకీయ ప్రమాదాలు, ఈ ఏడాది అమెరికాలో వడ్డీ రేట్లు తగ్గవచ్చన్న అంచనాలు బంగారానికి మద్దతుగా మారాయని తెలిపారు. ఇక భౌతిక బంగారం డిమాండ్ విషయానికి వస్తే.. దాదాపు రెండు నెలల తర్వాత తొలిసారిగా భారత్, పొరుగుదేశం చైనాలో బంగారం ప్రీమియంతో ట్రేడవుతోంది. ఆల్‌టైమ్ గరిష్ట స్థాయిల నుంచి ధరలు కొంత దిద్దుబాటుకు గురవడంతో.. రిటైల్ కొనుగోలుదారులు మళ్లీ మార్కెట్‌లోకి వచ్చారు. పెళ్లిళ్ల సీజన్, పండుగల డిమాండ్ కూడా భారత్‌లో బంగారం కొనుగోళ్లకు అవకాశం కల్పిస్తోంది. 2025 సంవత్సరం బంగారం ధరలు పెరిగి పెట్టుబడిదారులకు లాభాల పంటను పండించాయి. ఆ ఏడాదిలో బులియన్ ధరలు ఏకంగా 64 శాతం పెరిగాయి. ఇది 1979 తర్వాత అతిపెద్ద వార్షిక లాభంగా మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేటు కోతలు, ప్రపంచవ్యాప్తంగా కొనసాగుతున్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, కేంద్ర బ్యాంకుల భారీ కొనుగోళ్లు, అలాగే గోల్డ్ ఇంఈలలో పెరిగిన పెట్టుబడులు ఇందుకు ప్రధాన కారణాలుగా చెప్పవచ్చు. ఃఇ విశ్లేషకుడు జియోవన్నీ స్టానోవో అభిప్రాయం ప్రకారం.. 2026లో బంగారం ధరలు మరింత పైకి ఎగబాకే అవకాశం ఉంది. ఔన్సుకు 5,000 డాలర్ల స్థాయిని లక్ష్యంగా పెట్టుకున్నాం. తక్కువ వాస్తవ వడ్డీ రేట్లు, ప్రపంచ ఆర్థిక ఆందోళనలు, అలాగే అమెరికా దేశీయ విధానాలపై ఉన్న అనిశ్చితి బంగారానికి అనుకూలంగా మారుతున్నాయని పేర్కొన్నారు. కేంద్ర బ్యాంకులు, పెద్ద పెట్టుబడిదారులు కౌంటర్‌పార్టీ రిస్క్‌కి దూరంగా ఉండేందుకు బంగారం వంటి నిజమైన ఆస్తుల వైపు మొగ్గు చూపుతున్నారని తెలిపారు. ఈ ఏడాది కనీసం రెండు సార్లు ఫెడ్ క్వార్టర్ పాయింట్ రేటు కోతలు చేయవచ్చని మార్కెట్ అంచనా వేస్తోంది. తక్కువ వడ్డీ రేట్ల వాతావరణంలో దిగుబడి లేని ఆస్తులు అయిన బంగారం లాంటి లోహాలు మెరుగైన ప్రదర్శన చూపుతాయని భావిస్తున్నారు. బంగారంతో పాటు ఇతర విలువైన లోహాలు కూడా బలంగా కదిలాయి. సోమవారం ఆల్‌టైమ్ హై 83.62 డాలర్లని తాకిన తర్వాత స్పాట్ సిల్వర్ ఔన్సుకు 4.6 శాతం పెరిగి 74.52 డాలర్లకి చేరింది. ప్లాటినం కూడా ఇటీవల 2,478.50 డాలర్ల రికార్డు స్థాయికి చేరిన తర్వాత ఔన్సుకు 2,150.46 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. వెండి 2025లో 147 శాతం లాభాలను నమోదు చేయగా, పల్లాడియం గత ఏడాది 76 శాతం పెరిగి 15 ఏళ్లలో అత్యుత్తమ ప్రదర్శన చూపింది.

### ఆకాశమూ అదానీకే !



విదేశీ విమానయాన కంపెనీలకు భారత గగనతలాన్ని పూర్తిగా తెరిచిపెట్టాలని అదానీ గ్రూపు కేంద్రప్రభుత్వంపై ఒత్తిడి చేస్తోంది. ఇటీవల పలు దేశాలతో భారత్ కుదుర్చుకుంటున్న ద్వైపాక్షిక ఒప్పందాల్లో విదేశీ కంపెనీలకు అనుమతులివ్వాలని కోరినట్లు ఆంగ్లడియాలో విస్తృతంగా కథనాలు వస్తున్నాయి. ఈ ప్రతిపాదనపై భారత్‌కు చెందిన రెండు అతిపెద్ద ఎయిర్‌లైన్స్ సంస్థలైన ఎయిర్ ఇండియా, ఇండిగో తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.తమ సిఫార్సులకు విరుద్ధంగా అదానీ ప్రతిపాదనలు ఉన్నాయని తెలిపాయి. విదేశీ ఎయిర్‌లైన్స్‌కు భారత గగనతలాన్ని పూర్తిగా అందుబాటులోకి తీసుకురావడం వల్ల పశ్చిమ ఆసియాలోని భారీ నగదు నిల్వలున్న విమానయాన సంస్థల నుంచి తాము తీవ్రమైన, అన్యాయమైన పోటీని ఎదుర్కోవాల్సి వస్తుందని ఎయిర్ ఇండియా ఆందోళన వ్యక్తం చేసింది.ముంబయి నగరాన్ని అంతర్జాతీయ విమానయాన కేంద్రంగా మార్చడానికి విదేశీ విమానాలకు విరివిగా అనుమతివ్వడం ద్వారా సామర్థ్యాన్ని పెంచుకోవచ్చని అదాని గ్రూప్ గత నెలలో ప్రభుత్వానికి తెలిపినట్లు ఎకనామిక్ మ్స్ నివేదిక పేర్కొంది. 2030 నాటికి టెర్మినల్స్, రన్‌వేలు, ఎయిర్‌క్రాఫ్ట్ హ్యాండ్లింగ్ సౌకర్యాలు, ప్రయాణికుల సౌకర్యాల కోసం 11.1 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.1 లక్ష కోట్లు) ఖర్చు చేయాలని అదాని గ్రూప్ యోచిస్తోందని అదానీ ఎయిర్‌పోర్ట్ హోల్డింగ్స్ డైరెక్టర్ జీత్ అదానీ ఇటీవల పేర్కొన్నారు. "ప్రయాణికులకు మరిన్ని ప్రత్యామ్నాయాలను అందుబాటులోకి తీసుకురావడం అనేది భారతీయ విమానాశ్రయాలను ప్రపంచస్థాయి హబ్‌లుగా మార్చడంలో కీలకమైన అంశం. ఇది భారతీయ విమానయాన సంస్థలు పోటీకి సిద్ధంగా ఉన్నాయా లేదా అనే దానిపై మాత్రమే ఆధారపడి ఆలోచించకూడదు. అంతర్జాతీయ విమాన కంపెనీల కు అనుమతివ్వకపోవడం వల్ల విమానాశ్రయాల ఆస్తులను వృథా చేయడమే అవుతుంది." అని అదాని కంపెనీ అధికారి పేర్కొన్నారు.

## స్పోర్ట్స్

# ప్రపంచకప్ స్క్వాడ్‌లో కుర్రాళ్లకే అందలం.. నమీబియా కెప్టెన్‌గా ఎరాస్మస్!




పొట్టి ప్రపంచకప్ వంటి ఐసీసీ టోర్నమెంట్ కోసం అనుభవజ్ఞులకు పెద్దపీట వేయడం చూశాం. కానీ, నమీబియా మాత్రం కుర్రాళ్లకే జై కొట్టింది. కేవలం 10 అంతర్జాతీయ మ్యాచ్‌ల అనుభవమే ఉన్న యువకులను వరల్డ్ కప్ స్క్వాడ్‌లోకి తీసుకుంది. గెర్హార్డ్ ఎరాస్మస్ కెప్టెన్‌గా శనివారం 15 మంది సభ్యులను మెగా టోర్నీకి సెలెక్టర్లు ఎంపిక చేశారు. వీరిలో సీనియర్లు 10 మందికాగా.. ఐదుగురు క్రికెటర్లు పట్టుమని పది మ్యాచ్‌లే ఆడడం విశేషం. ధనాధన్ ఆటతో వెలుగులోకి వచ్చిన నమీబియా యువ క్రికెటర్లు ఏకంగా వరల్డ్ కప్ బెర్తు పట్టేశారు. టీ20ల్లో విధ్వంసక ఆటగాడిగా పేరొందిన లౌరెన్ స్టీన్‌కాంప్ ఏడు మ్యాచుల్లో 126.85 స్ట్రయిక్ రేటు నమోదు చేశాడు. మిడిలార్డర్ బ్యాటర్లు జాన్ బాల్ట్, డైలాన్ లీచెర్, విలియం సైతం దమ్మున్న కుర్రాళ్లే. ఇక పేస్ దళంలో 20 ఏళ్ల జాక్ బ్రస్సెల్ కీలకం కానున్నాడు. ఈ యువకెరటం ఇప్పటివరకూ 23 వన్డేలు, 40 టీ20లు ఆడాడు. జాన్ ఫ్రైలింక్, రుబెన్‌లు సైతం అనుభవంగల బౌలర్లే. నిరుడు అక్టోబర్‌లో దక్షిణాఫ్రికాపై సంచలన విజయంలో భాగమైన మ్యాక్స్ హిన్గోకు సైతం ప్రపంచకప్ స్క్వాడ్‌లో చోటు లభించింది. గ్రూప్ ఏలో ఉన్న నమీబియా ఫిబ్రవరి 10న తమ తొలి పోరులో నెదర్లాండ్స్‌తో తలపడనుంది. అనంతరం భారత్, నెదర్లాండ్స్, పాకిస్థాన్, యూఎస్ఏలతో లీగ్ దశ మ్యాచ్‌లు ఆడనుంది. నమీబియా టీ20 ప్రపంచకప్ స్క్వాడ్ : లౌరెన్ స్టీన్‌కాంప్, గెర్హార్డ్ ఎరాస్మస్(కెప్టెన్), విలియం మైబర్గ్, రూబెన్ ట్రంప్లెమన్, జన్ ఫ్రైలింక్, జనే గ్రీన్, బెర్నార్డ్ స్కోల్జ్, జన్ నికొల్ లొఫ్టీ ఈటన్, జేజే స్మిత్, బెన్ షికాంగో, జన్ బాల్ట్, మ్యాక్స్ హీన్గో, మలాన్ క్రుగెర్, డైలాన్ లీచెర్, జక్ బ్రస్సెల్. ఫిబ్రవరి 7వ తేదీన భారత్, శ్రీలంక వేదికగా టీ20 ప్రపంచకప్ షురూ కానుంది. ఈ మెగా టోర్నమెంట్‌కు ఆతిథ్యమిస్తున్న భారత్ అన్ని బోర్డుల కంటే ముందే స్క్వాడ్‌ను వెల్లడించింది. ఆ తర్వాత ఇంగ్లండ్, ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, అఫ్గనిస్థాన్ క్రికెట్ బోర్డులు తమ బృందాలను వెల్లడించాయి. త్వరలోనే మిగతా బోర్డులు స్క్వాడ్‌లను ప్రకటించనున్నాయి.

### ఒకే ఓవర్లో 6, 6, 6, 6, 6, 4.. తొలి శతకంతో రెచ్చిపోయిన పాండ్యా!



భారత ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా మరోసారి రెచ్చిపోయాడు. ఈమధ్యే దక్షిణాఫ్రికాపై మెరుపు ఇన్నింగ్స్‌లు ఆడిన పాండ్యా.. విజయ్ హజారే ట్రోఫీలోనూ పూనకం వచ్చినట్టు చెలరేగాడు. లిస్ట్ ఏ క్రికెట్‌లో విధ్వంసక ఆటతో మొట్టమొదటి సెంచరీ బాదేశాడీ హిట్టర్. బరోడా తరఫున బరిలోకి దిగిన ఈ చిచ్చరపిడుగు విదర్భ బౌలర్లకూ చుక్కలు చూపిస్తూ 68 బంతుల్లోనే శతక గర్జన చేశాడు. హిట్టర్లందు హార్దిక్ పాండ్యా వేరయా అనే మాట మనకు తెలిసిందే. ముఖ్యంగా టీ20లు అంటే చాలు తనలోని విధ్వంసక ఆటగాడిని బయటకు తీసుకొస్తాడీ క్రికెటర్. ఆసియా కప్ తర్వాత సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీతో పునరాగమనం చేసిన అతడు వస్తూ వస్తూనే అర్ధ శతకంతో రెచ్చిపోయాడు. అనంతరం సఫారీలకు తన బ్యాట్ పవర్ చూపించిన పాండ్యా.. ఇప్పుడు విజయ్ హజారే ట్రోఫీలోనూ ఊచకోత కోశాడు. విదర్భ బౌలర్లను హడలెత్తించిన బరోడా స్టార్.. స్పిన్నర్ రెఖాడే వేసిన 39వ ఓవర్లో మరింత రెచ్చిపోయాడు. వరుసగా 6, 6, 6, 6, 6, 4 బాది 34 రన్స్ పిండుకున్నాడు. బంతి గమ్యం బౌండరీయే అన్నట్టుగా విధ్వంసం సృష్టించిన పాండ్యా 68 బంతుల్లోనే సెంచరీ సాధించాడు. లిస్ట్ ఏ క్రికెట్‌లో అతడికిది తొలి శతకం కావడం విశేషం.

### న్యూజిలాండ్ సిరీస్‌లోనూ షమీకి నిరాశే.. ఇక కెరీర్ ముగిసినట్టే..?




ఒకప్పుడు భారత జట్టు ప్రధాన పేస్ అస్త్రమైన పేసర్ మహమ్మద్ షమీకి మరోసారి చుక్కెదురైంది. దేశవాళీ క్రికెట్‌లో వికెట్లు తీస్తూ నిలకడగా రాణిస్తున్నా సరే అతడిని సెలెక్టర్లు పట్టించుకోవడం లేదు. న్యూజిలాండ్‌తో మూడు వన్డేల సిరీస్‌కు శనివారం ఎంపిక చేసిన స్క్వాడ్‌లో ఈ స్పీడ్‌స్టర్ పేరు లేదు. జస్ప్రీత్ బుమ్రా గైర్హాజరీలో షమీకి చోటు దక్కుతుందని అందరూ అనుకున్నారు. కానీ, సెలెక్టర్లు మాత్రం మరోసారి ఈ దిగ్గజ బౌలర్‌కు అన్యాయం చేశారు. దాంతో.. ఇక అతడి కెరీర్ ముగిసిందనే వార్తలు వినిపిస్తున్నాయి. ఒకప్పుడు ప్రధాన పేసర్‌గా టీమిండియా విజయాల్లో కీలకమైన షమీ ఇప్పుడు ఒక్క ఛాన్స్ కోసం చకోర పక్షిలా నిరీక్షిస్తున్నాడు. మూడేళ్ల క్రితం వన్డే ప్రపంచకప్‌లో అత్యధిక వికెట్లతో 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డు అందుకున్న ఈ వెటరన్ బౌలర్.. జట్టుకు దూరమై రెండేళ్లు అవుతోంది. మోకాలి సర్జరీ నుంచి కోలుకొని ఫిట్‌నెస్ సాధించిన షమీకి సెలెక్టర్లు చుక్కలు చూపిస్తున్నారు. ఇటీవల సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ విజయ్ హజారే ట్రోఫీలో ఐదు మ్యాచుల్లో 12 వికెట్లతో చెలరేగాడీ స్పీడ్‌స్టర్. దాంతో.. ఐసీసీ టోర్నీల్లో నిప్పులు చెరిగే షమీని వన్డే ప్రపంచకప్ కోసమైనా న్యూజిలాండ్ సిరీస్‌కు ఎంపిక చేస్తాడని ఊహించారంతా. కానీ, బుమ్రా బదులు సిరాజ్‌కు ఓటేసిన సెలెక్టర్లు హర్షిత్ రానా, అర్ష్‌దీప్ సింగ్‌లను తీసుకున్నారు. అంతే.. ఈసారైనా టీమిండియాకు ఆడే అవకాశం వస్తుందని భావించిన షమీ కలలు కల్లలయ్యాయి.

#### ఫిట్‌గా లేడని..

స్వదేశంలో వన్డే ప్రపంచకప్ ముగిశాక.. మోకాలి గాయం నుంచి కోలుకున్న షమీ.. నిరుడు ఆస్ట్రేలియా పర్యటనతో పునరాగమనం చేయాలని అనుకున్నాడు. కానీ, అతడికి చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ భారీ షాకిచ్చాడు. ఫిట్‌నెస్ లేనందునే తనను ఎంపిక చేయలేదని అగార్కర్ చెప్పడంపై షమీ మండిపడ్డాడు. రంజీ ట్రోఫీలో బెంగాల్ తరఫున తొలి మ్యాచ్‌లోనే నాలుగు వికెట్లతో చెలరేగాడు. 'నేను ఫిట్‌గాలేనని, ఫామ్‌లో లేనని చీఫ్ సెలెక్టర్ అంటున్నాడు. ఒకవేళ ఫిట్ నిరూపించుకొని ఉంటే ఆసీస్ పర్యటనకు తీసుకునేవాళ్లమని కూడా ఆయన అన్నాడు.

ధర్మఘంట

# వెంకీ అట్లూరి, సూర్య సినిమాలో మరో స్టార్ హీరో క్రేజీ టాక్‌లో నిజమెంత?



కోలీవుడ్ యాక్టర్ సూర్య బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో బిజీగా ఉన్నాడని తెలిసిందే. ఈ ప్రాజెక్టుల్లో ఒకటి వెంకీ అట్లూరి డైరెక్ట్ చేస్తున్న సూర్య 46 ఈ మూవీలో ప్రేమలు ఫేం మమితా బైజు హీరోయిన్‌గా నటిస్తుండగా.. సీనియర్ నటి రవీనా టాండన్ కీలక పాత్ర పోషిస్తోంది. జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నాడు. ఈ సినిమాకు సంబంధించిన ఆసక్తికర వార్త ఒకటి బయటకు వచ్చింది. ఈ చిత్రంలో స్టార్ యాక్టర్ ఒకరు కామియో రోల్‌లో కనిపించబోతున్నాడన్న వార్త ఇండస్ట్రీ సర్కిల్‌లో హల్ చల్ చేస్తోంది. ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రాబోతున్న ఈ చిత్రంలో మాలీవుడ్ స్టార్ హీరో దుల్కర్ సల్మాన్ కీలక పాత్రలో నటించనున్నాడని ఇన్‌సైడ్ టాక్. ప్రస్తుతానికి దీనికి సంబంధించి అధికారిక ప్రకటన ఏం రాకున్నా.. ఈ న్యూస్‌ను మాత్రం ఫుల్ ఎంజాయ్ చేస్తున్నారు అభిమానులు. తాజా టాక్ ప్రకారం 45 ఏండ్ల వ్యక్తికి 20 ఏండ్ల యువతికి మధ్య రిలేషన్ షిప్ నేపథ్యంలో సినిమా ఉండబోతుందట. ఏజ్ గ్యాప్ ఎక్కువగా ఉన్న వీరిద్దరి మధ్య ప్రేమ చిగురిస్తుందా..? ఇద్దరి మధ్య ట్రాక్ ఎలా ఉండబోతుందన్నది ఆసక్తికరంగా మారింది. సూర్య 46 చిత్రాన్ని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై నాగవంశి, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ సినిమాతో సూర్య టాలీవుడ్ ఎంట్రీ ఇస్తుండటంతో అంచనాలు భారీగానే ఉన్నాయి.సూర్య మరోవైపు సుధాకొంగర డైరెక్షన్‌ల సూర్య 47లో నటిస్తున్నాడని తెలిసిందే.

# కామెడీ హీరో నుంచి కంటెంట్ స్టార్‌గా శ్రీవిష్ణు..



టాలీవుడ్‌లో సహజ నటన, టైమింగ్‌తో నవ్వులు పంచే హీరోలలో శ్రీవిష్ణు ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు. చిన్న చిన్న పాత్రలతో కెరీర్‌ను ప్రారంభించిన ఆయన, క్రమంగా తన టాలెంట్‌ను నిరూపించుకుంటూ హీరోగా నిలదొక్కుకున్నారు. ఓవర్ యాక్షన్‌కు దూరంగా, సహజమైన కామెడీతో ప్రేక్షకులను ఆకట్టుకోవడమే శ్రీవిష్ణు స్టైల్. అందుకే ఇప్పుడు "శ్రీవిష్ణు సినిమా అంటే కచ్చితంగా నవ్వులు ఉంటాయి" అనే నమ్మకం ఆడియన్స్‌లో బలంగా ఏర్పడింది. ఇటీవల ఆయన ఖాతాలో పడిన వరుస హిట్లు ఈ బ్రాండ్‌ను మరింత బలపరిచాయి. సామజవరగమన, ఓం భీమ్ బుష్, స్వాగ్, సింగిల్ వంటి సినిమాలు శ్రీవిష్ణును కంటెంట్ బేస్డ్ కామెడీ హీరోగా నిలబెట్టాయి. ముఖ్యంగా 'సింగిల్' విజయం తర్వాత యూత్ ఆడియన్స్‌లో ఆయన క్రేజ్ గణనీయంగా పెరిగింది. ఈ సినిమాతో శ్రీవిష్ణు కెరీర్ కొత్త గేర్‌లోకి వెళ్లిందనే చెప్పాలి. ఈ విజయోత్సాహంతో శ్రీవిష్ణు కొత్త ఏడాదిని కూడా బాక్సాఫీస్ సందడితో ప్రారంభించేందుకు రెడీ అవుతున్నారు. ప్రస్తుతం ఆయన నటిస్తున్న మృత్యుంజయ్, కామ్రేడ్ కళ్యాణ్ చిత్రాలు షూటింగ్ చివరి దశలో ఉన్నాయి. ఈ రెండు సినిమాల్లోనూ శ్రీవిష్ణు పాత్రలు గతానికి భిన్నంగా ఉంటాయనే టాక్ వినిపిస్తోంది. పాత్రల ఎంపికలో ఎప్పటికప్పుడు కొత్తదనం చూపిస్తున్న శ్రీవిష్ణు, ఈ సినిమాలతో మరోసారి తన వర్సటిలిటీని చూపించనున్నారని సినీ వర్గాలు అంటున్నాయి. ఇక శ్రీవిష్ణు కెరీర్‌లో కీలక మైలురాయిగా నిలిచిన 'సామజవరగమన' దర్శకుడు రామ్ అబ్బరాజుతో మరోసారి జతకట్టేందుకు ఆయన సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఈ ప్రాజెక్ట్ మార్చి నెలలో సెట్స్‌పైకి వెళ్లే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది. వీరి కాంబినేషన్‌పై ఇప్పటికే మంచి అంచనాలు ఉండటంతో, రెండో సినిమా కూడా అదే స్థాయిలో వినోదాన్ని అందిస్తుందని అభిమానులు ఆశిస్తున్నారు.




# 'మత్తు వదలరా' దర్శకుడి కొత్త సినిమా టీజర్ రిలీజ్

'మత్తు వదలరా' సినిమాలతో ఆకట్టుకున్న దర్శకుడు రితేశ్ రానా.. కమెడియన్ సత్యని హీరోగా పెట్టి ఓ మూవీ తీస్తున్నాడు. అదే 'జెట్లీ'. ఇప్పుడు న్యూఇయర్ శుభాకాంక్షలు చెబుతూ గ్లింప్స్ రిలీజ్ చేశారు. జనరల్ కంపార్ట్‌మెంట్ హీరో అని సత్య చివరలో చెప్పిన డైలాగ్ ఫన్నీగా ఉంది. సత్య, వెన్నెల కిశోర్, రియా సింఘా ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమాని పూర్తిగా ఫ్లైట్‌లోనే తీసినట్లు గ్లింప్స్ చూస్తే అనిపించింది. హైజాక్ లాంటిది జరిగితే విమానంలోని ఉన్న వాళ్లు ఎలా ప్రవర్తించారు, తద్వారా ఎలాంటి కామెడీ వచ్చిందనే పాయింట్‌తో మూవీ తీశారనిపిస్తుంది. వెన్నెల కిశోర్ పాత్ర.. నువ్వు హీరోవా? టైర్ 1? టైర్ 2? అని సత్య పాత్రని అడిగితే.. జనరల్ కంపార్ట్‌మెంట్ అని బాగుంది. బహుశా వేసవిలో దీన్ని థియేటర్లలోకి తీసుకొస్తారేమో?

# క్వీన్ ఆఫ్ 'మార్క్'గా దీప్శిఖ చంద్రన్.. ఫ్యాన్స్ ఫిదా



కన్నడ సూపర్‌స్టార్ కిచ్చా సుదీప్ హీరోగా నటించిన హై-వోల్టేజ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'మార్క్'.డిసెంబర్ 25న విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లు సాధిస్తూ బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలిచింది. ఈ సినిమాలో హీరోయిన్‌గా నటించిన దీప్శిఖ చంద్రన్ నటన, స్క్రీన్ ప్రెజెన్స్ కు ప్రేక్షకులు ఫిదా అయ్యారు. కన్నడ సినీ ఇండస్ట్రీలో గ్రాండ్ ఎంట్రీ ఇచ్చిన దీప్శిఖ చంద్రన్.. ఈ చిత్రంలో బలమైన పాత్రలో కనిపించి అద్భుతమైన ప్రశంసలు అందుకుంటోంది. ఆమె యాక్షన్ సీక్వెన్స్‌లు, ఎమోషనల్ సీన్స్ ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా ఆమె ధీరవనిత పాత్రకు మహిళా ప్రేక్షకులు ఫిదా అవుతున్నారు. థియేటర్లలో సినిమా చూసిన ప్రేక్షకులు దీప్శిఖను "మార్క్ క్వీన్", "క్వీన్ ఆఫ్ మార్క్" అని పిలుచుకుంటూ సోషల్ మీడియాలో ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. సాధారణంగా యాక్షన్ సినిమాల్లో హీరోయిన్ పాత్రలు పరిమితంగా ఉంటాయి కానీ, 'మార్క్'లో దీప్శిఖ పాత్ర బలంగా నిలిచి సినిమాకు మరింత బలం చేకూర్చింది. పాజిటివ్ మౌత్ టాక్, థియేటర్ స్పందనతో 'మార్క్' కన్నడ మార్కెట్‌లో దూసుకుపోతోంది. ఈ విజయం దీప్శిఖ చంద్రన్ కెరీర్‌లో మైలురాయిగా నిలుస్తుందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. కన్నడ ప్రేక్షకులకు కొత్త క్రష్‌గా మారిన దీప్శిఖకు గుర్తింపు, ఆదరణ పెరుగుతున్నాయి.

# మెగా హీరోలకి వరుస డిజాస్టర్స్.. ఆశలన్నీ మన శంకర వరప్రసాద్ గారుపైనే!



ప్రస్తుతం మెగా హీరోలకి బ్యాడ్ టైమ్ నడుస్తుంది. ఇటీవలి కాలంలో ఆ ఫ్యామిలీ నుండి వచ్చిన హీరోల సినిమాలు బాక్సాఫీస్ దగ్గర నిరాశపరిచాయి. కొద్ది రోజుల క్రితం విడుదలైన పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటించిన భారీ బడ్జెట్ చిత్రం 'హరిహర వీరమల్లు' ఆశించిన స్థాయిలో ఓపెనింగ్స్ రాబట్టలేకపోయింది. అంచనాలకు విరుద్ధంగా, తొలి రోజే ఈ చిత్రం టైర్-1 హీరోల రేంజ్ ఓపెనింగ్స్ కన్నా తక్కువ వసూళ్లు నమోదు చేసింది. రూ.250 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కిన 'హరిహర వీరమల్లు' మూవీ, తొలి రోజు ప్రపంచవ్యాప్తంగా రూ.64.74 కోట్ల గ్రాస్ వసూలు చేసింది. మొత్తంగా రూ.44.7 కోట్ల నెట్ వసూళ్లు సాధించినట్టు సమాచారం. హరిహర వీరమల్లు చిత్రానికి మొత్తంగా రూ.128 కోట్ల థియేట్రికల్ బిజినెస్ జరిగింది. అందులో 33 శాతం మొదటి రోజు రాబట్టగలిగాడు పవన్ కళ్యాణ్. అయితే సెకండాఫ్‌కి తీవ్రమైన నెగిటివ్ టాక్ రావడంతో రెండో రోజు అడ్వాన్స్ బుకింగ్స్‌పై ఆ ప్రభావం తీవ్రంగా పడింది అని చెప్పాలి. తొలిరోజుతో పోలిస్తే రెండో రోజు ఈ మూవీకి 30 శాతం కూడా టికెట్లు అమ్ముడు కాలేదు. మరోవైపు అదే సమయంలో రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎడతెడపి లేకుండా కురుస్తున్న వర్షాలు కూడా 'హరిహర వీరమల్లు' మూవీ వసూళ్లపై ప్రభావం చూపించాయని ట్రేడ్ పండితులు అంటున్నారు. 'హరిహర వీరమల్లు' మూవీ రూ.30 నుంచి రూ.50 కోట్ల వరకూ నష్టాలు చవిచూసిందని ట్రేడ్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇక ఇటీవల వచ్చిన ఓజీ చిత్రం సేఫ్ జోన్‌లో పడ్డా కూడా, అన్ని వర్గాల ప్రేక్షకులని అలరించలేకపోయిందని సమాచారం. ఫ్యాన్స్ మాత్రమే ఈ సినిమాని ఎంజాయ్ చేశారని అంటున్నారు. 'హరిహర వీరమల్లు'తో పాటు, ఇటీవల మెగా ఫ్యామిలీ నుండి వచ్చిన సినిమాలు వరుసగా డిజాస్టర్లు అయ్యాయి. పవన్ కళ్యాణ్ ఓజీ చిత్రం కాస్త ఉపశమనం కలిగించింది. చిరంజీవి 'వాల్తేరు వీరయ్య' విజయానంతరం'భోళా శంకర్' భారీ ఫెయిల్యూర్ (రూ.50 కోట్ల గ్రాస్ కూడా సాధించలేకపోయింది). ఇక రామ్ చరణ్ 'గేమ్ ఛేంజర్' రూ.350 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కగా, కనీసం రూ.100 కోట్ల షేర్ కూడా రాబట్టలేక ఎపిక్ డిజాస్టర్ అయింది. ఇక వరుణ్ తేజ్ వరుసగా గాండీవధారి అర్జున', 'ఆపరేషన్ వాలెంటైన్', 'మట్కా' చిత్రాలతో వరుస డిజాస్టర్స్ చవి చూశాడు. పంజా వైష్ణవ్ తేజ్ 'ఆదికేశవ'తో మరో డిజాస్టర్ తన ఖాతాలో వేసుకున్నాడు. ట్రేడ్ విశ్లేషకుల అంచనాల ప్రకారం, గత రెండు సంవత్సరాల్లో మెగా హీరోల సినిమాల వల్ల నిర్మాతలు రూ.300 కోట్లు నుంచి రూ.400 కోట్లు వరకు నష్టపోయినట్టు చెబుతున్నారు.

Printed, Published, Owned by & Editor: MEDE SHANTHI KUMAR, Printed at SPOORTHI PRINTERS, Published From SPOORTHI PUBLICATIONS,
# : 7-8-94/2, Sri Nagar Colony, Panagal Road, Nalgonda, Telangana - 508001, # : F-7, Cherukuri Mini Towers, Road No.4, Jadges colony, Vanasthalipuram, Hyderabad-500070.
epaper.dharmaganta.com, www.dharmaganta.com, dharmagantasp@gmail.com, +919440994108, +919885826108, +919440828108

ధర్మఘంట

# గ్వాలియర్ ఘటనపై దేశవ్యాప్తంగా ఆగ్రహం

# కోర్టు విచారణకు ముందే ఎస్సీ విభాగం కార్యాచరణ

**నిందితుడిపై ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఏఐసీసీ ఎస్సీ విభాగం నేషనల్ కోఆర్డినేటర్ డా. దామోదర రావు తానికొండ డిమాండ్**

ధర్మఘంట, జనవరి 03 హైదరాబాద్



డా. దామోదర రావు తానికొండ
ఏఐసీసీ నేషనల్ కోఆర్డినేటర్ (ఎస్సీ విభాగం)

భారత రాజ్యాంగ నిర్మాత, భారత రత్న డా. బి.ఆర్. అంబేద్కర్ చిత్రాన్ని గ్వాలియర్‌లో అనిల్ మిశ్రా దహనం చేసిన ఘటన దేశవ్యాప్తంగా తీవ్ర ఆగ్రహానికి దారి తీసింది. ఈ దారుణ ఘటన దళితులు, బహుజనులు మాత్రమే కాకుండా బాబాసాహెబ్‌ను గౌరవించే ప్రతి పౌరుని మనోభావాలను తీవ్రంగా గాయపరిచిందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ఈ ఘటనను ఏఐసీసీ ఎస్సీ విభాగం నేషనల్ కోఆర్డినేటర్ డా. దామోదర రావు తానికొండ తీవ్రంగా ఖండించారు. బాబాసాహెబ్ అంబేద్కర్ చిత్రాన్ని దహనం చేయడం అనేది కేవలం ఒక వ్యక్తిపై చేసిన అవమానం మాత్రమే కాదని, ఇది భారత రాజ్యాంగంపై, సమానత్వం – సామాజిక న్యాయం అనే మూల్యాలపై చేసిన ప్రత్యక్ష దాడిగా ఆయన పేర్కొన్నారు. సామాజిక సామరస్యాన్ని భంగం చేయాలనే ఉద్దేశంతోనే ఈ దుర్మార్గపు చర్య చేపట్టినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఘటనపై ఫిర్యాదు నమోదు కాగా, నిందితుడు అనిల్ మిశ్రాపై కేసు నమోదు చేసినట్లు సమాచారం. ఈ కేసుకు సంబంధించిన విచారణ ఈరోజు (04-01-2026) గ్వాలియర్ కోర్టులో జరగనుంది. కోర్టు విచారణ నేపథ్యంలో దేశవ్యాప్తంగా ఎస్సీ విభాగం మరియు పలు దళిత సంఘాలు కార్యాచరణకు సిద్ధమవుతున్నాయి. ప్రజాస్వామ్యబద్ధమైన నిరసనలు, న్యాయపరమైన పర్యవేక్షణ, సంబంధిత అధికారులకు వినతిపత్రాలు సమర్పించడం వంటి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా డా. దామోదర రావు తానికొండ మాట్లాడుతూ, నిందితుడిపై ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ చట్టంతో పాటు వర్తించే అన్ని కఠిన చట్టాల ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాబాసాహెబ్ అంబేద్కర్ గౌరవాన్ని కించపరిచే ఎలాంటి చర్యనైనా ఎస్సీ విభాగం ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోదని ఆయన స్పష్టం చేశారు. డా. బి.ఆర్. అంబేద్కర్ ప్రతిపాదించిన సమానత్వం, న్యాయం, గౌరవం వంటి రాజ్యాంగ విలువలను కాపాడేందుకు ఇలాంటి ద్వేషపూరిత చర్యలపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని ఆయన కోరారు.

# ఘనంగా భారతదేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు

# సావిత్రిబాయి పూలే 195వ జయంతి కార్యక్రమం

ధర్మఘంట, జనవరి 03 సూర్యాపేట



జిల్లా కేంద్రంలోని మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద ఉదయం 9 గంటలకు బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు చలమల్ల నర్సింహా ఆధ్వర్యంలో భారతదేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే 195 వ జయంతి సందర్భంగా వారు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. స్థానిక శాసనసభ్యులు మాజీ మంత్రివర్యులు గుంట కండ్ల జగదీష్ రెడ్డి విచ్చేసి, సావిత్రి బాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి అనంతరం మాట్లాడుతూ భారతదేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు అయిన సావిత్రిబాయి పూలే భారతదేశ మహిళల హక్కుల కొరకు మహిళల సాధికారిత కొరకు చదివే మార్గమని చదివితేనే జీవితంలో వెలుగు వస్తుందని భావించి 150 సంవత్సరాల క్రితమే వర్ణ వివక్ష ఉన్న రోజుల్లో తను చదువుకోవడమే కాకుండా తన చదువును ఇతరులకు పంచాలని దూర దృష్టితో ఆలోచన చేసి తన భర్త జ్యోతిరావు పూలే వద్ద విద్యను నేర్చుకొని సొంతంగా పాఠశాలను, హాస్టల్లో నెలకొల్పి పురుషాధిక్యత రోజుల్లో ఎన్నోవ్యయ ప్రయాసలకు ఓర్చుకొని మొక్కవోని ధైర్యంతో స్త్రీలకు విద్యను అందించిన గొప్ప మహా నాయకురాలు సావిత్రిబాయి పూలే అని కొనియాడారు. విద్య మూలమని భావించి పులే తన భార్యకు విద్యను నేర్పించారని అన్నారు. బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు చలమల్ల నర్సింహ, బీసీ జేఏసీ నాయకులు కుంట్ల ధర్మార్జున్ లు మాట్లాడుతూ భారతదేశం బ్రిటిష్ వారి పాలనలో ఉన్న 170 సంవత్సరాల క్రితమే బడుగు బలహీన వర్గాలకు స్వేచ్ఛ వాక్ స్వాతంత్ర్యం లేని, పురుషాధిక్యత ఉన్న సమయంలో బడుగు బలహీన వర్గాల పురుషులను అగ్రవర్ణాలు చదువుకు దూరంగా ఉంచిన రోజుల్లో ఇల్లాలి చదువు ఇంటికి వెలుగు అని పులే భావించి కుటుంబంలోని స్త్రీలు విద్య నేర్చుకుంటే తన సంతానం విద్యావంతులవుతారు తద్వారా కుటుంబం, గ్రామము రాష్ట్రము దేశం అభివృద్ధి చెందుతుందని భావించి పులే తన భార్యకు విద్యను నేర్పించడం జరిగింది అని అన్నారు. విద్యనే కాకుండా సామాజిక రుక్మతలను రూపుమాపడానికి బాల్య వివాహాలను, సతీసహగమనాన్ని, అంటరానితనాన్ని, వరకట్నాన్ని, అరికట్టడం జరిగింది. వితంతువులకు పునర్వివాహాలను జరిపించినారు. అంతేకాకుండా తను సంతానాన్ని కనడం వల్ల స్వార్థం పెరుగుతుందని సమాజానికి సేవ చేయలేమని భావించి సంతానాన్ని కనకుండా బీద బ్రాహ్మణ బాలుడు యశ్వంత్ ను పెంచుకోవడం జరిగింది సావిత్రిబాయి త్యాగశీలతను మనందరం స్మరించుకోవాలన్నారు. అంతేకాకుండా సొంతంగా వైద్యశాలలు నెలకొల్పి ప్లేగు వ్యాధిగ్రస్తులకు వైద్యాన్ని అందించి వ్యాధిగ్రస్తులను తన ఇంట్లో ఉంచుకొని వారికి భోజనాన్ని అందించి కంటికి రెప్పలాగా నిరంతరం తన తుది శ్వాస వరకు సేవలు చేసి అదే ప్లేగు వ్యాధితో మరణించడం జరిగిందని అన్నారు. వారి యొక్క త్యాగాన్ని పోరాటాన్ని సేవా తత్వాన్ని స్ఫూర్తిగా తీసుకొని వారి ఆశయ సాధన కొరకు మనమందరం కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వై వెంకటేశ్వర్లు, మారిపేద్ది శ్రీనివాస్ గౌడ్, జర్నలిస్టు డాక్టర్ బంటు కృష్ణ, మట్టిపెల్లి సైదులు, జీడి బిక్షం, చిలువేరు నరసింహారావు దాసరి వెంకన్న యాదవ్, బత్తుల దశరథ, నారబోయిన వెంకట్ యాదవ్, తూడి నరసింహారావు, బండపల్లి శ్రీనివాస్ గౌడ్, కోడి లింగయ్య యాదవ్, తన్నీరు వాసుదేవ్, మట్ట రమేష్ యాదవ్, కునుకుంట్ల సైదులు, బొమ్మ గాని శ్రీనివాస్ గౌడ్, యలగందుల సుదర్శన్, కీర్తి వెంకటేశ్వర్లు, మన్నె యాదగిరి, నారబోయిన కిరణ్, కటికం రమేష్, పేరూరి రమణ, దోరపల్లి రవి, గంగాధర జానకి రాములు తదితరులు పాల్గొన్నారు.

## రాయలసీమ జిల్లాలకు మహర్దశ

తిరుపతి

దేశంలో రెండు కీలక జాతీయ రహదారుల అభివృద్ధికి కేంద్రం ఆమోదం తెలిపింది. మహారాష్ట్రలో నాసిక్-సోలాపూర్-అక్కల్‌కోట్ వరకు రూ.19,142 కోట్లతో 6 వరుసల గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ కారిడార్ నిర్మాణం, ఒడిశాలో ఔఊ-326 విస్తరణ ఈ ప్రాజెక్టులలో ఉన్నాయి. ఈ కారిడార్లు ఏపీతో అనుసంధానం కానున్నాయి. ఈ కారిడార్ వల్ల రాయలసీమ జిల్లాల నుంచి మహారాష్ట్ర నగరాలకు రవాణా సమయం గణనీయంగా తగ్గుతుంది. పారిశ్రామిక అభివృద్ధి, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని అంటున్నారు..దేశంలో 2 కీలకమైన జాతీయ రహదారుల అభివృద్ధికి కేంద్ర ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ ఆమోదం తెలిపింది. రూ.20,668 కోట్ల వ్యయంతో కేంద్ర ప్రభుత్వం ఈ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ కారిడార్ ప్రాజెక్టును చేపడుతుంది. కేంద్రం ఆమోదించిన ఈ రెండు ప్రాజెక్టుల్లో ఒకటి మహారాష్ట్రలోని నాసిక్-సోలాపూర్-అక్కల్‌కోట్ వరకు రూ.19,142 కోట్లతో 6 వరుసల గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ కారిడార్ నిర్మాణం. మరొకటి ఒడిశాలోని ఔఊ-326 (మోహన-కోరాపుట్)ను రూ.1,526 కోట్లతో విస్తరణ. ఈ మెగా ప్రాజెక్టుల ద్వారా ఆంధ్రప్రదేశ్ కూడా అనుసంధానం కానుందిఈ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ కారిడార్‌ను సోలాపూర్ వద్ద ప్రస్తుతం నిర్మిస్తున్న సోలాపూర్-చెన్నై 4 వరుసల నేషనల్ హైవేతో అనుసంధానిస్తారు. ఈ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ కారిడార్ వల్ల రాయలసీమ జిల్లాల నుంచి మహారాష్ట్రలోని ముఖ్య పట్టణాలైన ముంబై, పుణే, నాసిక్ నగరాలకు రవాణా సమయం గణనీయంగా తగ్గుతుంది. అలాగే, ఏపీలోని పారిశ్రామిక హబ్‌లైన ఓర్వకల్లు, కొప్పర్తికి సరుకు రవాణా మెరుగుపడుతుంది. సోలాపూర్-చెన్నై రోడ్డు కర్ణాటకలోని కోస్గి, రాయచూరు, తెలంగాణలోని మహబూబ్‌నగర్ జిల్లాతో పాటుగా ఏపీలోని కర్నూలు, నంద్యాల, కడప, రేణిగుంట మీదుగా తమిళనాడులోని చెన్నై పోర్టుకు చేరుకుంటుంది.ఈ రెండు కారిడార్‌లు అనుసంధానమైతే కొప్పర్తి, ఓర్వకల్లు పారిశ్రామిక నోడ్‌లలో స్థాపించే వివిధ పరిశ్రమలు ఉత్పత్తి చేసే సరుకు రవాణాకు ఎంతగానో ఉపయోగపడుతుంది. పశ్చిమాది రాష్ట్రాల నుంచి తిరుమలకు వచ్చే భక్తులకు కూడా ఇది ఎంతో సౌకర్యవంతంగా ఉంటుంది. సోలాపూర్-చెన్నై హైవేలో భాగంగా కర్నూలు జిల్లాలోని తుంగభద్ర, హంద్రీ నదులపై భారీ బ్రిడ్జిల నిర్మాణ పనులు వేగంగా ముందుకు సాగుతున్నాయి. ఈ కారిడార్ల ద్వారా పశ్చిమ, దక్షిణాది రాష్ట్రాల అనుసంధానం కానున్నాయి. దీని వల్ల కొప్పర్తి, ఓర్వకల్లు నోడ్‌లలో పరిశ్రమల స్థాపనకు పారిశ్రామికవేత్తలు ముందుకు వచ్చే అవకాశం ఉంది.ఈ కారిడార్ల ద్వారా రాయలసీమలో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు మెరుగుపడతాయి. ప్రస్తుతం కర్నూలు, నంద్యాల, కడప, తిరుపతి, అనంతపురం జిల్లాల ప్రజలు సోలాపూర్ వెళ్లాలంటే, హైదరాబాద్ మీదుగా వెళ్లాల్సి వస్తోంది. సోలాపూర్-చెన్నై హైవే నిర్మాణం పూర్తయితే కర్నూలు, మహబూబ్‌నగర్, రాయచూరు మీదుగా సోలాపూర్ చేరుకోవచ్చు. దీని వల్ల కర్నూలు నుంచి సోలాపూర్‌కు దాదాపు 100 కిలోమీటర్ల దూరం తగ్గుతుంది.మరోవైపు, ఒడిశాలోని ఔఊ-326 రోడ్డును 206 కి.మీ. మేర విస్తరించడానికి కేంద్రం రూ.1,526 కోట్లు కేటాయించింది. దీని వల్ల మోహన-కోరాపుట్ నుంచి రాయ్‌పూర్-విశాఖపట్నం కారిడార్‌కు అనుసంధానం ఏర్పడుతుంది. దీనివల్ల ఛత్తీస్‌గఢ్, ఒడిశా నుంచి విశాఖపట్నం పోర్టుకు సరుకు రవాణా వేగంగా జరుగుతుంది. ఈ ప్రాజెక్టులు మహారాష్ట్రతో పాటు తెలుగు రాష్ట్రాలకు జీవనాడిలాంటివని, ఉపాధి అవకాశాలు ఎంతగానో మెరుగుపడతాయని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ పేర్కొన్నారు.దేశంలో 2 కీలకమైన జాతీయ రహదారుల అభివృద్ధికి కేంద్ర ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే. రూ.20,668 కోట్ల వ్యయంతో కేంద్ర ప్రభుత్వం ఈ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ కారిడార్ ప్రాజెక్టును చేపడుతుంది. కేంద్రం ఆమోదించిన ఈ రెండు ప్రాజెక్టుల్లో మహారాష్ట్రలోని నాసిక్-సోలాపూర్-అక్కల్‌కోట్ వరకు రూ.19,142 కోట్లతో 6 వరుసల గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ కారిడార్ నిర్మాణం ఒకటి కాగా.. ఒడిశాలోని ఔఊ-326 (మోహన-కోరాపుట్)ను రూ.1,526 కోట్లతో విస్తరణ ఈ ప్రాజెక్టులలో ఉన్నాయి. ఈ మెగా ప్రాజెక్టుతో ఆంధ్రప్రదేశ్ కూడా అనుసంధానం కానుంది.ఈ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ కారిడార్‌ను.. సోలాపూర్ వద్ద ప్రస్తుతం నిర్మిస్తున్న సోలాపూర్-చెన్నై 4 వరుసల నేషనల్ హైవేతో అనుసంధానిస్తారు. ఈ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ కారిడార్ వల్ల రాయలసీమ జిల్లాల నుంచి మహారాష్ట్రలోని ముఖ్య పట్టణాలైన ముంబై, పుణే, నాసిక్ నగరాలకు రవాణా సమయం గణనీయంగా తగ్గుతుంది. అలాగే, ఏపీలోని పారిశ్రామిక హబ్‌లైన ఓర్వకల్లు, కొప్పర్తికి సరుకు రవాణా మెరుగుపడుతుంది. సోలాపూర్-చెన్నై రోడ్డు కర్ణాటకలోని కోస్గి, రాయచూరు, తెలంగాణలోని మహబూబ్‌నగర్ జిల్లాతో పాటుగా ఏపీలోని కర్నూలు, నంద్యాల, కడప, రేణిగుంట మీదుగా తమిళనాడులోని చెన్నై పోర్టుకు చేరుకుంటుంది.ఈ రెండు కారిడార్‌లు అనుసంధానమైతే కొప్పర్తి, ఓర్వకల్లు పారిశ్రామిక నోడ్‌లలో స్థాపించే వివిధ పరిశ్రమలు ఉత్పత్తి చేసే సరుకు రవాణాకు ఎంతగానో ఉపయోగపడుతుంది. పశ్చిమాది రాష్ట్రాల నుంచి తిరుమలకు వచ్చే భక్తులకు కూడా ఇది ఎంతో సౌకర్యవంతంగా ఉంటుంది. సోలాపూర్-చెన్నై హైవేలో భాగంగా కర్నూలు జిల్లాలోని తుంగభద్ర, హంద్రీ నదులపై భారీ బ్రిడ్జిల నిర్మాణ పనులు వేగంగా ముందుకు సాగుతున్నాయి. ఈ కారిడార్ల ద్వారా.. పశ్చిమ, దక్షిణాది రాష్ట్రాల అనుసంధానం కానున్నాయి. దీని వల్ల కొప్పర్తి, ఓర్వకల్లు నోడ్‌లలో పరిశ్రమల స్థాపనకు పారిశ్రామికవేత్తలు ముందుకు వచ్చే అవకాశం ఉంది.

## వినియోగదారుల మన్ననలను పొందాలి

**మాజీ మంత్రి, సూర్యాపేట శాసనసభ్యులు గుంటకండ్ల జగదీశ్ రెడ్డి**
**కన్నుల పండుగగా నాని మొబైల్స్, యాక్సెసరీస్ ప్రారంభం**




ధర్మఘంట, జనవరి 03 సూర్యాపేట

వినియోగదారులకు మెరుగైన సేవలను అందించి వారి మన్నలను పొందాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి అన్నారు. శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద నాని మొబైల్స్ అండ్ యాక్సెసరీస్ రీ మోడలింగ్ నూతన షాపును శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. వినియోగదారుల మన్నలను పొందినప్పుడు సంస్థలు అభివృద్ధి బాటలో నడుస్తాయని పేర్కొన్నారు. నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ వ్యాపారంలో అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. అనంతరం నిర్వాహకులు దేసోజ్ రవీంద్ర చారి, కళ్యాణి మాట్లాడుతూ. 20 సంవత్సరాల అనుభవంతో మొబైల్ అండ్ యాక్సెసరీస్, మొబైల్ సర్వీసెస్ షాపు నడుపుతున్నానని అన్నారు. ఐఫోన్ కు సంబంధించిన అన్ని రకాల సర్వీస్ లను మొబైల్ షాప్ లో అందిస్తున్నామని తెలిపారు. ఇన్ని సంవత్సరాలుగా వినియోగదారులు తమ పట్ల ఉంచిన నమ్మకం విశ్వాసంతో ముందుకు సాగుతున్నామని, అదేవిధంగా ఇప్పుడు కూడా కస్టమర్లు ఆదరాభిమానాలను అందించాలని కోరారు. చక్కని నాణ్యతతో సరసనమైన ధరలలో నైతికతతో మొబైల్ సేవలు అందించడంలో నాని మొబైల్స్ ఎల్లప్పుడు కూడా ముందుంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు, మిత్రులు, బంధువులు, గుర్రం సత్యనారాయణ రెడ్డి, నిమ్మల శ్రీనివాస్ గౌడ్, గోపగాని వెంకటనారాయణ గౌడ్, గండూరి ప్రకాష్, మారిపెద్ది శ్రీనివాస్, ఎర్రం శెట్టి ఉపేందర్, డాక్టర్ కృష్ణ బంటు, పర్వతం భరత్ కుమార్, మహంకాళి శివ, సాయి, నజీర్, పవన్, దారోజు ఉపేందర్, వీరబాబు, పవన్, చరణ్, చింటూ, పండు, తదితరులు పాల్గొన్నారు.

## బెజవాడ కోకాపేటగా కానూరు

విజయవాడ

విజయవాడ శివారు ప్రాంతాలైన కానూరు, పోరంకి ప్రాంతాలు భవిష్యత్తులో కోకాపేట స్థాయికి ఎదుగుతాయన్న అంచనాలు రియల్ ఎస్టేట్ వర్గాలు వేస్తున్నాయి. కానూరు, పోరంకి, తాడిగడప వంటి ప్రాంతాలు ఇప్పుడు ఇన్వెస్టర్ల హాట్ ఫేవరెట్‌గా మారాయి. రాజధాని అమరావతి నిర్మాణ పనుల్లో వేగం పెరగడం, ప్రభుత్వం మౌలిక సదుపాయాలపై దృష్టి పెట్టడంతో ఈ ప్రాంతాల్లో భూముల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి.త్వరలోనే ఇక్కడ భారీ ఆకాశహర్మ్యాలు, వాణిజ్య సముదాయాలు వెలుస్తాయన్న అంచనాలతో రియల్ ఎస్టేట్ రంగం కొత్త ఉత్సాహంతో కనిపిస్తోంది. ఇలాంటి అంచనాలు రావడానికి ప్రధాన కారణం ఇక్కడి అద్భుతమైన కనెక్టివిటీ. అమరావతి రాజధాని నగరానికి నేరుగా అనుసంధానించేలా నిర్మిస్తున్న వెస్ట్ బైపాస్ రోడ్డు కీలకంగా మారింది. దీనివల్ల విజయవాడ నగరంతో సంబంధం లేకుండా నేరుగా రాజధాని ప్రాంతానికి, అటు గుంటూరుకు చేరుకునే సౌలభ్యం కలగనుంది.కాస్త ఆలస్యం అయినా మరో రెండేళ్లలో గ్రేటర్ విజయవాడ ప్రతిపాదన కూడా కార్యరూపం దాలుస్తుండటంతో, భవిష్యత్తులో ఇక్కడ అత్యున్నత స్థాయి మౌలిక వసతులు అందుబాటులోకి వస్తాయని భా?స్తున్నారు. ఈ అంచనాల ఫలితంగానే గతంలో ఎప్పుడూ లేని విధంగా ఈ ప్రాంతాల్లో ల్యాండ్ డీల్స్ సంఖ్య పెరిగింది. ప్రధాన రోడ్లకు సమీపంలో ఉన్న స్థలాల ధరలు కోట్లలో పలుకుతున్నాయి. గేటెడ్ కమ్యూనిటీ విల్లాలు, లగ్జరీ అపార్ట్‌మెంట్‌ల నిర్మాణం ఊపందుకుంది. బహుళ జాతీయ సంస్థలు తమ కార్యాలయాల కోసం ఇక్కడ స్థలాలను అన్వేషిస్తుండటంతో, రియల్ ఎస్టేట్ వ్యాపారులు కూడా పెద్ద ఎత్తున భూములను సమీకరిస్తున్నారు.

## ఏపీకి ఆర్థిక కష్టాలు

విజయవాడ

ఆంధ్రప్రదేశ్ ఆర్థిక పరిస్థితి రోజురోజుకీ కఠినంగా మారుతోందన్న అభిప్రాయం బలపడుతోంది. 2014 జూన్ 2 న రాష్ట్ర విభజన జరిగినప్పటినుంచి ఇప్పటివరకు పూర్తిస్థాయిలో ఆర్థిక ఇబ్బందుల నుంచి బయటపడలేకపోయిందన్నది వాస్తవం. రాజకీయంగా తీవ్రమైన పోటీ ఉండటంతో అధికారంలోకి రావడమే లక్ష్యంగా పార్టీలు అనేక ఉచిత హామీలు ఇస్తూ వచ్చాయి. అదే సమయంలో ఆదాయ వనరులు బలపడకపోవడం రాష్ట్ర ఖజానాపై తీవ్ర ఒత్తిడిని తీసుకొచ్చింది.విభజన సమయంలోనే ఏపీ భారీ రెవెన్యూ లోటుతో ప్రారంభమైంది. కాగ్ నివేదిక ప్రకారం 2014?15 ఆర్థిక సంవత్సరంలోనే దాదాపు 24,194 కోట్ల రూపాయల లోటు నమోదైంది. ఆ తర్వాత ఆదాయాన్ని తెచ్చే హైదరాబాద్ వంటి మహానగరం లేకపోవడంతో లోటు క్రమంగా పెరుగుతూ వచ్చింది. సంవత్సరానికోసారి ఆదాయానికి, ఖర్చులకు మధ్య అంతరం పెరిగి చివరకు సాధారణ పరిపాలనా అవసరాలకే రుణాలు తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందిఈ పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వం రెండో దశ జీఎస్టీ సంస్కరణల పేరుతో ఈ ఏడాది అక్టోబర్ నుంచి కొత్త స్లాబులు అమల్లోకి తీసుకొచ్చింది. మధ్యతరగతి, దిగువ తరగతికి ఊరట కలిగించాలన్న ఉద్దేశంతో అనేక వస్తువులను జీఎస్టీ పరిధి నుంచి మినహాయించారు. దీని వల్ల రాష్ట్రాలకు వచ్చే ఆదాయం తగ్గిపోయింది. ఏపీకి సుమారు ఎనిమిది వేల కోట్ల రూపాయల వరకు నష్టం వాటిల్లుతుందన్న అంచనాలు అప్పుడే వినిపించాయి. కానీ వాస్తవంగా చూస్తే ఈ ప్రభావం మరింత తీవ్రంగా కనిపిస్తోందని అధికారులు చెబుతున్నారు.గణాంకాలు పరిశీలిస్తే గత ఏడాది అక్టోబర్‌లో జీఎస్టీ ద్వారా రాష్ట్రానికి 2,777 కోట్ల రూపాయలు ఆదాయం రాగా, ఈ ఏడాది అదే నెలలో అది స్పష్టంగా తగ్గింది. అలాగే గత ఏడాది నవంబర్ లో 2,827 కోట్ల రూపాయలు వచ్చిన చోట ఈ ఏడాది నవంబర్‌లో కేవలం 2,697 కోట్ల రూపాయలకే పరిమితమైంది. అంటే సుమారు నాలుగు శాతం కంటే ఎక్కువగా ఆదాయం తగ్గినట్టు లెక్కలు చెబుతున్నాయి.జీఎస్టీ వల్ల రాష్ట్రాలకు వచ్చిన నష్టాన్ని కేంద్రం ఏదో రూపంలో భర్తీ చేయాల్సి ఉన్నా, ఆ దిశగా స్పష్టమైన చర్యలు కనిపించడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఏపీకి ఈ దెబ్బ ఎక్కువగా తగిలిందని విశ్లేషకులు అంటున్నారు. గత పదకొండేళ్లలో పరిశ్రమలు, సేవారంగం పెద్దగా ఆదాయాన్ని తీసుకురాలేకపోయాయి. ఇప్పటికీ వ్యవసాయ రంగంపైనే ఎక్కువగా ఆధారపడాల్సిన పరిస్థితి ఉంది.ఇదే సమయంలో ప్రభుత్వంపై ఖర్చుల భారం భారీగా పెరిగింది. సామాజిక పెన్షన్లను నాలుగు వేల రూపాయలకు పెంచి సుమారు 65 లక్షల మందికి చెల్లిస్తున్నారు. ఉచిత బస్సు సౌకర్యం, ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, రైతులకు అన్నదాతా సుఖీభవ వంటి పథకాలు అమల్లో ఉన్నాయి.

# మరో నవ నూతన ఆశయం

నీవు ఏ కష్టములో ఉన్నా, ప్రపంచములో ఏ మూలనున్నా, ప్రభువా అని పిలిస్తే నిన్ను నడిపించడానికి నీ చేయి పట్టుకుంటాడు. ఈ సంవత్సరం మొదలుకొని సంవత్సరాంతం వరకు దేవుడు నిన్ను క్షేమంగా నడిపిస్తాడు. నూతన సంవత్సరంలో యెహోవా కన్నులు ఈ 2026 సంవత్సరాది మొదలుకొని సంవత్సరాంతము వరకు ఎల్లప్పుడు మీ మీద మీకుటుంబాల మీద ఉండే గొప్ప కృపను దేవుడు మనకు సమృద్ధిగా అనుగ్రహించుగాక!
అయినప్పటికీ,
నీవెట్లా జీవించినప్పటికీ,
నీ ప్రవర్తనకు ప్రతిఫలమియ్యక,
ఆయన కృపలో ఈ క్షణం వరకూ నడిపిస్తూ,
మరి కొద్దీ రోజుల్లోనే మరొక నూతన సంవత్సరం లోనికి నిన్ను ప్రవేశ పెట్టడానికి ఆయన ఇష్టపడుతున్నాడు.
అయితే, ఆయన కృప, ఉగ్రతగా మారకముందే,
పాత జీవితాన్ని పాతి పెట్టి, నూతన జీవితానికి నాంది పలుకుదాం.
మాదిరి కరమైన జీవితం జీవించడానికి
నూతనమైన తీర్మానంతో,
నూతనమైన ఉద్దేశ్యాలతో,
నూతనమైన తలంపులతో నూతన సంవత్సరాన్ని ఎదుర్కోవడానికి సిద్ధ పడదాం. మన మాటలలో మాదిరి...
నీ, యౌవనమునుబట్టి ఎవడును నిన్ను తృణీకరింపనియ్యకుము గాని, మాటలోను, ప్రవర్తనలోను, ప్రేమలోను, విశ్వాసములోను, పవిత్రతలోను, విశ్వాసులకు మాదిరిగా ఉండుము.

మనము మాట్లాడే విధానమే మనకు మిత్రులనుగాని, శత్రువులనుగాని తెచ్చి పెడుతుంది. హృదయము నిండిన దానిని బట్టి నోరు మాట్లాడుతుంది.
కాబట్టి, మాటలను బట్టి ఒకని వ్యక్తిత్వమేమిటో? చాలా వరకూ అంచనా వేయవచ్చు. హృదయంలో నున్నదొకటి పైకి మాట్లాడేది మరొకటి. వాటినే 'కపటపు మాటలు' అంటాము. మన మాటలలో ఎక్కువ శాతం వీటికే పరిమితం. కాని, ఎక్కువ కాలం నటించడం సాధ్యం కాదు. క్రియల్లో తప్పకుండా దొరికిపోతాము.
అయితే, మన మాటలు ఎట్లా వుండాలి? వ్యభిచారిణిని సహితం అమ్మా...! అంటూ పిలువగలిగిన మన ప్రియరక్షకుడే మనకు గొప్ప ఆదర్శం. ఆయన పిల్లలముగా మాటలలోనూ ఆయనను అనుసరించ గలగాలి. అవును! రుతువులు, కాలాలు, సృష్టి యావత్తు ఏవీ దేవుని మాటను జవదాటవు.
నీవూ నేనూ తప్ప.
అయినప్పటికీ, నీవెట్లా జీవించినప్పటికీ,
నీ ప్రవర్తనకు ప్రతిఫలమియ్యక,
ఆయన కృపలో ఈ క్షణం వరకూ నడిపిస్తూ,
మరి, చివరిరోజులో నీవు ఉన్నావు.
మరొక నూతన సంవత్సరం లోనికి నిన్ను ప్రవేశ పెట్టడానికి ఆయన ఇష్టపడియున్నాడు. అయితే,
ఆయన కృప, ఉగ్రతగా మారకముందే, పాత జీవితాన్ని పాతి పెట్టి,
నూతన జీవితానికి నాంది పలుకుదాం. మాదిరి కరమైన జీవితం జీవించడానికి నూతనమైన తీర్మానంతో,
నూతనమైన ఉద్దేశ్యాలతో,
నూతనమైన తలంపులతో
ప్రతి రోజును ఎదుర్కోవడానికి సిద్ధ పడదాం.

## ఈ సంవత్సర తొలి పరిశుద్ధ దిన ప్రార్థన

మన 2026 విశ్వాస ప్రయాణంలో ఈ సంవత్సర తొలి ఆదివారపు ప్రార్థనగా ... ఇదివరకంటే ఎక్కువగా... హత్యలు, దాడులు, అరాచకాలు, అవమానాలు, అణచివేతలు, అక్రమ అరెస్టులు, అక్రమ నిర్బంధాలు, దౌర్జన్యాలు, దోపిడీలు తదితరవి చూడబోతున్నమనడంలో ఎటువంటి సందేహం లేదు. ఈ నేపథ్యంలో.... ప్రభువైన యేసుక్రీస్తు నామములో భారత దేశ క్రైస్తవ సమాజానికి అబ్రాహాము లాంటి విధేయులు, మోషే లాంటి సమర్పించుకున్న నాయకులు, దావీదు లాంటి ధైర్యసాహసులు, నెహెమ్యా లాంటి ప్రార్థనపరులు, ఇశ్రాయేలు లాంటి పనివారు, పేతురు లాంటి నిలబడేవారు, పౌలు లాంటి నిశ్వార్థపరులు, యోహాను లాంటి ప్రత్యక్షత గలవారిని మన ప్రభువైన యేసుక్రీస్తు నామములో సైన్యములకు అధిపతి యగు యోహోవా మనకు దయచేయును గాక, ఆమెన్.



రిజాయిస్ మినిస్ట్రీస్ ఫౌండర్,
దైవజనురాలు శోభిక సల్వాది

మన ప్రభువును రక్షకుడునునైన యేసు క్రీస్తు శుభప్రదమైన నామములో శుభములు మీకు కలుగును గాక!
ధర్మఘంట పాఠకులకు, ప్రియ మిత్రులందరికి నూతన సంవత్సరం 2026 శుభాకాంక్షలు.
అనిర్వచనీయమైన అనుభూతులెన్నో మిగిల్చి, మన నుండి 2025 దూరమైనది. ఇప్పుడు మన ముందు 2026 ప్రత్యక్షం మైంది.
అవును! రుతువులు, కాలాలు, సృష్టి యావత్తు ఏవీ దేవుని మాటను జవదాటవు. నీవూ నేనూ తప్ప.
అయినప్పటికీ, నీవెట్లా జీవించినప్పటికీ, నీ ప్రవర్తనకు ప్రతిఫలమియ్యక, ఆయన కృపలో ఈ క్షణం వరకూ నడిపిస్తూ,
దేవుడు, మరొక నూతన సంవత్సరం మనకు ప్రసాదించాడు. అయితే, ఆయన కృప, ఉగ్రతగా మారకముందే, పాత జీవితాన్ని పాతి పెట్టి, నూతన జీవితానికి నాంది పలుకుదాం. మాదిరి కరమైన జీవితం జీవించడానికి నూతనమైన తీర్మానంతో,
నూతనమైన ఉద్దేశ్యాలతో,
నూతనమైన తలంపులతో నూతన సంవత్సరాన్ని ఎదుర్కోవడానికి సిద్ధ పడుదాం.

ఆయన నీ దేవుడు, నీ చెయ్యి పట్టుకొని ముందుకు నడిపిస్తాడు. "మీరు నది దాటి స్వాధీన పరచుకొనుటకు వెళ్లుచున్న దేశము కొండలు, లోయలు గల దేశము. అది ఆకాశవర్షజలము త్రాగును. అది నీ దేవుడైన యెహోవా లక్ష్యపెట్టు దేశము. నీ దేవుడైన యెహోవా కన్నులు సంవత్సరాది మొదలుకొని సంవత్సరాంతమువరకు ఎల్లప్పుడు దానిమీద ఉండును."
ద్వితీ. 11 : 11,12

మనము అడుగు పెట్టిన దేశము, కొండలు, లోయలు గల దేశము. అంతా చదునుగా వుండదు. అంతా పల్లంగానూ వుండదు.
జీవితం చదునుగాఉండి, ఎత్తు పల్లాలు లేకుండా ఉంటే? అది నిస్సారం అవుతుంది. కొండలు, లోయలు వుండాలి. కొండలు వర్షధారల్ని పోగుచేసి, లోయలలోకి ప్రవహింప జేస్తాయి. మన జీవితాల్లోనూ అంతే. కొండలు ఎదురైనప్పుడే మనం కృపా సింహాసనం ఎదుట మోకాళ్ళని ఆశీర్వాద వర్షధారల్ని పొందుతాము. జీవితంలో మనకెదురయ్యే కష్టాలు దేవుడు మన యెదుట నిలువబెట్టే కొండల వంటివి. వీటి వల్లనే మన జీవితాలు సంపూర్ణమై దేవునికి దగ్గరగా మనం వెళ్ళ గలుగుతున్నాము. ఈ నూతన సంవత్సరం ఎట్లాంటి పరిస్థితులగుండా ప్రయాణించాలో మనకు తెలియదు. కాని, "కేవలం ఆయన యందు నమ్మికయుంచు చాలు." ఎందుకంటే? ఆయన నీ దేవుడు నీ చెయ్యి పట్టుకొని ముందుకు నడిపిస్తాడు. ఇది మంచి దినము దీవెనకరమైన క్రొత్త దినము. నీ అవసరాలన్నీ ఆయన తీర్చుతాడు. ఎప్పటికీ ఎండిపోని నీటి బుగ్గలు ఆయనలో వున్నాయి. ఆయన కృపతో నిండిన వాగ్దానపు ఆశీర్వాదాలు ఆనకట్టలులేని సెలయేళ్ళవలే ఆయన నుండి ప్రవహిస్తున్నాయి. ఆ ప్రవాహానికి అంతం లేదు. అది ఎప్పటికీ ఎండిపోదు. వాటిని అందుకోవడానికి నిన్ను నీవు సిద్ధపరచుకో. ఈ నూతన సంవత్సరంలో నీవూ నేనూ అడుగు పెట్టాము అంటే? మన పరిశుద్ధత, నీతి ఏమాత్రమూ కాదు. ఆయన కృపనుబట్టి ఆయనను స్తుతించు.

ఈ నూతన సంవత్సరం శాంతి - సమాధానం, కృపా క్షేమం నీవెంటే రావాలంటే?
నీ ప్రతీ విధమైన పరిస్థితికి ఆయనను నీ ముందుంచు. నూతనమైన తలంపులు నూతనమైన ఉద్దేశ్యాలు నూతనమైన తీర్మానాలు నూతనోత్తేజంతో ఈ నూతన సంవత్సరం ఆరంభించు.
జయకరమైన జీవితాన్ని జీవించు.
రోమా 8:14

ప్రియమైన వారలారా ఆయనకు సృష్టించడము మాత్రమే కాదు, ప్రేమించడము కూడా తెలుసు.
స్నేహము చేయడము కూడా తెలుసు,
మన కొరకు మరణించడము తెలుసు, మన కొరకు జీవించడము కూడా తెలుసు,
అందుకే మనలను రాబోతున్న 2026 నూతన సంవత్సరములో మనలను నడిపిస్తాడు. అనేకులు ప్రస్తుత దినాలలో సుళువుగా చెప్పే సాకు - మమ్మును నడిపించేవారు లేరు. నడిపించే గొప్ప దేవుడు మన కొరకు దిగివస్తే, ఆయన మార్గదర్శకత్వాన్ని నిరాకరించడం చాలా విచారకరం. ఆనాడు దేవునితో నడువని వారికి శిక్షపడింది. ఈనాడు ఆత్మ చేత నడిపించబడని వారికి కూడా శిక్షపడుతుంది.
ప్రియ దేవుని బిడ్డా! 2025 సంవత్సరంలో నీ ప్రయాణం విజయవంతంగా జరుగ లేదని నిరాశ వద్దు. ఈ నూతన సంవత్సరం 2026 లో దేవునికి లోబడు. ఆయన నడిపింపుకు లోబడితే, మనం ఆయన బిడ్డలమై యుంటాము. దేవుని ఆత్మచేత ఎందరు నడిపించబడుదురో వారందరూ దేవుని కుమారులై యుందురు.
1తిమోతి 4:12

**1. మృదువుగా ఉండాలి:**
కోపాన్ని రెట్టింపు చెయ్యాలన్నా చల్లార్చాలన్నా? మన మాటలే కారణం.
ఒక గోల్డ్ షాప్ లో ఒక బోర్డ్ చూశాను. "మిమ్ములను సిసి కెమరాలు రికార్డ్ చేస్తున్నాయి. దయచేసి నవ్వుతూ ఆభరణములను చూడండి" అని వ్రాసి వుంది. దానికి నేను ఆశ్చర్య పోయాను. దానిలో కటిన మైన హెచ్చరిక వుంది. ఒళ్ళు దగ్గర పెట్టుకొని చూడండి. ఏదయినా పర్స్ లో వేసుకుంటే మీ పరువు కాస్త పోలీస్ స్టేషన్ లో కలసి పోతుందని కాని, వారు చెప్పే విధానం మాత్రం చాలా మృదువుగా వుంది. కఠినమైన మాటలు కూడా మనము మృదువుగా మాట్లాడ గలగాలి. "మృదువైన మాట క్రోధమును చల్లార్చును. నొప్పించు మాట కోపమును రేపును."
సామెతలు 15:1

**2. కృపాసహితంగా ఉండాలి:**
ఉప్పు రుచిని కలిగిస్తుంది. అట్లానే మన మాటలు కూడా రుచికరంగా వుండాలి.
ఉప్పు తక్కువైనా రుచించక పోవచ్చు. ఎక్కువైనా తినడానికి పనికి రాకుండా పోవచ్చు. మన మాటలు సమపాళ్ళలో ఉంటూ దేవుని కృపను గురించి మాత్రమే ఎక్కువ ప్రస్తావించే విధంగా వుండాలి. "ప్రతి మనుష్యునికి ఏలాగు ప్రత్యుత్తరమియ్య వలెనో అది మీరు తెలిసికొనుటకై మీ సంభాషణ ఉప్పు వేసినట్టు ఎల్లప్పుడు రుచిగలదిగాను కృపాసహితముగాను ఉండనియ్యుడి."
కొలస్సి 4:6

**3. క్షేమకరంగా ఉండాలి:**
దుర్భాషలు మాట్లాడడానికి వీల్లేదు. అట్లాంటి మాటలు కత్తులతో పనిలేకుండానే ఎదుటి వారిని హత్య చేసి మనలను నరహంతకుల జాబితాలో చేర్చేస్తాయి. తన సహోదరుని ద్వేషించువాడు నరహంతకుడు.
1యోహాను 3:15
మన మాటలు వినే వారికి క్షేమమును, ఆదరణను కలిగించాలి. "వినువారికి మేలు కలుగునట్లు అవసరమునుబట్టి క్షేమాభివృద్ధికరమైన అనుకూలవచనమే పలుకుడి గాని దుర్భాషయేదైనను మీనోట రానియ్యకుడి." ఎఫెసి 4:29

**4. కృతజ్ఞతతో కూడినవై ఉండాలి:**
బూతులుగాని, డబుల్ మీనింగ్ డైలాగ్స్ గాని, అపార్థమునకు తావిచ్చే మాటలుగాని, పాపమునకు ప్రేరేపించే మాటలుగాని మనము మాట్లాడడానికి వీల్లేదు. కృతజ్ఞతతో నిండిన మాటలై ఉండాలి. అట్టి మాటలు హృదయ పూర్వకమైనవి కాబట్టి, ఎటువంటి అపార్థాలకు తావిచ్చే అవకాశం ఉండదు.
"కృతజ్ఞతావచనమే మీరుచ్చరింపవలెను గాని మీరు బూతులైనను, పోకిరిమాటలైనను, సరసోక్తులైనను ఉచ్చరింపకూడదు; ఇవి మీకు తగవు." ఎఫెసి 5:4

**5. ఆలోచించి మాట్లాడేవిగా ఉండాలి:**
ఎక్కువ మాట్లాడే వాళ్ళు
తప్పకుండా అనవసరమైన మాటలు, తప్పు మాటలు, ఇతరులకు హాని కలిగించే మాటలు మాట్లాడుటకు చాల ఎక్కువ అవకాశాలు ఉన్నాయి. విస్తారమైన మాటలలో దోషముండక మానదు. సామెతలు 10:19
అదే సమయంలో వినవలసినది వారు వినలేక, విషయం అర్థంకాక సమస్యలుకొని తెచ్చుకుంటారు.
అందుచే,
"మాటలాడుటకు నిదానించువాడునై యుండవలెను.
" యాకోబు 1:19

**6. కొద్దిగా ఉండాలి:**
మన మాటలు మనలను మనమే హెచ్చించుకొనే స్థితిలో వుంటాయి. వద్దు! తన పెదవులను మూసికొనువాడు బుద్ధిమంతుడు. ఆయనను హెచ్చించాలి. మనము తగ్గించబడాలి. "దేవుడు ఆకాశమందున్నాడు నీవు భూమిమీద ఉన్నావు, కావున నీ మాటలు కొద్దిగా ఉండవలెను." ప్రసంగి 5:2
దేవుని పిల్లలముగా మనమాటలు ఎట్లా వున్నాయి?.. నూతన సంవత్సరంలో మన మాటలు ప్రభువుకు మహిమ పరచే విధము పరశుద్ధత్మ దేవుడు మనకు సహాయం చేయును గాక

**హల్లెలూయ..**
మన దేవుని ప్రేమయు, రక్షకుడైన యేసుక్రీస్తు కృపయు, పరిశుద్ధాత్మ సహవాసమును మీకందరికిని తోడైయుండును గాక.
**ఆమేన్ ! ఆమేన్ !! ఆమేన్ !!!**

## డీ.బీ.ఎస్.ఏ-దళిత్ బహుజన్ స్టూడెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఓయూ లో ఘనంగా సావిత్రిబాయి పూలే 195వ జయంతి వేడుకలు



ధర్మఘంట, జనవరి 03, హైదరాబాద్:
డీ.బీ.ఎస్.ఏ దళిత్ బహుజన్ స్టూడెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వివిధ బహుజన సంఘాల సమక్షంలో, ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల ముందు చదువుల తల్లి సావిత్రిబాయి పూలే 195వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఇఫ్లూ విశ్వవిద్యాలయ అధ్యాపకులు ప్రొఫెసర్ పంథాకాల శ్రీనివాస్ మరియు చరిత్ర విభాగం అధ్యాపకురాలు ప్రొఫెసర్ ఇందిర హాజరై ప్రసంగించారు. సావిత్రిబాయి పూలే జీవితం, ఆమె ప్రారంభించిన విద్యా ఉద్యమం, కులవ్యవస్థ మరియు పురుషాధిక్యతలపై సాగించిన పోరాటాన్ని విశ్లేషిస్తూ, విద్య ద్వారానే సామాజిక మార్పు సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. మహిళా విద్య, సామాజిక సమానత్వం, న్యాయసమాజ నిర్మాణంలో సావిత్రిబాయి పూలే పాత్ర చారిత్రాత్మకమని వారు వివరించారు. డీబీఎస్ఏ రాష్ట్ర కోఆర్డినేటర్, ఓయూ స్కాలర్ జంగిలి దర్శన్ మాట్లాడుతూ, సావిత్రిబాయి పూలే కేవలం ఒక విద్యావేత్త మాత్రమే కాకుండా, బహుజన మహిళల విముక్తికి దీపశిఖగా నిలిచిన మహోన్నత వ్యక్తిత్వమని పేర్కొన్నారు. చదువు అనేది హక్కుగా మారినప్పుడే సమాన సమాజం నిర్మాణం సాధ్యమవుతుందని, నేటి విద్యార్థులు సావిత్రిబాయి పూలే ఆశయాలను ఆచరణలో పెట్టి సామాజిక మార్పుకు నాయకత్వం వహించాలని పిలుపునిచ్చారు. బహుజన ఉద్యమాల ఐక్యత ద్వారానే నిజమైన సామాజిక న్యాయం సాధ్యమని అన్నారు. వివిధ బహుజన సంఘాల నాయకులు, విద్యార్థులు, హాజరై, సావిత్రిబాయి పూలే ఆశయాలైన విద్యా సమానత్వం, లింగ సమానత్వం, సామాజిక న్యాయం సాధన కోసం ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ వేడుకలు విద్యార్థుల్లో చైతన్యాన్ని రేకెత్తిస్తూ, సావిత్రిబాయి పూలే చూపిన మార్గం నేటి తరానికి కూడా ఎంత ప్రామాణికమో మరోసారి స్పష్టంగా చాటిచెప్పాయి. ఈ కార్యక్రమంలో బీఎస్ఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షులు వేల్పుల సంజయ్, జై భారత్ రాష్ట్ర అధ్యక్షులు ముప్పారం ప్రకాష్, మహాజన గళం వ్యవస్థాపక అధ్యక్షుడు సురేష్, మహాజన బీఎస్యూ వ్యవస్థాపక అధ్యక్షులు కత్తి వీరన్న, టీవీయూవీ వ్యవస్థాపక అధ్యక్షుడు కంచర్ల బద్రి, ఎస్ఎస్ఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షులు రాజేష్, ఎస్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వేదాంత్ మౌర్య, జై భారత్ గళ్ళ గణేష్, డీబీఎస్ఏ విద్యార్థి నాయకులు సైదులు, రవీందర్, అజయ్, ఆజాం భాయ్, మహమ్మద్ భాయ్ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ఐ ఎస్ ఆర్ టి నేషనల్ కౌన్సిల్ ఆధ్వర్యంలో 2026 క్యాలెండర్ ఆవిష్కరణ

**హైదరాబాద్ :** ఐ ఎస్ ఆర్ టి నేషనల్ కౌన్సిల్ మీటింగ్ శనివారం లకిడికపూల్ లోని వుడ్ బ్రిడ్జి హోటల్ లో నిర్వహించారు. ఈ సమావేశంలో ఐ ఎస్ ఆర్ టి నేషనల్ ప్రెసిడెంట్ మోహన్ లాల్ భగవత్ సమక్షంలో 2026 నూతన క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ డేనియల్, శ్రీకుమార్, ఆదిత్యా, నేషనల్ కౌన్సిల్ సభ్యులు ప్రభాకర్ గౌడ్, టోనీ అంథోనీ, నర్సింహులు, రాష్ట్ర సభ్యులు గంగాధర్, రాజు, రహిమ, మానస, మహదేవ్ చిలాల్, అన్సారీ మిగతా ఎగ్జిక్యూటివ్ మెంబెర్స్ పాల్గొన్నారు.

## అల్ ఇండియా క్రాఫ్ట్స్ మేళ లో ఆకట్టుకుంటున్న నిత్య ప్రదర్శనలు

**మాదాపూర్ :** మాదాపూర్ లోని శిల్పారామంలో అల్ ఇండియా క్రాఫ్ట్స్ మేళ సందర్భాంగా చేనేత హస్తకళా ఉత్పత్తులు సందర్శకులను ఆకట్టుకుంటున్నవి. ఆదివారం సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా భరతనాట్యం, కూచిపూడి, తమిళనాడు రాష్ట్రానికి చెందిన జానపద నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నవి. లండన్ నుండి విచ్చేసిన భరతనాట్య కళాకారులూ వరుణ్ శివకుమార్ ప్రదర్శన, యు.ఎస్ కాలిఫోర్నియా నుండి విచ్చేసిన రాజేష్ చావలి శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శన ఎంతగానో అలరించాయి. సౌత్ జోన్ కల్చరల్ సెంటర్ తంజావూర్ వారు పంపించిన తమిళనాడు రాష్ట్రానికి చెందిన జానపద నృత్య ప్రదర్శన రాజన్ బృందం ఎంతగానో అలరించారు.

## శరభ సేవా సమితి ఆధ్వర్యంలో మకర సంక్రాంతి ఉత్సవాలు

**కొంపల్లి :** కొంపల్లి డివిజన్ పరిధిలోని పోచమ్మగడ్డ కాలనీలో కొంపల్లి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బైరి ప్రశాంత్ గౌడ్ నిర్వహించిన ముగ్గుల పోటీలను ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అశ్రీత హాస్పిటల్ డైరెక్టర్ బర్మా వెంకటేశ్వర్ రావు, మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా లేబర్ సెల్ అధ్యక్షులు కందడి సుదర్శన్ రెడ్డి, దానం పూర్ణచందర్ రావు, అంజి ముదిరాజ్, బైరి శ్రీను, బస్తీ వాసులు ఏశ్వంత కుల్కర్ని, పూర్ణచందర్ గౌడ్, మేడగిరి శ్రీనివాస్, శరభ సేవ సమితి సభ్యులు మనోజ్, సంతోష్, శివాజీ సేవ సమితి సభ్యులు, మహిళలు, చిన్నారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## వెంకట పాపయ్య నగర్ కాలనీ క్యాలెండర్ ఆవిష్కరించిన కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్

**శేరిలింగంపల్లి :** ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని వెంకట పాపయ్య నగర్ కాలనీ కమిటీ కార్యాలయంలో నిర్వహించిన వెంకట పాపయ్య నగర్ సంక్షేమ సంఘం 2026 నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ పాల్గొని వారి చేతులమీదుగా క్యాలండర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రతీ సంవత్సరంలనే ఈసారి కూడా వెంకటపాపయ్య నగర్ అసోసియేషన్ క్యాలెండర్ ను ఆవిష్కరించుకోవడం సంతోషించదగ్గ విషయం అని అన్నారు. ఈ కార్యక్రమంలో సమ్మారెడ్డి, జూపల్లి జనార్దన్ రావు, ఆర్.నాగేశ్వరరావు, దేవేందర్, జీవన్ రెడ్డి, రాందాస్ గౌడ్, వెంకటస్వామి గౌడ్, మహేందర్ రావు, దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జూపల్లి పుట్టినరోజు వేడుకలు

**శుభాకాంక్షలు తెలియజేసిన టీఎస్ ఆర్.ఎం.పి ( డబ్ల్యుయే ) కమిటీ సభ్యులు**



**అశ్వారావుపేట**

అశ్వారావుపేట కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, డైనమిక్ లీడర్ జూపల్లి రమేశ్ పుట్టిన రోజు సందర్భంగా అశ్వారావుపేట టీఎస్ ఆర్.ఎం.పి ( డబ్ల్యుయే ) అధ్యక్షులు ఉస్మాన్(బాబు), మండల సెక్రటరీ పంబి ప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ తాతారావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ వుడా ప్రసాద్, ట్రెసరరి వేల్పుల సత్యనారాయణ, మీడియా కో ఆర్డినేటర్ ఎస్డీ హాజరత్ అలీ మరియు కమిటీ సభ్యులు, రమేశ్, దయాసాగర్ తదితరులు జూపల్లి రమేష్ ని కలిసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన రాజకీయాల్లో మరింత రాణించాలని, నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు, సుఖ శాంతులతో ఉండాలని ఆకాంక్షించారు.

## సావిత్రి భాయి పూలే జయంతి వేడుకల్లో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు



**అశ్వరావుపేట**

మహిళలు విద్యాభివృద్ధి, మహిళల హక్కుల కోసం నిరంతరం కృషి చేసిన తోలితరం మహిళా ఉద్యమకారిణి, మహిళ చైతన్య మూర్తి, సమాజంలో రుగ్మతలు రూపుమాపటానికి విశేష కృషి చేసిన సామాజిక ఉద్యమకారిణి " సావిత్రి బాయి పూలే " జయంతి సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ యువజన విభాగం అశ్వరావుపేట అధ్యక్షుడు సోమని రాజా రమేష్ ఆధ్వర్యంలో రింగ్ రోడ్ సెంటర్ నందు సావిత్రి బాయి పూలే విగ్రహానికి పూలమాల వేసి బీఆర్ఎస్ పార్టీ నాయకులు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్రెసిడెంట్ సంపూర్ణ, తాళం సూరి, ఆరేపల్లి గోవిందు, అఖిల్, కిరణ్, నారం రాజ శేఖర్, చరణ్, మణికంఠ, నాని, రమణ, సత్యనారాయణ, అశ్వరావుపేట నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## సీపీఐ ఆధ్వర్యంలో సావిత్రీభాయి పూలే జన్మదిన వేడుకలు

**మహిళల విద్య,అభ్యున్నతి కోసం కృషి చేసిన సావిత్రి భాయి పూలే**
**సీపీఐ రాష్ట్ర నాయకులు నరాటి ప్రసాద్**




**ములకలపల్లి**

సీపీఐ మండల సమితి ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో సావిత్రి భాయి పూలే 195వ జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు నరాటి ప్రసాద్ మాట్లాడుతూ.. మహిళల విద్య, అభ్యున్నతి కోసం సావిత్రిభాయి పూలే జీవితాంతం కృషి చేశారన్నారు. భారతదేశ తొలి మహిళ ఉపాధ్యాయురాలుగా పేరు గడించారన్నారు. 19వ శతాబ్దపు అజ్ఞానపు చీకట్లను చీల్చుతూ సమాజంలో మహిళలకు, వితంతువులకు, బాలికలకు, అణగారిన వర్గాలకు విద్య కోసం నిరంతరం కృషి చేయడమే కాకుండా విద్యా సంస్థలను నెలకొల్పారని న్నారు. సావిత్రీ భాయి పూలే జన్మదినాన్ని జాతీయ ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించాలని ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి నరాటి రమేష్, ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి అనుముల సాయి, సిపిఐ నాయకులు మిరియాల వెంకన్న పసుపులేటి లక్ష్మిపతి రావు, రమేష్ నకిరికంటి నరసింహ, సాయి జగదీష్, నల్లి నాగరాజు తదితురులు పాల్గొన్నారు.

## జగదాంబ దేవి సేవలాల్ మహారాజ్ ఆలయంలో లలిత సహస్రనామ పారాయణం

**టేకులపల్లి**





పౌర్ణమిని పురస్కరించుకొని టేకులపల్లి మండలంలో జగదాంబ దేవి సేవలాల్ మహారాజ్ ఆలయంలో లలిత సహస్రనామ పారాయణం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్థానికంగా ఉన్న మహిళలు ఎంతో భక్తి భావంతో ఉత్సాహంతో పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన పూజారి గణేష్ మహారాజ్ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందరికి అందజేశారు. ఈ కార్యక్రమంలో గుడిపూడి సబిత, తిరుచి శ్రీదేవి, ఆమేడ రమ, కేశ పద్మజ, ఉప సర్పంచ్ అనంతుల వసంత, అనంతుల పరమేశ్వరమ్మ, నెల్లూరి ధనలక్ష్మి, నెల్లూరు రాణి, గుండ చంద్రకళ బండ్ల, రజిని, గుగులోతు రమాదేవి, నెల్లూరి ఉజ్జేటి, సరోజ నెల్లూరి కౌసల్య కస్తూరి తదితరులు పాల్గొన్నారు.

# హాలో కామ్రేడ్.. చలో ఖమ్మం..!

**సిపిఐ శతాబ్ది ఉత్సవాల భారీ బహిరంగ సభ జయప్రదం చేయండి**

**జిల్లా సిపిఐ నాయకులు గూగులోత్ రామ్ చందర్**






**టేకులపల్లి**

భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ 100 సంవత్సరాల ఉత్సవాల సందర్భంగా ఖమ్మం పట్టణ కేంద్రంలో జనవరి 18న 5 లక్షల మందితో జరిగే భారీ బహిరంగ సభకు వేలాదిగా టేకులపల్లి మండల ప్రాంతం నుంచి కదిలి రావాలని కోరారు. దేశంలో నాడు స్వతంత్ర ఉద్యమం నుండి నేటి వరకు ప్రజల కోసం ఉద్యమించిన ఏకైక పార్టీ సిపిఐ 100 సంవత్సరాలు ఉత్సవాలు జరుపుకోవడం గర్వకారణమని ఖమ్మంలో జరిగే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని కార్యకర్తల కు ప్రజా సంఘాలకు, మహిళలకు, విద్యార్థి యువజన రైతులు, వ్యవసాయ కార్మికులు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని కోరారు. 40 దేశాల నుండి ప్రతినిధులు హాజరవుతున్నారని దేశంలోని అన్ని రాష్ట్రాల నుండి సిపిఐ ప్రతినిధులు శ్రేణులు వేలాదిగా తరలివస్తున్న ఈ బహిరంగ సభను ఎర్ర చొక్కాలు, ఎర్ర చీరలు ధరించి ఖమ్మంలో కదం తొక్కాలని రామచందర్ పిలుపునిచ్చారు. అనంతరం సిపిఐ జిల్లా నాయకులు గోలియా తండా గ్రామపంచాయతీ 8వ వార్డు సభ్యుడు గెలుపొందిన గుగులోత్ రామ్ చందర్ ను మండల కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా శాలువాతో సన్మానించారు. నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలుపుతూ ఈ సందర్భంగా భారీ కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల సహాయ కార్యదర్శి అయిత రాములు, ఐలా నాగార్జున చారి, ఎజ్జు భాస్కర్, గూగులోత్ శ్రీను, దేగల రమేష్, వి సతీష్, టి. మధు టి లక్ష్మణ్, సిహెచ్ కోటేష్, ఈ రాధాకృష్ణ, జె వెంకన్న, జి సోనీ,

## సాయి ఎక్సలెంట్ స్కూలు విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస శిక్షణ

**జూలూరుపాడు**





మండల కేంద్రంలో ఉన్న సాయి ఎక్సలెంట్ స్కూల్లో విద్యార్థిని విద్యార్థులకు క్రమశిక్షణ, నిజాయితీ అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించినట్లు స్కూల్ కరస్పాండెంట్ తెలిపారు. 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు విద్యార్థిని విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస శిక్షణ తరగతులు నిర్వహించారు. అలాగే వ్యక్తిత్వ వికాస శిక్షణ నిపుణులుగా యాటా సురేంద్ర పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడటం జరిగింది. విద్యతో పాటు విలువలు కూడా ప్రతి విద్యార్థికి అవసరమని, ఎంత గొప్ప స్థాయిలో ఉన్నా వ్యక్తిగత క్రమశిక్షణ అనేది విద్యార్థి జీవితాన్ని కూడా మారుస్తుందని, పిల్లలకి జీవిత లక్ష్యము, కమ్యూనికేషన్స్ స్కిల్ వంటి విషయాల పైన అవగాహన కల్పించడం జరిగింది. ఈ సందర్భంగా సాయి ఎక్సలెంట్ స్కూల్ కరస్పాండెంట్ కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ.. విద్యతో కూడిన విలువలను అందించడంలో శ్రీ సాయి ఎక్సెంట్ స్కూల్ ఎప్పుడు కూడా ముందుంటుందని, విద్యార్థులు ఉన్నత స్థితిలో ఉండాలని మేము చేసే ప్రతి ఒక్క కష్టం విద్యార్థి యొక్క జీవితంలో ఉన్నత స్థానంలో ఎదగాలనేదే, కృషితో సాధించి చూస్తే ఉన్నత శిఖరాలను ఎదుగుతారని అన్నారు. అనునిత్యం విద్యార్థులకు కృషి చేస్తూ విద్యా రంగంలో ముందుకు సాగించడమే తన లక్ష్యంగా పనిచేస్తున్నానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శివకుమారి, ఉపాధ్యాయులు అశోక్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల్లో సామాజిక చైతన్యం రావాలి

## ఏటూరు నాగారం సర్పంచ్ కాకులమర్రి శ్రీలత

**మంగపేట**



ప్రజలకు సమాజం పట్ల, ప్రభుత్వ పథకాలు మరియు చట్టాల పట్ల పూర్తి అవగాహన ఉన్నప్పుడే గ్రామాభివృద్ధి వేగంగా జరుగుతుంది అని ఏటూరు నాగారం గ్రామ సర్పంచ్ కాకులమర్రి శ్రీలత పేర్కొన్నారు. శనివారం ఏటూరు నాగారం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో నిర్వహించిన 'ఈనాడు' అవగాహన సదస్సులో ములుగు జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు తో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. ఈనాడు కృషి అభినందనీయమని, దశాబ్దాలుగా నిష్పాక్షిక వార్తలతో ప్రజలను చైతన్యపరుస్తున్న 'ఈనాడు' పత్రిక, ఇప్పుడు నేరుగా ప్రజల వద్దకు వచ్చి ఇలాంటి అవగాహన సదస్సులు నిర్వహించడం చాలా సంతోషకరమని అన్నారు. విద్యార్థులు ఇలాంటి సదస్సులను ఉపయోగించుకుని భవిష్యత్తుపై ఒక స్పష్టమైన అవగాహన పెంచుకోవాలని ఆమె సూచించారు.

**గ్రామస్తుల కోసం..**

ఎంపీడీవో కార్యాలయం ప్రజలందరికీ అందుబాటులో ఉండే ప్రదేశమని, ఇక్కడ ఇలాంటి సదస్సు పెట్టడం వల్ల సామాన్యులకు సైతం ఎంతో మేలు జరుగుతుందని అభిప్రాయపడ్డారు.

**సౌకర్యాల బాధ్యత..**

సదస్సుకు వచ్చిన వారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా గ్రామ పంచాయతీ తరపున అన్ని ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షించామని, భవిష్యత్తులో కూడా ఇలాంటి మంచి కార్యక్రమాలకు తమ పూర్తి మద్దతు ఉంటుందని ఆమె హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్రీలత తో పాటు జిల్లా పార్టీ అధ్యక్షులు లక్ష్మణ్ బాబు, ప్రజా ప్రతినిధులు, ఇతర నాయకులు, ఈనాడు ప్రతినిధులు మరియు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## లింగ గూడెం సర్పంచ్‌కు సన్మానం చేసిన ఆళ్లపల్లి మాజీ ఎంపిపి

**ఆదివాసీ అస్తిత్వం ను కాపాడాలి**

**జవ్వాజి ఆశయాలు కొనసాగించాలి**

**అభివృద్ధిలో ఆదివాసీలను ముందు ఉంచాలి**




**గుండాల**

గుండాల మండలంలో గెలుపొందిన నూతన సర్పంచ్ లకు ఆళ్లపల్లి మాజీ ఎంపీపీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. లింగ గూడెం గ్రామ పంచాయతీ లో సర్పంచ్ ఎన్నికలో ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ నుండి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి గెలిచిన చింత వెంకటేశ్వర్లు ను ఆళ్లపల్లి మాజీ ఎంపీపీ దంపతులు మంజుభార్గవి, కిషోర్ బాబు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆళ్లపల్లి మాజీ ఎంపీపీ మంజు భార్గవి మాట్లాడుతూ.. ఆదివాసీ సంఘాలనుండి స్వతంత్ర అభ్యర్థిగా, ఇన్ని రాజకీయ పార్టీల పోటీలో కూడా లింగ గూడెం గ్రామ పంచాయతీ నుండి సర్పంచ్ గా గెలవడం చాలా అభినందనీయమని అన్నారు. నూతన సర్పంచ్ లు ఏజెన్సీలో ఆదివాసీ చట్టాలు, పిసా చట్టాన్ని అమలు చేసే విధంగా చర్యలు చేపడుతూ ఆదివాసీ లను చైతన్యం పరచే విధంగా సర్పంచ్ ల పాలన ఉండాలని అన్నారు. ఆదివాసీ హక్కులు కోసం నిరంతరం పోరాడిన జవ్వాజి లక్ష్మి నారాయణ ఆశయాలను గుండాల మండలంలో కొనసాగిస్తూ ఆదివాసీ అస్తిత్వంను కాపాడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఈసం సాంబయ్య, మోకాళ్ళ ప్రభాకర్, రవి, రమేష్, సారయ్య తదితరులు పాల్గొన్నారు.

# సమిష్టిగా పని చేస్తేనే మంచి ఫలితాలు సాధ్యం

**కాంగ్రెస్ పార్టీ అంటేనే మోసం...దగా అని అర్థం-**

**మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్**

**జయశంకర్ భూపాలపల్లి :** సమిష్టిగా సమన్వయంతో ముందు చూపుతో పనిచేస్తే మంచి ఫలితాలు సాధించుకోవచ్చని మంథని మాజీఎమ్మెల్యే పుట్ట మధూకర్ అన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మహాముత్తారం మండల కేంద్రంలో శనివారం ముఖ్య కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహాముత్తారం మండలంలో బీఆర్ఎస్ నాయకత్వం పటిష్టంగా ఉందని, గొప్పగా పనిచేస్తున్నారని కొనియాడారు. ఇటీవల జరిగిన స్తానిక సంస్థల ఎన్నికల్లో డబ్బు, అధికారం ఏ మాత్రం పని చేయలేదని అర్థం అవుతుం దన్నారు. డబ్బు అధికారం అక్కడక్కడ మాత్రమే పని చేసిం దని, అనేక గ్రామాల్లో ప్రజలే విజయంసాధించారన్నారు. మన లో కొంత సమన్వయ లోపం ఉందని అంటున్నారని, కానీ కాంగ్రెస్సోళ్లు తెలివిగా పోతున్నారని, మనం అమాయకత్వం తో నమ్ముతున్నామని, జాగ్రత్త పడకపోవడమే మనకు శాపం అవుతుందన్నారు. రాబోయే ఎంపీటీసీ జెడ్పీటీసీఎన్నికల నేపథ్యంలో ప్రతి ఒక్కరు టీం వర్క్ చేసి మన అభ్యర్థులను గెలిపించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. అయితే ప్రస్తుతం గెలిచిన సర్పంచ్‌లకు ప్రలోభాలకు గురి చేసి పార్టీలోకి తీసుకునే ప్రయత్నాలు చేస్తారని, వారి ప్రలోభాలకు, బెదిరింపులకు లొంగవద్దన్నారు. రాష్ట్ర ప్రభుత్వంతో సర్పంచ్‌లకు ఏ పని కాదని, ప్రభుత్వం వద్ద నిధులు లేవని, కేంద్రంనుంచే నేరుగా వస్తాయన్నారు. ఇప్పటికే రెండేళ్లు గడిచిపోయిందని, మరో ఏడాది అటూ ఇటూ వెళ్లినా మరో రెండేళ్లు కష్టపడితే అటు తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ అంటేనే దగా మోసమని, ఏదోపనిచేస్తామంటూ మభ్యపెట్టడం వారి నైజమన్నారు. గతంలో దుద్దిళ్ల శ్రీధర్ మంత్రిగా ఉన్న సమయంలో మంథని మండలం ఎగ్లాస్‌పూర్ గ్రామ పరిధిలోని బైరన్‌గడ్డకు రోడ్డు వేయిస్తానని అక్కడి రాజయ్యతో ఫోన్ మాట్లాడాడని,కానీ ఇప్పటి వరకు రోడ్డు వేయించలేదన్నారు. ఓట్లు వస్తేనే ఏదో చెప్పి బయటపడాలని చూస్తారని, కానీ మహాముత్తారం మండల ప్రజలు మాత్రం చైతన్యంతో ఉన్నారని ఆయన అభినందించారు.



# మహిళా లోకానికే ఆదర్శం సావిత్రీబాయి పూలే

**తాజా మాజీ మున్సిపల్ చైర్పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్**

**జగిత్యాల :** మహిళా లోకానికే సావిత్రీబాయి పూలే ఆదర్శమని తాజా మాజీ మున్సిపల్ చైర్పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ అన్నారు.జగిత్యాల జిల్లా కేంద్రంలో సావిత్రీబాయి పూలే జయంతిని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే జయంతిని అధికారికంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించగా ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఉపాధ్యాయులకు సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఉపాధ్యాయ వృత్తికే వన్నె తేవడమే కాకుండా గొప్ప రచయిత, సంఘ సంస్కర్త, అట్టడుగు వర్గాల అభ్యున్నతికి నిరంతరం కృషి చేసిన మాతృమూర్తి సావిత్రీబాయి పూలే అని మాజీ మున్సిపల్ ఛైర్పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ కొనియాడారు. స్త్రీ అభ్యుదయవాది, అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషిచేసిన వీరవనిత సావిత్రీబాయి పూలే పోరాట స్ఫూర్తిని ప్రతీ ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మాజీ కౌన్సిలర్ మేక పద్మావతీ పవన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# విద్య ద్వారానే స్త్రీ విముక్తి సాధ్యమన్న తొలి ఉపాధ్యాయిని సావిత్రిబాయి పూలే

**ప్రజాసంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పేట భాస్కర్**


**కోరుట్ల :** దేశ తొలి ఉపాధ్యాయిని సంఘసంస్కర్త రచయిత్రి సావిత్రిభాయి పూలే అని ఆమె నిమ్న వర్గాల అభ్యున్నతి కోసం ఎనలేని కృషిచేసిన జ్యోతిరావు పూలే భార్యగా సుపరిచితురాలు అని తెలంగాణ ప్రజాసంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పేట భాస్కర్ అన్నారు.కోరుట్ల సి ప్రభాకర్ స్మారక గ్రంథాలయం లో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను గ్రంథాలయ గౌరవ అధ్యక్షులు చెన్న విశ్వనాథం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమాం లో ముఖ్య అతిథిగా పాల్గొన్న పేట భాస్కర్ మాట్లాడుతూ కులమత బేధాలకు అతీతంగా సమాజాన్ని ప్రేమించిన ప్రేమ స్వరూపిణి సావిత్రిబాయి పూలే అని ఆధునిక విద్య ద్వారానే స్త్రీ విముక్తి సాధ్యపడుతుందని నమ్మిన ఆమె తన భర్తతో కలిసి 1848 జనవరి 1న పూణేలో మొట్టమొదటిగా బాలికల పాఠశాలను ప్రారంభించిందన్నారు. కుల వ్యవస్థకు పితృస్వామ్యానికి వ్యతిరేకంగా శూద్రుల అస్పృశ్యుల మహిళల సకల హక్కుల కోసం పోరాటం చేయటం తమ సామాజిక బాధ్యతగా ఆ దంపతులు విశ్వసించి ఉద్యమించారని భాస్కర్ కొనియాడారు. నూతన వ్యవస్థ కోసం ప్రాణాలను సైతం ఫణంగా పెట్టి సమష్టిగా పోరాటం చేసిన మహనీయులు వారని సమాజంలోని కులతత్వం ధోరణి కలిగిన చాలామంది పండిత మేధావులు అందరికీ కూడా ఆమె కేవలం జ్యోతిరావు పూలే భార్యగా మాత్రమే తెలుసు కానీ ఆమె ఆధునిక భారతదేశంలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు అన్నారు. పీడిత ప్రజల కోసం ముఖ్యంగా స్త్రీల విద్యాభివృద్ధి కోసం ఎనలేని కృషిచేసిన తొలి తరం ఉద్యమకారుని, ఉపాధ్యాయురాలు, స్ఫూర్తి ప్రదాత సావిత్రిబాయి పూలే అని పేర్కొన్నారు. 18 31 జనవరి 3న మహారాష్ట్రలోని నైగాన్ ప్రస్తుత సతారా జిల్లా ఆమె జన్మస్థలం కాగా 1897 మార్చి 10న ఆమె ఈ లోకాన్ని విడిచారు అన్నారు. ఈకార్యక్రమంలో ఐఎఫ్టియూ రాష్ట్ర నాయకులు చింత భూమేశ్వర్, సిపిఐ నేతలు మౌలానా, చెన్న శ్రీనివాస్, లక్ష్మి నారాయణ, న్యాయవాది ప్రేమ్ సాగర్ గ్రంథాలయ పాఠకులు పాల్గొన్నారు.



# సమిష్టి కృషితో సమస్యల పరిష్కారం

**అధ్యక్ష, ప్రధాన కార్యదర్శు లు కొలిపాక సాగర్, ఆకుల సతీష్**

**పెద్దపల్లి :** పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ గుమస్తా సంఘం నూతన కార్యవర్గాన్ని మార్కెట్ యార్డు ఆవరణలో జరిగిన ప్రత్యేక సమావేశంలో సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స భ్యులందరి ఏకాభిప్రాయం మేరకు కొత్త కార్యవర్గాన్ని ప్రకటించుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా మాజీ ఏఎంసీ చైర్మన్ జడల సురేందర్, గంట శ్రీనివాస్, కాసనగొట్టు రత్నాకర్, అధ్యక్షులుగా కొలిపాక సాగర్, ఉపాధ్యక్షులు గా నర్ల గోపాల్ యాదవ్, నలువాల శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శిగా ఆకుల సతీష్, కోశాధికారిగా రేచవేణి ఓదెలు తో పాటు, కార్యవర్గ సభ్యులుగా మొహమ్మద్ అలీ, రావుల గోపీ, పెరుక రాజేందర్, జక్కుల రాజేశం, తౌట తిరుపతి, గణబోయిన మల్లి కార్జున్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన నాయకులు మాట్లాడుతూ గుమస్తా సంఘం లక్ష్యాలు, భవిష్యత్తు కార్యాచరణ వివరించారు. గుమస్తాలందరి సమస్యల పరిష్కారం కోసం, అలాగే సంఘం అభివృద్ధి కోసం నూతన కార్యవర్గం సమిష్టిగా కృషి చేస్తుందని హామీ ఇచ్చారు. గుమస్తాల హక్కుల పరిరక్షణ, వారి సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా పనిచేస్తామ ని వారు పేర్కొన్నారు. ఈ సమావేశంలో పాల్గొన్న పలువురు గుమస్తా సంఘ సభ్యులు, నూతనంగా ఎన్నికైన కార్యవర్గాన్ని ఘనంగా సన్మానించారు. కొత్త నాయకులకు పూలమాలలు వేసి,శాలువాలతో సత్కరించి, వారికి శుభాకాంక్షలు తెలియజేశారు.



## అసెంబ్లీని రేవంత్ ప్యాలెస్‌లా నడిపిస్తున్నారు..

## స్పీకర్‌పై గంగుల కమలాకర్ ఫైర్

**మాజీ మంత్రి గంగుల కమలాకర్**

**హైదరాబాద్ :** ఉమ్మడి రాష్ట్రంలో కూడా ఇన్ని అవమానాలు ఎదుర్కోలేదని మాజీ మంత్రి గంగుల కమలాకర్ తెలిపారు. కిరణ్‌కుమార్ రెడ్డి అప్పట్లో స్పీకర్‌గా ఉండే అని.. ఆ తర్వాత మనోహర్ అయ్యారని.. అయినా ఉద్యమ సమయంలో ఇలాంటి అవమానాలు జరగలేదని పేర్కొన్నారు. ఇక్కడ ఉన్న సభ్యులు అందరికీ సమాన హక్కులు ఉంటాయని అప్పటి స్పీకర్ మనోహర్ తమకు సమయం ఇచ్చేదని గుర్తుచేశారు. కానీ నిన్న అసెంబ్లీలో స్పీకర్ తీరు బాధాకరమని అన్నారు.ఉమ్మడి రాష్ట్రంలో కూడా ఇలా నిర్బంధం చేయలేదని.. మా గొంతు నొక్కలేదని గంగుల కమలాకర్ అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో కాలిపోయిన మోటార్లు, ఎండిపోయిన పంటలను అసెంబ్లీకి తీసుకొనిపోయామని గుర్తుచేశారు. పక్షపాత వైఖరితో ఉండకండి అని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు హితవు పలికారు. మీ వ్యవహార శైలిని మార్చుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రికి ఎలాంటి హక్కు ఉంటుందో అందే అందరు సభ్యులకు ఉంటుందని తెలిపారు. మా హక్కుల కోసమే మాట్లాడామని చెప్పారు.నిన్న అసెంబ్లీలో గిల్లికజ్జాలు పెట్టుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి చూశాడని గంగుల కమలాకర్ అన్నారు. మమ్మల్ని తిట్టేందుకే సభకు వచ్చాడని, కడుపునిండా తిట్టి వెళ్లాడని విమర్శించారు. ప్రశ్నోత్తరాల సమయంలో ముఖ్యమంత్రి రెండు గంటలు మాట్లాడతాడా అని ప్రశ్నించారు. అసెంబ్లీలో ఎజెండా కూడా పొద్దున రెండుగంటలకు ఇస్తారా అని మండి పడ్డారు. ఉపాధి హామీ పథకంపై మాట్లాడటానికి నేను, జగదీశ్ రెడ్డి సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు.ముఖ్యమంత్రిని విమర్శిస్తే మైక్ ఇవ్వమని చెప్పడమేంటని స్పీకర్‌పై గంగుల కమలాకర్ మండిపడ్డారు. ముఖ్యమంత్రికి మేం భజన చేయాలా అని ప్రశ్నించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అసెంబ్లీ హుందాగా నడిచిందని తెలిపారు. గత స్పీకర్ ప్రతిపక్షాలకు తగినంత సమయం ఇచ్చేవారని గుర్తుచేశారు. ప్రస్తుత స్పీకర్ బీఆర్ఎస్ సభ్యుల గొంతు నొక్కేందుకు పనిచేస్తున్నారని విమర్శించారు. అసెంబ్లీని గాంధీ భవన్‌లా, రేవంత్ ప్యాలెస్‌లా నడిపిస్తున్నారని మండిపడ్డారు. రేవంత్ రెడ్డికి భజన చేసేందుకు అసెంబ్లీకి వెళ్లాలా అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## ఫ్యూచర్ సిటీ తర్వాత...

## ముందు మాకు రోడ్డు వేయండి

**ఏండ్లు గడుస్తున్న రోడ్డు పనులు పూర్తి చేయలేదంటూ కుటుంబాలతో కలిసి ర్యాలీ చేపట్టిన అపర్ణ వాసులు**

**కోట్లలో పన్నులు కడుతున్నాం... కనీస వసతులు కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు**

**రంగారెడ్డి :** శేరిలింగంపల్లి నియోజకవర్గం చందానగర్ పోలి?స్ స్టేషన్ పరిధిలో అపర్ణ హిల్ పార్క్, అపర్ణ సిలికాన్, అపర్ణ గార్డెనియాల నివాసితులు శనివారం రోడ్డెక్కారు. తమ ఇండ్లకు వెళ్ళేందుకు సరైన రోడ్డు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని, అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదంటూ అవేదన వ్యక్తం చేస్తున్నారు. కుటుంబాలతో కలిసి ర్యాలీగా రోడ్డుపైకి వస్తేన్నన మా బాధలు అర్థం చేసుకుంటారని వేలాది మందితో అపర్ణ హిల్ పార్క్ నుంచి చందానగర్ జీహెచ్ఎంసి కార్యాలయం వరకు ర్యాలీని నిర్వహించామన్నారు. మియాపూర్ సర్కిల్ ముట్టడించారు. 2023లో ఎమ్మెల్యే గాంధీ మా సమస్యను అసెంబ్లీలో చర్చించడంతో సమస్య తీరుతుంది అనుకున్నాం. కానీ ఆయన మరోసారి ఎమ్మెల్యేగా గెలిచాడే తప్ప మా రోడ్డు పురోగతి సాధించలేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో రోడ్డు నిర్మాణ పనులకు నిధులు మంజూరు చేసిన, నేటి వరకు పనులు పూర్తి చేయలేదని, ఇప్పుడు మరోసారి శంకుస్థాపన చేసి రోడ్డు పై ఏర్పడిన గుంతలను మూస్తూ ప్యాచ్ వర్క్ చేస్తున్నారంటూ మండి పడ్డారు. ప్రజా ప్రభుత్వంలో ప్రజలే ఇబ్బందులకు గురవుతున్నారని, అధికారులు, ప్రజాప్రతినిధులు మాత్రం మంచిగా ఉన్నారంటున్నారు. కోట్లలో పన్నులు చెల్లిస్తున్నాం.. సరైన వస్తతులు కల్పించే బాధ్యత ప్రభుత్వం పై లేదా అంటూ ప్రశ్నించారు. గతుకుల రోడ్డుపై ప్రయాణించాలంటే భయంగా ఉందని, గర్భిణీలు ఈ రోడ్డు పై ప్రయాణం చేయలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇకనైనా అధికారులు, ప్రజాప్రతినిధులు రోడ్డు పనులు పూర్తి చేసి మా ఇబ్బందులు తొలగించాలని కోరుతున్నట్లు తెలిపారు.

## ఇదే కాంగ్రెస్‌కు, బీఆర్ఎస్‌కు ఉన్న తేడా..

## ఉత్తమ్‌పై హరీశ్‌రావు ధ్వజం

**హైదరాబాద్ :** మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు నిప్పులు చెరిగారు. అసెంబ్లీలో ఆడియో, వీడియో ప్రజెంటేషన్ నిర్వహిస్తే సభకు హాజరుకాబోమని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రాసిన లేఖ గుర్తుందా అని ప్రశ్నించారు. టీపీసీసీ అధ్యక్షుడిగా 30-03-2016 న మీరు స్పీకర్‌కు రాసి సంతకం పెట్టిన ఉత్తరం గుర్తుందా? అని నిలదీశారు. "అసెంబ్లీలో ఆడియో?విజువల్ ప్రెజెంటేషన్ నిర్వహిస్తే, అది భారత దేశ పార్లమెంట్ సంప్రదాయాలకు విరుద్ధం. అందుకే మేము సభకు హాజరుకాబోము." అని నాడు టీపీసీసీ అధ్యక్షుడిగా లేఖ రాసి.. నేడు మంత్రి హోదాలో అసెంబ్లీ హాలులో ప్రజెంటేషన్‌కు సిద్ధపడటం.. మీ రాజకీయ ద్వంద్వ వైఖరికి నిదర్శనమని విమర్శించారు.ఆ ఉత్తరంపై నేటి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పద్మావతి సంతకాలు చేశారని హరీశ్‌రావు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అనైతికత, ద్వంద్వ ప్రమాణాలను ఈ ఒక్క ఉత్తరం బట్టబయలు చేస్తుందని విమర్శించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు విలువలు, రాజ్యాంగం, పార్లమెంట్ స్ఫూర్తి వంటి మాటలు వల్లెవేస్తారని.. అధికారంలోకి రాగానే అదే విలువలకు తిలోదకాలు ఇస్తారని మండిపడ్డారు. ఇదే కాంగ్రెస్ పార్టీ అసలు నైజమని వ్యాఖ్యానించారు.అధికార పక్షానికి ప్రజెంటేషన్‌కు అనుమతినిస్తే.. బీఆర్ఎస్‌కూ అదేవిధంగా అనుమతి ఇవ్వాలని బీఏసీ సమావేశంలో, ఉత్తరం ద్వారా స్పీకర్‌ను కోరామని హరీశ్‌రావు తెలిపారు. అయినప్పటికీ ఆ అభ్యర్థనను స్పీకర్ తిరస్కరించారని పేర్కొన్నారు. ఇదే కాంగ్రెస్ పార్టీకి, బీఆర్ఎస్ పార్టీకి మధ్య ఉన్న అసలు తేడా అని స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక.. కాంగ్రెస్ అన్ని సంప్రదాయాలు, పద్ధతులు, మర్యాదలకు భంగం కలిగిస్తూ.. రాజ్యాంగానికే తూట్లు పొడవడాన్ని తన మార్పుగా చూపిస్తోందని ఎద్దేవా చేశారు. ఆ మార్పు అసలు అర్థం ఏమిటో ప్రజలు ఇప్పుడు స్పష్టంగా అర్థం చేసుకుంటున్నారని వ్యాఖ్యానించారు.

## జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్ అమలు

**ముందస్తు అనుమతి లేని ర్యాలీలు, సభలకు పూర్తి నిషేధం**

**వనపర్తి :** జిల్లాలో శాంతి భద్రతలను మరింత బలోపేతం చేయడం, ప్రజా వాతావరణం ప్రశాంతంగా కొనసాగడం, అనవసర గుమికూడింపులు నివారించడం లక్ష్యంగా జనవరి 01 నుంచి పిబ్రవరి 28 వరకు 30 పోలీస్ యాక్ట్?1861 నిబంధనలు అమల్లో ఉంటాయని జిల్లా ఎస్పీ సునిత రెడ్డి, .ఒక ప్రకటనలో తెలిపారు.ఎస్పీ మాట్లాడుతూ.. వనపర్తి జిల్లా పరిధిలో ఎవరైనా పోలీసు ఉన్నతాధికారుల ముందస్తు అనుమతి లేకుండా ధర్నాలు, ర్యాలీలు, బహిరంగ సభలు, భారీ స్థాయి సమావేశాలు నిర్వహించడం కఠినంగా నిషేధం. ప్రజా జీవనాన్ని అంతరాయం కలిగించే, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ఏ చర్యకైనా చోటిలేదు" అని స్పష్టం చేశారు. అలాగే "30 పోలీస్ యాక్ట్" ఉల్లంఘనలకు చట్టంలో స్పష్టమైన శిక్షలు ఉన్నాయి. అనుమతి లేకుండా కార్యక్రమాలు చేపట్టిన వారిపై ఎటువంటి మినహాయింపు లేకుండా చర్యలు తీసుకుంటాం. నిబంధనలు ప్రజల భద్రత కోసం పెట్టబడ్డాయి? అందరూ తప్పనిసరిగా పాటించాలని హెచ్చరించారు. ఎస్పీ ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ ఏ కార్యక్రమం కావాలన్నా ముందుగానే దరఖాస్తు చేసి అనుమతి పొందండి. ప్రజల సహకారం వల్లనే శాంతిభద్రతలు నిలుస్తాయి.

## సి.పి. ఐ సీనియర్ నాయకులు "బోలెమోని"కిమాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి నివాళి.

**వనపర్తి :** కమ్యూనిస్టు ఉద్యమ నేత ప్రస్తుత సి.పి. ఐ నాయకులు బోలెమోని.నాగన్న అనారోగ్యంతో మరణించిన విషయం తెలుసుకున్న మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి వారి ఇంటికి వెళ్లి పార్థీవ దేహానికి పూలమాలలు సమర్పించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ నాగన్న కమ్యూనిస్టు నేతగా, నిస్వార్థ సేవకులుగా ప్రజలకు అందుబాటులో ఉన్నారని ఆదర్శవంతమైన జీవితాన్ని గడిపారని కొనియాడారు వారి ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటూ వారి కుమారుడు సీనియర్ జర్నలిస్ట్ రమేష్ మరియు కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.నిరంజన్ రెడ్డి వెంట బి.ఆర్.ఎస్ నాయకులు ఉన్నారు.